సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 288

సోమవారం 8-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'




రోహిత్, కోహ్లి వచ్చేశారు

అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టులోకి ఎంపిక - 14లో



మీ ఇంటికి బీమా ఉందా?

ప్రమాదాలు, విపత్తులతో నష్టం.. పొదుపుతో కొన్న ఇంటికి పూర్తి రక్షణ - 15లో



13 నుంచి మోదీ ప్రచారం!

ఈ నెల 13న బిహార్‌లోని బేటియా సిటీ నుంచి ప్రధాని మోదీ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు సమాచారం.


వివరాలు 6లో ▸



కార్గిల్‌లో నైట్ ల్యాండింగ్

కార్గిల్ అడ్వాన్స్‌డ్ ల్యాండ్ గ్రౌండ్‌పై సి–130జే సూపర్ హెర్క్యులస్ విమానాన్ని వాయుసేన రాత్రి పూట సురక్షితంగా ల్యాండింగ్ చేసింది.

వివరాలు 6లో ▸



ప్లాస్టిక్ ఆహారం..!

ఆహారంలో హాని చేసే ప్రమాదకరమైన రసాయనాలు ఉంటున్నట్లు ఓ అధ్యయనంలో తేలడం ఆందోళన రేపుతోంది.

వివరాలు 6లో ▸



స్టోర్ రూంలో పడుకోమన్నారు

డేటా బేసిక్స్ కార్పొరేషన్ అధిపతి డాన్ లైల్స్ తనను సంస్థ స్టోర్ రూంలో పడుకోమన్నారని నారాయణమూర్తి చెప్పారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

మోదీపై మాల్దీవుల మంత్రుల నోటి దురుసు



భారత ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రుల అనుచిత వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. కేంద్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. మాల్దీవుల ప్రభుత్వం స్పందించింది. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. వారి వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగతమని, వాటితో ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸

బంగ్లా పీఠంపై మళ్లీ హసీనాయే



బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో అవామీ లీగ్ పార్టీ నెగ్గింది. దీంతో ప్రధానిగా షేక్ హసీనా నాలుగో సారి పగ్గాలు చేపట్టనున్నారు. ఈ ఎన్నికలను ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ బహిష్కరించడంతో షేక్ హసీనా విజయం లాంఛనప్రాయంగా మారింది. ఈ ఎన్నికల్లో కేవలం 40 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది.

వివరాలు 6లో ▸



నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో ప్రారంభానికి సిద్ధమైన ఫిషింగ్ హార్బర్

తీరం మనదే.. వేటా మనదే

నిశ్చింతగా మత్స్యకారులు.. వలసలకు స్వస్తి

- మన తీరంలోనే చేపలు పట్టుకునే వెసులుబాటు
- రూ.3,650 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు
- మినీ పోర్టుల తరహాలో సకల సౌకర్యాలతో హార్బర్ల అభివృద్ధి
- త్వరలో జువ్వలదిన్నె ప్రారంభం.. శరవేగంగా నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్లు

10లో

- 2వ దశలో బుడగట్లపాలెం, ఓడరేవు, పూడిమడక, బియ్యపుతిప్ప, కొత్తపట్నం, మంచినీళ్లపేట హార్బర్లు రెడీ
- 555 మత్స్యకార గ్రామాల్లో 6.3 లక్షల మంది మత్యకారులకు లబ్ధి
- హార్బర్ల నిర్మాణం ద్వారా అదనంగా 4.5 లక్షల టన్నుల మత్స్య సంపద
- రూ.9,000 కోట్ల మేర పెరగనున్న రాష్ట్ర జీడీపీ

జువ్వలదిన్నె సిద్ధం

మన మత్స్యకారుల సుదీర్ఘ నిరీక్షణ ఫలిస్తోంది. ఇన్నాళ్లూ పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన మత్స్యకారులు ఇప్పుడు ఇక్కడే అధునాతన మెకనైజ్డ్ బోట్లతో చేపలు పట్టుకునే వెసులుబాటు అందుబాటులోకి వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 555 మత్స్యకార గ్రామాల్లో 6.3 లక్షల మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుస్తూ 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తుది మెరుగులు దిద్దుకుంటున్న నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె హార్బర్ ప్రారంభానికి ముస్తాబవుతోంది.

లోకేశం మాకొద్దు..

పరువు పోతోంది

తమ్ముళ్ల గగ్గోలు

- ఆయన ప్రసంగాలు, వ్యవహారశైలి బాగోలేదని ఆందోళన.. అందుకే వ్యూహాత్మకంగా పాదయాత్ర తర్వాత లోకేశ్ పర్యటనలకు చంద్రబాబు చెక్
- 'రా కదలిరా', 'జయహో బీసీ' వంటి ముఖ్య కార్యక్రమాలకూ దూరం
- మంగళగిరికే పరిమితమై అప్పుడప్పుడు లోకల్‌గా చక్కర్లు



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీకి 'లోకేశ్' తలనొప్పి పట్టుకుంది. ఆ పేరు వింటేనే ఆ పార్టీ నేతలు బెంబేలెత్తిపోతున్నారు. ఆయన వల్ల పార్టీ పరువుతో పాటు తమ పరువు పోతోందని లబోదిబోమంటున్నారు. తమ నియోజకవర్గాలకు ఆయన రాకుండా చూడాలని ముఖ్యనేతలకు బహిరంగంగానే వేడుకుంటున్నారు. లోకేశ్ ప్రసంగాలు, వ్యవహారశైలి వల్ల ఉన్న ఓట్లు కూడా పోయే పరిస్థితి ఉందని వారు మొత్తుకుంటున్నారు. లోకేశ్ మాట్లాడేటప్పుడు అన్నీ తప్పులు మాట్లాడడం, తెలుగు పదాలు సరిగా ఉచ్చరించలేకపోవడంవల్ల సోషల్ మీడియాలో లోకేశ్ తొలినుంచి

మిగతా 12వ పేజీలో ▶

ఐఎల్ టీ20 టోర్నీలో పాల్గొంటున్నా



- ఈ నెల 20 నుంచి దుబాయ్‌లో జరిగే ఇంటర్నేషనల్ లీగ్ టీ20 టోర్నీలో ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్నట్లు క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. ప్రొఫెషనల్ క్రికెట్ ఆడుతున్నప్పుడు నిబంధనల ప్రకారం రాజకీయాల్లో ఉండకూడదన్నారు.

10లో



బడుగుల ఉత్సాహం

రాజానగరం, ఉరవకొండలో సామాజిక బస్సు యాత్రలకు విశేష స్పందన

2లో

తూర్పుగోదావరి జిల్లా బూరుగుపూడిలో నిర్వహించిన సామాజిక సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

మనసున్న సీఎం జగన్

దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో గిరిజనులకు అత్యధికంగా మేలు

- తెలంగాణలోని మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ ప్రశంసలు
- జగన్ పాలనలో తండాలకు రోడ్లు, నీళ్లు, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం
- సంక్షేమ పథకాలతో గిరిజనులందరికీ లబ్ధి.. రాజకీయంగా అధిక ప్రాధాన్యం
- జగన్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకొని మరింతగా అభివృద్ధి చెందుదాం
- గిరిజన శంఖారావం సభలో గిరిజన సంఘాల నాయకులు పిలుపు

5లో



ఇదంజగత్



ఎప్పుడు విమర్శించాలో చెబుతాం.. కాస్త ఓపిక పట్టండి!!

సుందర విశాఖ.. ప్రగతి వీచిక..

నాలుగేళ్లుగా అభివృద్ధిలో పురోగమిస్తున్న నగరం



విశాఖ బీచ్‌రోడ్డులో అభివృద్ధి చేసిన వీఎంఆర్‌డీఏ పార్క్

- బీచ్ ఐటీ కారిడార్ అభివృద్ధితో క్యూ కడుతున్న దిగ్గజ సంస్థలు
- పర్యాటకాన్ని మరింత కొత్తగా పరిచయం చేస్తున్న ప్రభుత్వం
- పరిశుభ్రమైన బీచ్‌లు.. ఆకర్షణీయమైన టూరిజం స్పాట్స్
- జిగేల్‌మంటున్న జంక్షన్లు.. పచ్చదనంతో ఆహ్లాదమైన పార్కులు
- ఇన్ఫోసిస్ రాకతో అడుగులు వేస్తున్న ఐటీ పరిశ్రమలు
- ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ నిర్మాణంతో తీరిన ట్రాఫిక్ కష్టాలు
- నగర నలు దిశలా విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ రంగం
- వ్యాపార, వాణిజ్యానికి కేంద్రంగా మారుతున్న వైనం

11లో

దళితులు, ఇతరులపై నమోదు చేసిన కేసుల ఉపసంహరణ

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

- రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వివిధ ఆందోళనల సందర్భంగా మాల, మాదిగ సామాజిక వర్గాలతో పాటు ఇతర వర్గాలపై నమోదు చేసిన మొత్తం 36 కేసులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం ఉపసంహరించింది. ఈ మేరకు హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా కేసుల్లోని 350 మందికిపైగా ఆందోళనకారులకు ఊరట లభించింది.

- వివరాలు 5లో

జూ.ఎన్టీఆర్ X టీడీపీ

- ఫ్లెక్సీలతో హడావిడి.. అభిమానుల కొట్లాట
- ఆచంట, తిరువూరులో టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం.. రెండు చోట్లా కానరాని జనస్పందన
- రొటీన్ ప్రసంగంతో ఆకట్టుకోలేకపోయిన టీడీపీ అధినేత చంద్రబాబు

- వివరాలు 10లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

చేనేతల బతుకులు ఇప్పుడు ఆనందమయం



చేనేతే మా జీవనం. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం శివపురం గ్రామంలో మాకు ఓ మగ్గం ఉంది. దానిపై చీరలు వంటివి నేస్తాం. నేను రోజంతా కష్టపడినా ఆశించిన ఫలితం ఉండేది కాదు. పైగా నూలు, ముడిసరుకులు కొనుగోలు చేయడానికి తప్పనిసరిగా అప్పు చేయాల్సి వచ్చేది. నేసిన సరుకు అమ్మడయ్యాక అప్పులు తీర్చేవాళ్లం. దానికోసం నానా కష్టాలుపడేవాళ్లం. నాలుగేళ్ల కిందట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మా జీవితాలలో వెలుగులు వచ్చాయి. వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఈ ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా రూ. 24 వేలు వంతున ఇచ్చింది. ఆ మొత్తంతో చీరలు నేసేందుకు అవసరమైన నూలు, ముడిసరుకులు కొనుగోలుకు అప్పులు చేసే బాధ తప్పింది. గతేడాది ప్రభుత్వం మాపై దయచూపి మగ్గంపని చేయటానికి అవసరమైన కరెంటు మోటారును సబ్సిడీపై ఇచ్చింది. మోటారు విలువ రూ.18వేలు కాగా అందులో 90శాతం సబ్సిడీ పోను రూ. 1800లు మాత్రం మా వాటాగా చెల్లించి మోటారు తెచ్చుకొన్నాం. అప్పటి నుంచి మగ్గం నేసే పని చాలా సులభతరంగా మారింది. ఇప్పుడు శారీరక శ్రమ తగ్గింది. నా పెద్దకుమార్తె అమృత డిగ్రీ పూర్తి చేసింది. రెండో కుమార్తె గౌతమి బీటెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. ఆమెకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద ఏడాదికి రూ.75 వేల చొప్పున రెండేళ్లకు రూ. లక్షా 50 వేలు అందించింది. నా భార్య గతంలో తీసుకున్న డ్వాక్రా రుణ మాఫీకి సంబంధించి వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటివరకూ రూ.40 వేలు అందించింది. జగనన్న ఇళ్ల కాలనీలో స్థలం మంజూరు చేయడంతోపాటు ఆర్థిక సాయం చేయడంతో ఇల్లు కట్టుకున్నాం. గత ప్రభుత్వంలో మేము ఎన్నడూ ఇలాంటి సాయం పొందలేదు. జగనన్నకు మేం రుణపడి ఉంటాము.

– ఎస్.మోహన్, శివపురం. గుర్రంకొండ మండలం, అన్నమయ్య జిల్లా
(కొండేటి మురళీకృష్ణ, విలేకరి, గుర్రంకొండ)

ఏ దిక్కూ లేని నన్ను ప్రభుత్వమే ఆదుకుంది



శ్రీకాకుళం జిల్లాకు చెందిన మేము 30 సంవత్సరాల క్రితం బతుకుతెరువు నిమిత్తం నా భర్త, కుమార్తె, కుమారుడితో కలసి విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం, బాలచెరువుకు వచ్చేశాం. నా భర్త చిన్న చిన్న కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. అయితే విధి మా కుటుంబంపై చిన్న చూపుచూసింది. మా కుటుంబానికి ఆధారమైన నా భర్త సుమారు 20 ఏళ్ల కిందటే మరణించారు. ఆ దుఖంలో ఉండగానే నా పిల్లలు ఇద్దరూ అనారోగ్య సమస్యలతో ఒకరి తరువాత ఒకరు కన్నుమూశారు. మా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో వారికి ఖరీదైన వైద్యం చేయించలేక భర్త, ఇద్దరు పిల్లలను పోగొట్టుకున్నాను. ఒంటరిగా మిగిలిన నేను గంగవరం పోర్టులో కూలి పనులకు వెళ్లేదాన్ని. వయసు పైబడడంతో అక్కడ పని నుంచి నన్ను తీసేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్ని సార్లు అర్జీలు పెట్టుకున్నా కనీసం నాకు పింఛన్ కూడా ఇవ్వలేదు. ఇప్పుడు నా వయసు 73 ఏళ్లు. దిక్కుతోచని స్థితిలో ఉన్న నాకు ఈ ప్రభుత్వం వచ్చాక ఒంటరి మహిళ పింఛన్ మంజూరైంది. నాలుగేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ పింఛన్ అందజేస్తున్నారు. ఆ పెన్షనే నాకు జీవనాధారం. రేషన్ కార్డు ఉండడంతో ఉచితంగా బియ్యం ఇస్తున్నారు. డబ్బుల కోసం ఇప్పుడు ఎవరి దగ్గరా చేయి చాచడం లేదు. సంతోషంగా ఉన్నాను. నాలుగు ముద్దలు నోట్లోకి వెళ్తున్నాయి. ఇక్కడే ఒక చిన్న రేకుల షెడ్డులో అద్దెకు ఉంటున్నాను. నా ఒక్కదాని కోసం ఎందుకని జగనన్న ఇంటి కోసం దరఖాస్తు చేయలేదు. ఈ ప్రభుత్వం చేసిన మేలును ఈ జన్మలో మరచిపోలేను.

– కోడ సీతమ్మ, బాలచెరువు, పెదగంట్యాడ మండలం, విశాఖపట్నం జిల్లా
(ముప్పిడి శ్రీనివాసరావు, విలేకరి, పెదగంట్యాడ)

సర్కారు సాయంతో హాయిగా జీవనం



మాది మధ్య దిగువ తరగతి కుటుంబం. నేను, మా ఆయన శ్రీవెంకట కడియార్ కలసి ఏలూరులో కూలిపనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మా బిడ్డను ఉన్నత చదువులు చదివించాలనేది మా కోరిక. కానీ అంతటి ఆర్థిక స్తోమత మాకు లేదు. అయితే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పిల్లల చదువుకు ఇక బెంగ తీరిపోయింది. మా అమ్మాయి ప్రస్తుతం తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. అమ్మ ఒడి ద్వారా మాకు ప్రతి ఏటా రూ. 15వేలు వంతున అందుతోంది. ఆ మొత్తంతో బిడ్డ చదువుకోవడానికి ఏం కావాలన్నా సమకూర్చ గలుగుతున్నాం. బడిలో యూనిఫాం ఇస్తున్నారు, షూ, టై, స్కూల్ బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇలా అన్ని అవసరాలనూ ప్రభుత్వమే తీర్చుతోంది. మధ్యాహ్న భోజనం కూడా రుచిగా వడ్డిస్తున్న కారణంగా ఇంటి నుంచి భోజనం పట్టుకెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. డ్వాక్రా రుణమాఫీ(వైఎస్సార్ ఆసరా) ద్వారా గత నాలుగేళ్లలో రూ.14,500లు నా ఖాతాలో జమయ్యాయి. మాకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500లు చొప్పున వచ్చింది. జగనన్నకు మా కుటుంబం మొత్తం జీవితాంతం రుణపడి ఉంటాం.

– గంగుల నాగదుర్గ, ఏలూరు
(సీహెచ్ఆర్‌కే రాజు, విలేకరి ఏలూరు)

బూరుగుపూడిలో 'సామాజిక' ప్రభంజనం



'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'.. బుక్‌లెట్‌లను ఆవిష్కరిస్తున్న నేతలు



రాజానగరం నియోజకవర్గ స్థాయిలో బూరుగుపూడిలో నిర్వహించిన సాధికార యాత్రకు హాజరైన అశేష జనసంద్రం

- రాజానగరంలో సామాజిక బస్సు యాత్రకు విశేష స్పందన
- భారీగా తరలివచ్చిన జనం
- బైక్‌లు, కార్లతో పెద్దఎత్తున ర్యాలీ
- వేలాదిగా హాజరైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు

సాక్షి, రాజమహేంద్రవరం : తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం బూరుగుపూడిలో సామాజిక నినాదం మార్మోగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు అశేష సంఖ్యలో హాజరైన జనం బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టారు. 'జై జగన్.. జైజై జగన్' నినాదాలతో రహదారి దద్దరిల్లింది. రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో దోసకాయలపల్లి నుంచి బూరుగుపూడి వద్ద సభా ప్రాంగణం వరకూ పెద్దఎత్తున బైక్, కార్ల ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా మేళతాళాలు, పూలజల్లులు, జేజేలతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చేకూరిన లబ్ధిని గుర్తుచేసేలా మంత్రులు, నేతలు సాగించిన ప్రసంగాలు వింటూ.. రాబోయే ఎన్నికల్లో సీఎంగా మళ్లీ జగన్‌కే పట్టం కడతామని నినదించారు. ఈ సభలో హోంమంత్రి తానేటి వనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, కవురు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సామాజిక విప్లవం: మంత్రి మేరుగు నాగార్జున

సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సామాజిక విప్లవం వెల్లివిరిసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఆత్మగౌరవంతో బతుకుతున్నారు. పిల్లల చదువులకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోంది. రాష్ట్రంలో 31 లక్షల ఇళ్ల పట్టాలిచ్చి పేదల సొంతింటి కలను నిజంచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. రాష్ట్రంలో 12 శాతంగా ఉన్న పేదరికం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆరు శాతానికి తగ్గింది.

సామాన్యుల నేత : ఎంపీ సురేష్

సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాల నాయకుడు. పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా, వ్యవసాయం పండుగ కావాలన్నా మళ్లీ జగనే సీఎం కావాలి. ఆయన పాలనలో బడుగు, బలహీన వర్గాలకు అన్నింటా అగ్రస్థానం లభిస్తోంది. సంక్షేమం, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేసి సామాన్యుల నేతగా ఖ్యాతి గడించారు. పేదలు మరింత బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి.

అన్ని వర్గాలూ ప్రభుత్వంలో భాగస్వాములే : మంత్రి జోగి రమేష్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపులు అందరూ భాగస్వాములే. రాష్ట్రంలో నేడు 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మంత్రి పదవులిచ్చి గౌరవించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. తొమ్మిది మంది రాజ్యసభ సభ్యుల్లో నాలుగు స్థానాలు బీసీలకే ఇచ్చి గౌరవించారు. ఎమ్మెల్సీ, చైర్మన్ స్థానాలిచ్చారు.

సామాజిక న్యాయ నిర్ణేత జగన్: పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ

హామీలన్నీ అమలుచేసిన ఘనత సీఎం జగన్ దక్కుతుంది. జగన్ హయాంలోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమైంది. అలాంటి నేతను తిరిగి అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలి.

175 ఎందుకు ఇవ్వకూడదు? : అలీ

మంచి చేసే నేతను ప్రజలు అభిమానిస్తారు. అందుకు నిదర్శనమే 2019 ఎన్నికల్లో 151 సీట్లతో జగన్‌కు ఘన విజయం చేకూర్చడం. 'వై నాట్ 175' అని సీఎం ప్రతి సమావేశంలో చెబుతుంటారు. ప్రజలకు మంచి చేస్తున్న ఆయన అడిగిన సీట్లు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

నియోజకవర్గ అభివృద్ధి : జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, రాజానగరం

రాజానగరం అభివృద్ధి, సంక్షేమానికి రూ.కోట్లు వెచ్చిస్తున్నాం. నియోజకవర్గంలో అభివృద్ధికి రూ.1,152 కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.1,145 కోట్లు వెచ్చించాం. 20 వేల మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు అందజేశాం. రూ.104 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టాం. రూ.217 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు నాంది పలికాం. గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలు ముంపునకు గురికాకుండా కాపాడేందుకు రూ.91 కోట్లతో తొర్రిగెడ్డ కాలువపై రివర్స్ పంపింగ్ స్కీమ్ ప్రాజెక్టు నిర్మించనున్నాం.

ఉరవకొండలో ఉరిమిన ఉత్సాహం





సామాజిక సాధికార బస్సు యాత్రలో నాయకులు.. నియోజకవర్గ స్థాయిలో ఉరవకొండలో నిర్వహించిన సాధికార యాత్రకు తరలివచ్చిన అశేష జనవాహిని

- సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టిన బడుగులు
- జనసంద్రమైన పాత బస్టాండ్ ప్రాంతం.. అడుగడుగునా జేజేలు
- వైఎస్సార్‌సీపీకి అధికారమిస్తే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం వస్తుందన్న వక్తలు
- రాబోయే 'కురుక్షేత్ర యుద్ధం'లో పేదలు–పెత్తందారుల మధ్యే పోరు ఉంటుందన్న నేతలు

అనంతపురం ఎడ్యుకేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు కల్పించిన సముచిత స్థానాన్ని తెలియజేసేందుకు చేపట్టిన 'సామాజిక సాధికార బస్సు యాత్ర' జైత్రయాత్రలా సాగుతోంది. అనంతపురం జిల్లా ఉరవకొండలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. సభా వేదిక ఏర్పాటుచేసిన పాత బస్టాండ్ ప్రాంతమంతా జన సంద్రమైంది. నియోజకవర్గ నలుమూలల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు తరలివచ్చి బస్సుయాత్రకు బ్రహ్మరథం పట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం వస్తుందని వక్తలు పేర్కొనడంతో పెద్దఎత్తున హర్షధ్వానాలు చేశారు.

ఆత్మగౌరవం నిలబెట్టిన వైఎస్సార్‌సీపీకి అండగా ఉందాం : హఫీజ్‌ఖాన్

ఓట్ల కోసం రాజకీయాలు చేసే వాళ్లు వద్దని.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆత్మగౌరవం నిలబెట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉందామని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పిలుపునిచ్చారు. 2014 ఎన్నికలకు ముందు 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పేద వర్గాలను వంచించారన్నారు. ఆయన హయాంలో కనీసం ఆరు హామీలు కచ్చితంగా అమలు జరిగాయని ఎవరైనా నిరూపిస్తే లక్ష రూపాయలు బహుమానం ఇస్తానన్నారు. పేద వర్గాలను ఎప్పుడూ బానిసలుగా చూసిన చంద్రబాబుకు, ఆ వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న జగనన్నకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. జగనన్న అవసరం మనకు ఉందని, ఆయన్ను ఎప్పటికీ మరచిపోవద్దని హఫీజ్‌ఖాన్ చెప్పారు.

మోసగాళ్ల వైపు చూడొద్దు: తలారి రంగయ్య

రా.. కదలిరా అంటూ తెలుగుదేశం పార్టీ పిలుపునిస్తోందని, అయితే.. ఇప్పటికే వచ్చి తాము (బడుగు, బలహీనవర్గాలు) ఇక్కడ కూర్చున్నామని, ఇంకెవరు వస్తారు.. ఎక్కడికి కదులుతారు అని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య ఎద్దేవా చేశారు. మోసగాళ్ల వైపు చూడొద్దని, సింహం లాంటి జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ మొదలుకుని స్థానిక సంస్థల వరకు జగనన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట వేశారని ఆయన గుర్తుచేశారు. కలలో కూడా ఎవరూ ఊహించని విధంగా ఆయా వర్గాల అభివృద్ధికి బాటలు వేసిన జగనన్నను ఎలా మరచిపోగలమన్నారు.

బలమైన వర్గాలుగా మార్చిన ఘనత జగన్‌దే : మాజీమంత్రి శంకరనారాయణ

రాష్ట్రంలో బలహీన వర్గాలను బలమైన వర్గాలుగా మార్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీమంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ స్థాయిలో ఏ ముఖ్యమంత్రీ సామాజిక సాధికారతకు కృషిచేయలేదన్నారు. 70 శాతం బలహీన వర్గాల వారే పదవుల్లో ఉన్నారన్నారు. చంద్రబాబు బలహీన వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారని విమర్శించారు.

సాధికారత కోసం జగన్ తపన : వై.విశ్వేశ్వరరెడ్డి

అట్టడుగు వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణాల్లోని పేదల సాధికారత కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరితపించారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆయా వర్గాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. పెత్తందారుల వద్ద చేతులు కట్టుకుని నిలబడే పరిస్థితి నుంచి ఆత్మగౌరవంగా నిలబడే స్థాయికి తెచ్చారని ఆయన కొనియాడారు. వచ్చే ఎన్నికల కురుక్షేత్రంలో పేదలు, పెత్తందారుల మధ్య పోటీ ఉంటుందని, పేద వర్గాలే గెలుస్తాయని విశ్వేశ్వరరెడ్డి ధీమా వ్యక్తంచేశారు.

ఈనాడు ఫొటోగ్రాఫర్‌కు జనం మందలింపు..

ఇక ఉరవకొండలో ఆదివారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సభ ముగిసిన తర్వాత ఖాళీ కుర్చీల ఫొటోలు తీస్తున్న ఈనాడు ఫొటోగ్రాఫర్‌ను జనం మందలించారు. ఈ సభకు నియోజకవర్గ నలుమూలల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు భారీసంఖ్యలో తరలివచ్చారు. సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. అయితే.. సభ ముగిసి జనం వెళ్లిపోయిన తర్వాత అక్కడ ఖాళీగా కన్పించిన కుర్చీలను ఈనాడు ఫొటోగ్రాఫర్ ఫొటోలు తీస్తుండగా అక్కడున్న కొందరు దీనిని గమనించారు. సభ ముగిసిపోయిన తర్వాత ఎందుకు ఫొటోలు తీస్తున్నావంటూ ప్రశ్నించారు. ఇందుకు అతను దురుసుగా ప్రవర్తించడంతో జనం మందలించారు. దుష్ప్రచారం చేసేందుకు ఇలాంటి కుయుక్తులు మంచివి కాదని హితవు పలికారు. దీంతో ఫొటోగ్రాఫర్ అక్కడి నుంచి జారుకున్నాడు.

అంగన్‌వాడీలపై ఆదరణ

- మాట ప్రకారం నాలుగున్నరేళ్లుగా ప్రతి నెలా రూ.11,500
- బాబు జమానాలో నెలకు సగటు వేతనం రూ.6,150
- కనీస వేతనం అడిగితే గుర్రాలతో తొక్కించిన బాబు

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీలను అడ్డుపెట్టుకుని విపక్షాలు వికృత రాజకీయాలకు పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్‌వాడీల సమస్యలను అర్థం చేసుకుని ఆదరించింది సీఎం జగన్ ప్రభుత్వమేననే విషయం అందరికీ తెలిసిందే. కనీస వేతనం ఇవ్వమని కోరిన అంగన్‌వాడీలపై చంద్రబాబు సర్కారు అత్యంత కర్కశంగా ప్రవర్తించిన తీరును ఎవరూ మరచిపోలేరు. నాడు అంగన్‌వాడీలను రోడ్లపై పరిగెత్తించి గుర్రాలతో తొక్కించడమే కాకుండా మహిళలని కూడా చూడకుండా బాష్ప వాయువును ప్రయోగించడం చంద్రబాబు నియంతృత్వ పాలనకు నిదర్శనం. చరిత్ర మర్చిపోని దారుణ గాయం అది. అంగన్‌వాడీల కష్టాలను పాదయాత్రలో చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆదుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో కలవరపడిన గత సర్కారు హడావుడిగా అరకొరగా వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించినప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో అందించడంలో ఘోరంగా విఫలమైంది.

రెట్టింపు వేతనాలు..!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచి గత నాలుగున్నరేళ్లుగా అందిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు తొలి రెండేళ్లపాటు నెలకు రూ.4 వేలు, మరో రెండున్నరేళ్లపాటు రూ.7 వేలు, చివరి ఆరు నెలలు రూ.10,500 చొప్పున అందించింది. అంటే నెలకు సగటున అంగన్‌వాడీ వర్కర్లకు చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది కేవలం రూ.6,150, హెల్పర్లకు రూ.3,730 మాత్రమే. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సగటున ప్రతి నెల అంగన్‌వాడీ వర్కర్లకు రూ.11,500, హెల్పర్లకు రూ.7 వేలు చొప్పున అందించడం గమనార్హం.

నీతి అయోగ్ ప్రశంసలు..

దేశంలో అంగన్‌వాడీలకు అత్యధిక వేతనం అందిస్తున్న రాష్ట్రాల జాబితాలో వర్కర్ల వేతనంలో 6వ స్థానం, హెల్పర్ల వేతనంలో 4వ స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలవడం గమనార్హం. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, వేతనాలు, సేవల విషయంలో నీతి అయోగ్ సైతం ప్రశంసలు కురిపించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. బడుగు, బలహీనవర్గాలకు మేలుచేసే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, వాటిలో సేవలందిస్తున్న వర్కర్లు, ఆయాల విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలి నుంచీ సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందనేందుకు ఇదే నిదర్శనం.

నాడు



ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలోని మురారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నేడు



ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలంలోని మురారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

తరగతి మారిపోయింది

నాడు

- ✔ పెచ్చులూడిన స్లాబులు ✔ నెర్రలు బారిన గోడలు
- ✔ విరిగిపోయిన బెంచీలు ✔ కటిక నేలపై చదువులు
- ✔ వస్తారో రారో తెలియని అయ్యవార్లు
- ✔ మచ్చుకైనా కనిపించని వాష్ రూమ్‌లు
- ✔ కొన్ని చోట్ల పశువులకు నెలవు
- ✔ ఎక్కడో ఒక చోట మాత్రమే టీవీలు
- ✔ సబ్జెక్ట్ టీచర్లు కరువు
- ✔ విద్య అనేది ప్రభుత్వ బాధ్యత కాదనేలా ప్రభుత్వ తీరు

నేడు

- ✔ కార్పొరేట్ విద్యా సంస్థలను తలదన్నేలా నూతన భవనాలు
- ✔ చిన్నారులను ఆకట్టుకునేలా పెయింటింగ్స్
- ✔ సైన్స్ ల్యాబ్‌లు ✔ సరికొత్తగా డెస్కులు, కుర్చీలు, ఇతర పరికరాలు
- ✔ రన్నింగ్ వాటర్‌తో టాయిలెట్లు
- ✔ ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు ✔ అదనపు తరగతి గదులు, వంటషెడ్లు
- ✔ పరిశుభ్రమైన మంచి నీరు ✔ ప్రతి పాఠశాలకూ రక్షణ గోడ
- ✔ ప్రతి తరగతి గది డిజిటలైజేషన్ ✔ మొత్తంగా 12 రకాల సదుపాయాలు
- ✔ ఇంగ్లిష్ మీడియం, బైజూస్ పాఠాలు ✔ 3వ తరగతి నుంచే టోఫెల్ శిక్షణ
- ✔ కౌమార దశలోని బాలికలకు స్వేచ్ఛ శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మనబడి నాడు-నేడు' పథకం మొదటి దశలో రూ.3,700 కోట్లతో 15,715 స్కూళ్లను అభివృద్ధి చేసింది.

ఇప్పుడు ఆ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు కూడా అందుబాటులోకి వచ్చాయి. మొదటి దశ ముగిసిన వెంటనే ప్రభుత్వం గతేడాది జులైలో నాడు-నేడు రెండో దశ పనులను రూ.8 వేల కోట్ల వ్యయంతో చేపట్టింది. 22,217 పాఠశాలలను రెండో దశలో ఎంపిక చేసి, నిర్మాణ పనులు ప్రారంభించింది. 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో 2023 మార్చిలో ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వివిధ ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో అత్యధిక మార్కులు సాధించి, మొదటి స్థానాల్లో నిలిచిన 22,768 మంది పిల్లలకు అవార్డులు అందించింది.

- సాక్షి, అమరావతి

క్లుప్తంగా...

ముగిసిన భవానీ దీక్ష విరమణలు

- తరలివచ్చిన మూడున్నర లక్షల మంది భవానీలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భవానీ దీక్ష విమరణలు ఆదివారంతో ముగిశాయి. ఐదు రోజులపాటు కొనసాగిన భవానీ దీక్ష విరమణలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భవానీలు తరలివచ్చి ఇరుముడులను సమర్పించారు. ఉదయం 10.30 గంటలకు ఆలయం సమీపంలోని యాగశాలలో నిర్వహించిన పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. దీక్ష విరమణలకు సుమారు మూడున్నర లక్షల మంది భవానీలు తరలివచ్చారని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కె.ఎస్.రామారావు తెలిపారు. 15 లక్షల లడ్డూలను విక్రయించామని పేర్కొన్నారు.

16న శ్రీవారి పార్వేట ఉత్సవం

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి పార్వేట ఉత్సవం ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నారు. అదే రోజున గోదాపరిణయోత్సవం జరుగనుంది. ఈ ఉత్సవంలో భాగంగా ఉదయం 9 గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్ద జీయర్ మఠం నుంచి ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకు వెళ్లి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు శ్రీమలయప్ప స్వామి వారు, శ్రీ కృష్ణస్వామి వారు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానం, పార్వేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారు ఆలయానికి చేరుకుంటారు. కాగా, ఈ ఉత్సవాల కారణంగా 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సినీ నటులు ప్రభుదేవా, సురేఖవాణి, డ్యాన్స్ మాస్టర్ సుందరం ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా..టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఉన్నారు.

కర్నూలు పెద్దాస్పత్రిలో అరుదైన ఆపరేషన్లు

ముగ్గురి ఆపరేషన్లు విజయవంతం ● ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్రచికిత్సలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్స విభాగంలో మూడు రోజుల్లో ముగ్గురికి మూడు క్లిష్టమైన ఆపరేషన్లను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ వివరాలను కార్డియోథొరాసిక్ హెచ్‌వోడీ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి ఆదివారం వివరించారు.



☛ ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన భాగ్యమ్మ (64)కు గుండెలో మూడు రక్తనాళాలు బ్లాక్ అయ్యాయి. వయసు, గుండె పరిస్థితి రీత్యా ఆపరేషన్ చేయడం చాలా కష్టం. కానీ ఆమెకు అధునాతన బీటింగ్ హార్ట్ సర్జరీ విధానంలో విజయవంతంగా ఆపరేషన్ చేయడం వల్ల కోలుకుంది. ఆమెకు కాలిలో నరాలు కూడా సరిగా లేకపోవడంతో ఛాతిలో నుంచే నరాలు తీసి వేశాం.



☛ వెల్దుర్తి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన పెద్దిరాజు(47) హార్ట్ ఫెయిల్యూర్‌తో ఆసుపత్రికి వచ్చాడు. అతనికి మైట్రల్ కవాటం చెడిపోయింది. యాంజియోగ్రామ్ చేయగా గుండె రక్తనాళాల్లో రెండు బ్లాక్‌లు గుర్తించాం. ఇప్పుడు అతనికి మైట్రల్ కవాటాన్ని మార్చడంతో పాటు బైపాస్ ఆపరేషన్ చేయాలి. మైట్రల్ కవాటాన్ని ప్లాస్టిక్ కవాటంగా మార్చడమే గాక, కాలి నుంచి సిరలను తీసి రక్తనాళాలకు బైపాస్ చేయడం వంటి ప్రక్రియను ఒకేసారి చేశాం. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో అతను కోలుకున్నాడు. పల్మనరి హైపర్ టెన్షన్ అనే సమస్య ఉండటంతో రికవరీ కొంచెం కష్టమైంది.



☛ ఎమ్మిగనూరుకు చెందిన సరోజ(30)కు టీబీ. ఊపిరితిత్తుల్లో ఫంగల్ బాల్ చేరి, దగ్గితే రక్తం పడుతుండేది. ఇది ఒక్కోసారి ఎక్కువగా పడితే ప్రాణాపాయం ఏర్పడుతుంది. దీనిని ఆపడం చాలా కష్టం. ఆపరేషన్ చేసి ఆ ఊపిరితిత్తిని తొలగించడమే మార్గం. దీన్ని సైతం విజయవంతంగా నిర్వహించాం. ఇంత పెద్ద ఖరీదైన ఆపరేషన్లు అన్నీ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా నిర్వహించాం' అని డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

పురుడు పోశారు.. పునర్జన్మనిచ్చారు

- కొండపైన నివాసముంటున్న గర్భిణికి పురిటి నొప్పులు
- 150 మెట్లు ఎక్కి సుఖప్రసవం చేసిన 108 అంబులెన్స్ ఈఎంటీ, పైలెట్
- తల్లీబిడ్డ క్షేమం.. ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు



108 అంబులెన్స్‌లో తల్లీబిడ్డలు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): కొండపైకి 150 మెట్లెక్కి వెళ్లి మరీ ఓ గర్భిణికి పురుడు పోసి పునర్జన్మనిచ్చి స్థానికుల ప్రశంసలు 108 సిబ్బంది అందుకున్న ఘటన విజయవాడలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే... బతుకుతెరువు కోసం కాశీ నుంచి నగరానికి వచ్చిన రోహిత్, హారతి కుటుంబం విజయవాడ భవానీపురం పరిధిలోని కుమ్మరిపాలెం కొండ ప్రాంతంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. నెలలు నిండిన హారతికి నొప్పులు రావడంతో దిక్కుతోచని స్థితిలో రోహిత్ 108 అంబులెన్స్‌కు కాల్ చేశాడు. కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న 108 సిబ్బంది ఆగమేఘాలపై అక్కడకు చేరుకున్నారు. కొండపైన 150 మెట్లు ఎక్కి ఆమె వద్దకు చేరుకున్నారు. నొప్పులు తీవ్రం కావడంతో అల్లాడుతున్న భార్యను చూసి భర్త కన్నీరుమున్నీరుగా విలపించసాగాడు. అక్కడి పరిస్థితిని చూసి చలించిపోయిన 108 అంబులెన్స్ ఈఎంటీ విజయ్, పైలెట్ సందీప్‌కుమార్ తీవ్రంగా శ్రమించి ఆమెకు కాన్పు చేశారు. మగ బిడ్డ జన్మించాడు. క్షేమంగా ఉన్న తల్లీబిడ్డను మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదంతా గమనించిన స్థానికులు శెభాష్ అంటూ 108 సిబ్బందిని అభినందించారు.

సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్

- తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, బిహార్, యూపీ
- కేంద్ర హోంశాఖ నివేదికలో వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ నేరాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని కేంద్ర హోంశాఖ ఓ నివేదికలో వెల్లడించింది. సైబర్ బ్లాక్‌మెయిలింగ్, ఆన్‌లైన్ బ్యాంకు మోసాలతో పాటు ఫేక్‌న్యూస్ వ్యాప్తి కేసుల్లోనూ తెలంగాణ టాప్‌లో ఉందని పేర్కొంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్బీ), నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్పీ) ఆధారంగా కేంద్ర హోంశాఖ 2022 సంవత్సరంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన సైబర్ నేరాలను పరిశీలించి, తాజాగా ఓ రిపోర్టు తయారు చేసింది. దీని ఆధారంగా సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోనుంది. హోంశాఖ రిపోర్టు ద్వారా వెల్లడైన వివరాల ప్రకారం తెలంగాణ, మహారాష్ట్ర, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లు సైబర్ నేరాలకు హాట్ స్పాట్‌లుగా ఉన్నాయి.

ముందు వరుసలో తెలంగాణ

సైబర్ బ్లాక్‌మెయిలింగ్

రాష్ట్రం	కేసులు
తెలంగాణ	234
మహారాష్ట్ర	95
అసోం	70
రాజస్తాన్	51
ఉత్తర్‌ప్రదేశ్	37
గుజరాత్	30
పశ్చిమబెంగాల్	23
హరియానా	21
మధ్యప్రదేశ్	16
పంజాబ్	15

ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు

రాష్ట్రం	కేసులు
తెలంగాణ	3223
మహారాష్ట్ర	909
ఆంధ్రప్రదేశ్	569
ఉత్తర్‌ప్రదేశ్	483
ఒడిశా	434
బిహార్	168
రాజస్తాన్	109
మధ్యప్రదేశ్	99
జార్ఖండ్	88
ఢిల్లీ	72

ఓటీపీ మోసాలు

రాష్ట్రం	కేసులు
తెలంగాణ	2179
ఒడిశా	201
మహారాష్ట్ర	195
ఢిల్లీ	91
ఆంధ్రప్రదేశ్	61
మధ్యప్రదేశ్	43
ఉత్తర్‌ప్రదేశ్	34
ఉత్తరాఖండ్	27
తమిళనాడు	19
రాజస్తాన్	18

ఫేక్ న్యూస్‌లోనూ...

సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వ్యాప్తి చేసిన కేసులు తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉన్నట్టు తేలింది. 2022లో దేశవ్యాప్తంగా 230 ఫేక్ న్యూస్ కేసులు నమోదయ్యాయి. అందులో 81 కేసులతో తెలంగాణ అగ్రస్థానం, 37 కేసులతో తమిళనాడు తర్వాతి స్థానంలో ఉన్నాయి.

క్రెడిట్ కార్డు, ఏటీఎం మోసాల్లో తొలి రెండు స్థానాల్లో బిహార్, తెలంగాణ

దేశవ్యాప్తంగా క్రెడిట్‌కార్డు మోసాలు మొత్తం 1665 నమోదయ్యాయి. ఇందులో 562 కేసులతో బిహార్ మొదటిస్థానంలో, 535 కేసులతో తెలంగాణ రెండోస్థానంలో ఉంది.

☛ దేశవ్యాప్తంగా 1690 ఏటీఎంల్లో మోసపోయిన కేసులు నమోదు కాగా.. వీటిలో బిహార్ 638 కేసులతో తొలిస్థానం, తెలంగాణ 624 కేసులతో రెండో స్థానంలో, మహారాష్ట్ర 144 కేసులతో మూడోస్థానంలో నిలిచాయి.

ఆన్‌లైన్ డేటా చోరీలో నంబర్‌వన్ మహారాష్ట్ర, రెండో స్థానంలో తెలంగాణ

దేశవ్యాప్తంగా 1568 సైబర్ స్టోకింగ్, ఆన్‌లైన్ డేటా చోరీ కేసులు నమోదయ్యాయి. అందులో మహారాష్ట్రలో 585 సైబర్ స్టోకింగ్‌తోపాటు డేటా చోరీ కేసుల్లో తొలి స్థానంలో, 280 సైబర్ స్టోకింగ్ కేసులు, 32 డేటా చోరీ కేసులతో తెలంగాణ రెండో స్థానంలో ఉంది.

సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్ మోసాలు

సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్ సృష్టించి మోసాలకు పాల్పడిన కేసులు దేశవ్యాప్తంగా మొత్తం 157 నమోదయ్యాయి. వాటిలో 48 కేసులతో మహారాష్ట్ర తొలి స్థానం, 33 కేసులతో రాజస్తాన్ రెండో స్థానం, 26 కేసులతో బిహార్ మూడోస్థానం, 14 కేసులతో తెలంగాణ నాలుగోస్థానంలో ఉంది.

సీఎం జగన్ పాలనలో వైద్యులకు గౌరవం

- ఎన్నడూ లేని విధంగా వైద్యుల పోస్టులు భర్తీ
- నాడు–నేడుతో వైద్య కళాశాలలు, ఆస్పత్రుల అభివృద్ధి
- వైద్యుల సమ్మేళనంలో మంత్రి విడదల రజిని



సభలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

గుంటూరు మెడికల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్యులకు పదోన్నతులు ఇచ్చారని, వేతనాలు పెరిగాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఆదివారం గుంటూరులో ఏపీ డాక్టర్స్ ఇంట్రాక్షన్ మీట్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యుల త్యాగాలను ఎవరూ మర్చిపోలేరన్నారు. ఈ సందర్భంగా ఆమె వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో వైద్యవృత్తికి, వైద్యులకు గౌరవం పెరిగిందన్నారు. దివంగతనేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్య వృత్తికి గుర్తింపు తెచ్చారన్నారు. తొలిసారిగా వైద్యులకు యూజీసీ స్కేల్స్ అమలు చేసిన ఘనత డాక్టర్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందన్నారు.

దేశానికే ఏపీ ఆదర్శం

వైద్యులకు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఏడో వేతన స్కేల్‌ను సీఎం జగన్ అమలు చేశారని గుర్తు చేశారు. 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అడిషనల్ డీఎంఈ ప్రమోషన్లు ఇచ్చామని, ఆస్పత్రుల్లో జీరో వేకెన్సీ విధానంతో వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులన్నీ భర్తీ చేస్తున్నామని, ఈక్రమంలో సుమారు 53 వేల పోస్టులు భర్తీ చేశామని చెప్పారు. వైద్యుల రిక్రూట్‌మెంట్‌లో దేశానికే ఏపీ ఆదర్శంగా ఉందని తెలిపారు. రోగులు, ప్రజల అవసరాలను బట్టి నూతనంగా నెఫ్రాలజీ వార్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ట్రైబల్ ప్రాంతాల్లో నియామకాలు చేపట్టి అక్కడి ప్రజలకు ఇబ్బంది లేకుండా వైద్యసేవలు పొందేలా చేశామన్నారు.

నాడు–నేడుతో అభివృద్ధి..

నాడు–నేడు కార్యక్రమంతో రాష్ట్రంలో నూతనంగా 17 వైద్య కళాశాలలను రూ.8,500 కోట్లతో ప్రారంభించామన్నారు. వాటిల్లో నేడు ఐదు కళాశాలలు ప్రారంభమైనట్లు చెప్పారు. గతంలో ఉన్న 11 మెడికల్ కాలేజీలను రూ.3,820 కోట్లు ఖర్చుపెట్టి అభివృద్ధి చేశామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి టీచింగ్ ఆస్పత్రి వరకు రూ.17,000 కోట్లతో అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. వ్యాధులు వచ్చాక చికిత్స అందించే ఆస్పత్రులను బలోపేతం చేయడంతోపాటు, వ్యాధులు రాకుండానే ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. దీన్లో భాగంగా ప్రివెంటివ్ మెడికల్ కేర్ ఏర్పాటు చేశామన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా పేదల ఇళ్లకే వైద్యులు వెళ్లి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఇళ్ల వద్దకే వైద్య సిబ్బంది వెళ్లి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారని పేర్కొన్నారు.



చెడ్డ జ్ఞాపకశక్తి వల్ల ఉన్న ప్రయోజనం ఏమిటంటే, చాలాసార్లు అవే మంచి విషయాలను మొదటిసారి విన్నట్టుగా ఆనందించగలగడం!

– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

సోమవారం, 8 జనవరి 2024

ఒక ప్రవాహం

మనుషుల మీద లేబుల్స్ వేయడంలో మనకు ఒక సౌలభ్యం ఉంటుంది. దానివల్ల వారిని అంచనా కట్టడానికి ఒక పరిధి ఏర్పడుతుంది. కానీ భూమ్మీద ప్రవాహంలా బతికేవాళ్లు కొందరుంటారు. ఆ ప్రవాహంలో అన్నింటినీ తమలో ఇముడ్చుకుని పోతారు. సాగిపోవడమే వారి లక్షణం. ఆగిపోవడం వారికి తెలియని గుణం. వారు ఏమిటి? అని ప్రశ్న వేసుకున్నప్పుడు, వారు ఏమిటి కాదు? అనే మరో ప్రశ్న ఎదురొస్తుంది. ఆ రెండు ప్రశ్నల మధ్యే వారి జీవితం గురించిన ఒక జవాబు దొరుకుతుంది. 150 ఏళ్ల క్రితం ఫ్రాన్స్‌లోని నార్మండీలో జన్మించిన (1873 జనవరి 28) 'కొలెట్' ఒక సజీవ ప్రవాహం. చాలా కారణాల వల్ల ఫ్రెంచ్ సమాజపు సాహిత్య సాంస్కృతిక జీవితాన్నీ, తద్వారా ప్రపంచాన్నీ ఆమె ప్రభావితం చేశారు. 'చెరి', 'జిజి', 'ద వేగబాండ్', 'ద ప్యూర్ అండ్ ది ఇంప్యూర్' లాంటి రచనలు చేసిన కొలెట్ జీవితం ఆమె రచనలంతే ఆకర్షణీయం.

తన పేరును కేవలం ఏకపదంగా రాసుకున్న 'కొలెట్' పూర్తి పేరు సిడోనీ–గాబ్రియెల్ కొలెట్. ఆమె జీవితంలోని వివాహపు అధ్యాయం పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీ ఉనికి పరిమితులను చెబుతుంది. కేవలం కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించడానికి పద్నాలుగేళ్ల పెద్దయినవాడితో వివాహానికి ఒప్పుకొంది. భర్త హెన్రీ గౌథియర్ విల్లర్స్ కలంపేరు 'విల్లీ'. సమాజంలో ప్రతిష్ఠ ఉన్నవాడు. అతడి ప్రఖ్యాతి ఎంతటిదంటే 'ఘోస్టు రైటర్స్'తో పుస్తకాలను రాయిస్తుండేవాడు. ''నీ ప్రాథమిక పాఠశాల జ్ఞాపకాలను కాగితం మీద పెట్టు,'' అని నూతన వధువుకు కూడా చెప్పాడు. మనోరంజకమైనవి ఉంటే వదిలిపెట్టొద్దనీ, వాటిని తాను ఏదోలా వాడుకుంటాననీ కూడా అన్నాడు. కొలెట్ సహజంగానే రైటర్ మెటీరియల్. ఆమె రాతలను విల్లీ ముందు కొంచెం అనుమానించినా, వాటిని 1900లో 'క్లాడైన్ ఎట్ స్కూల్' నవలికగా తెచ్చాడు. ఒక పాఠశాల బాలిక కౌమార దశను వాస్తవికంగా చిత్రించిన ఈ రచనకు వెంటనే పేరొచ్చింది. సాహిత్యంలో కౌమార బాలిక గొంతుక వినిపించింది. ఆత్మ కథాత్మక సాహిత్యానికి పథనిర్దేశిత అయ్యింది. వీటి మూల రచయిత్రి కొలెటే అని సాహిత్య లోకం అనంతర కాలపు ఆమె రచనల శైలిని బట్టి నిర్ధారించుకుంది కానీ అప్పటికి అధికారిక రచయిత విల్లీనే. అమ్మకాలు పెరగడంతో భార్య మీద ఒత్తిడి పెట్టాడు. ఒక దశలో గదిలో బంధించి, తర్వాతి ఇన్‌స్టాల్‌మెంట్ ఇచ్చేంతవరకూ విడిచిపెట్టలేదు. ఈ వేధింపులు సహిస్తూనే, కొనసాగింపు నవలికలు 'క్లాడైన్ ఇన్ పారిస్', 'క్లాడైన్ మేరీడ్' రాసింది కొలెట్. క్లాడైన్ పాత్ర ఎంత హిట్టయ్యిందంటే, ఆ థీమ్‌తో సిగరెట్లు, లింజెరీ, పెర్‌ఫ్యూమ్ కూడా విల్లీ ప్రారంభించాడు.


విల్లీ ఆమెను సాహిత్యంలోకి ప్రవేశపెట్టినా, మేలుకొన్నాక, అయన్ని జీవితంలోంచి బయటికి నెట్టేసింది కొలెట్. కానీ రాయల్టీల డబ్బులు లేకపోవడంతో స్టేజీ నటిగా పనిచేసింది. 1907లో తనే రాసిన 'ద ఫ్లెష్' సంగీత రూపకంలో స్టేజీ మీద ఎడమ చన్నును ప్రదర్శించడం పెద్ద కల్లోలం సృష్టించింది. ఇక, 'మౌలిన్ రూజ్'లో తన స్నేహితురాలు 'మిస్సీ'ని బహిరంగంగా ముద్దుపెట్టుకోవడం దుమారం లేపింది. ఈ మొదటి ప్రదర్శన తర్వాత పోలీసులు దాన్ని సాగనివ్వలేదు. బహిరంగంగా వాళ్లు తమ లెస్బియన్ బంధం గురించి ప్రకటించడం కూడా అప్పటి సమాజానికి విఘాతంలా తగిలింది. దీనివల్ల ఎవరికీ కంటబడని స్థలాల్లో కొంతకాలం బతకాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే, స్వలింగ శృంగార సాహచర్య ప్రదర్శనల తాలూకు ధిక్కార బీజాలు ఇలా మొదలయ్యాయని అనుకోవచ్చు.

కొలెట్ అంటే ఒక స్కాండల్. పరస్పర వైరుద్ధ్యంగా కనబడే ఎన్నో అంశాలు ఆమె జీవితంలో కనబడతాయి. ప్రపంచమంతా యూదుల పట్ల పట్టింపుతో ఉన్నప్పుడు, నాజీలతో జట్టుకట్టి, యూదు వ్యతిరేక భావనలు ఉన్న రచనలు చేశారు. తాను ఎంత స్వేచ్ఛగా బతికినప్పటికీ, ఓటు హక్కు కోరే స్త్రీలను కొరడాతో బాదాలన్నారు. జర్నలిస్టుగా పనిచేశారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధరంగం నుంచి వార్తలు పంపారు. ఒక సాహిత్య పత్రికకు సంపాదకురాలిగా పనిచేసినప్పుడు, ఎంతోమంది యువ రచయితలను ప్రోత్సహించారు. సుమారు యాభై పుస్తకాలను వెలువరించిన కొలెట్, పది గంటల పాటు ఏకధాటిగా కూడా రాసేది. ''కొలెట్ స్త్రీవాది అవునో కాదో నిర్ణయించాల్సింది ఆమె కాదు'' అని ఆమెను స్త్రీవాదిగానే సాహిత్య లోకం తర్వాత గుర్తించింది. సాధారణ మనుషులు కోరుకునే నైతిక చట్రంలోకి ఇమడని కొలెట్ ఒక బైసెక్సువల్. కుమారుడి లాంటి బాలుడితో ప్రణయం కొనసాగించారు. 'మాంసం' అనేది ఆమెకు చాలా ఇష్టమైన మాట. వాంఛకు అది సంకేతం. ''ప్రేమ, నా కలానికి బ్రెడ్ అండ్ బటర్'' అన్నారు. అందం పట్ల ఆమెకు మితిమీరిన పట్టింపు. వృద్ధాప్య ఛాయలు పొడసూపగానే 'ఫేస్–లిఫ్ట్' చేయించుకున్నారు. తన శరీరంలో ఏర్పడిన ముడతలను ద్వేషించారు. పాశ్చాత్య దేశాల్లోనూ విడాకులు తీసుకున్నవాళ్లకు మన్నన లేని కాలంలో, రెండు సార్లు విడాకులు తీసుకున్నారు. ఆ కారణంగా ఆమె మరణించినప్పుడు ధార్మిక క్రతువులు నిరాకరించబడ్డాయి.

''చనిపోయిన తర్వాత కూడా కొలెట్ ఎంత సుదీర్ఘకాలం బతికింది!'' అన్నారు 1967లో జర్నలిస్ట్ జానెట్ ఫ్లానర్. ఆ మాట అన్న యాభై ఏళ్ల తర్వాత కూడా కొలెట్ బతికేవుంది. ఆమె జీవితం ఇప్పటికీ ఆసక్తిగొలుపుతూనే ఉంది. ఆమె మీద పుస్తకాలు, సినిమాలు వస్తూనే ఉన్నాయి. మంచో చెడో కొలెట్ రూపంలో ఒక ఉత్సాహం ఈ భూమ్మీద కొన్నాళ్లు తిరగాడిందని మనం అనుకోవచ్చు. అయినా చెడు అని ఎందుకనాలి!

కొత్త నిర్ణయాలు తీసుకుందాం!

కామెంట్



కరణ్ థాపర్

కొత్త సంవత్సరంలో వ్యక్తులుగా మనం కొన్ని తీర్మానాలు చేసుకుంటాం. అదే విధంగా మనమంతా ఒక దేశంగా కూడా కొన్ని తీర్మానాలు చేసుకోవాలి. పార్లమెంటులో సభా సమయాన్ని దుర్వినియోగం చేయబోమని ఎంపీలూ, చర్చల పేరుతో జనాల మధ్య గొడవలు సృష్టించబోమని టీవీ యాంకర్లూ తీర్మానించుకోవాలి. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించకుండా వాహనాలను ధ్యాసగా, జాగ్రత్తగా నడుపుతామని మనం సంకల్పం చెప్పుకోవాలి. కానీ మూణ్ణాళ్లకే ఈ తీర్మానాలన్నీ వట్టి ముచ్చటగా మారిపోతే? అసలీ తీర్మానాలు తీర్చేవా, మార్చేవా? దీనికి ఒకటే జవాబు. తీర్చడం, మార్చడం కళ్లకు కనిపించపోవచ్చు. కానీ, అసలంటూ కొత్త నిర్ణయం తీసుకోవటం అన్నదే సంకల్ప సాధనలోని నిబద్ధతకు మొదటి మెట్టు అని గుర్తించాలి.

పూతకొచ్చే తీర్మానాలకు కొత్త సంవత్సరం ప్రియమైన రుతువు అయినప్పటికీ, వాటిల్లో చాలా వరకు ఎక్కువ కాలం జీవించి ఉండవు. గొప్ప ఉత్సాహపు ధ్వనితో మొగ్గ తొడిగి, చప్పుడే కాని పరిహాసపు గాలివానలతో టప్పున నేల రాలేందుకే అవి చిగురిస్తాయి. అయినప్పటికీ, మనమంతా ఒక దేశంగా కొన్ని తీర్మానాలను స్వీకరించాలని నేనిప్పుడు సూచించబోవడం మీకొక ప్రశ్నార్థకం అవొచ్చు. దీనికి చాలా సులభమైన జవాబే ఉంది. చేయాలని అనుకున్న దానిలో నిబద్ధత కొరవడినా, ఏం చేయవలసిన అవసరం ఉన్నదో దానిని ఒక సంకల్పంలా తీసుకోవడమే అసలొక తీర్మానం. కనుక ఈ కొత్త సంవత్సర ఆరంభంలో ఆ మొదటి అడుగు వేద్దాం. 'సంకల్పం' అనే అడుగు.

మొదటిది, ఒకటేంటంటే మన రాజకీయ నాయకులు చేయవలసినది. పార్లమెంటులో ఎంతో విలువైన ప్రజాసమయ దుర్వినియోగానికి పాల్పడే విధంగా తమ ప్రవర్తన ఉండకూడదని వారు తీర్మానం చేసుకోవాలి. వాళ్లు అక్కడ కూర్చున్నందుకు మీకు, నాకు అవుతున్న ఖర్చు నిమిషానికి 2 లక్షల 50 వేల రూపాయలు. ఈ ఖర్చును మనం సంతోషంగానే భరిస్తున్నాం. ఎందుకంటే, నిజాలను నిగ్గు తేల్చేందుకు, ప్రభుత్వ పనితీరును ఎత్తిచూపేందుకు, నిశిత పరిశీలనకు; అవినీతిని, అసమర్థతను బహిర్గతం చేయడానికి... ప్రశ్నలు, చర్చలు తప్పనిసరి అని మనం విశ్వసిస్తాం. అటువంటిది... సభ 'వెల్'లోకి దూసుకెళ్లే, స్పీకర్‌పై రంకెలు వేసే, సభకు గైర్హాజరు అయ్యే ఎంపీలకు మన కష్టార్జితాన్ని ఎందుకు ఖర్చుపెట్టాలి? 16వ లోక్‌సభ (2014–19) సభా సమయం 1,615 గంటలు కాగా, అందులో 16 శాతం సమయాన్ని అంతరాయాలు, వాయిదాల కారణంగా కోల్పోయాం. ఆ కోల్పోయిన సమయానికి అయిన ఖర్చు రూ. 39 కోట్లు.

మన ప్రజాప్రతినిధులుగా, మనం వారికి నిధులు సమకూరుస్తున్నాం కనుక, ఆ విలువకు సమానమైన సేవలను మన ఎంపీలు మనకు అందించాలి. అందుకు మనం అడుగుతున్నదల్లా పార్లమెంటు సమర్థంగా, అర్థవంతంగా పనిచేయాలని! వారి నుండి ఈ కొత్త సంవత్సరం మనకు ఇలాంటి హామీ లభిస్తుందా?

తర్వాత, ప్రెస్! ఇక్కడ నా ఉద్దేశం ప్రెస్ అంటే ప్రధానంగా టెలివిజన్ న్యూస్ చానెళ్లు. టీవీ వీక్షకులు డబ్బు చెల్లిస్తారు కనుక ముఖ్యమైన వార్తల్ని ఆశించే హక్కు వారికి ఉంటుంది. ఏది ముఖ్యమైన వార్తో నిర్ణయించడానికి అనేకమైన ప్రామాణికాలు ఉంటాయన్న దాంట్లో సందేహమేమీ లేదు కానీ, చివరికొచ్చేటప్పటికి ప్రధానంగా ప్రాముఖ్యం, ఔచిత్యం, సమతౌల్యం అనేవి లెక్కలోకి వస్తాయి.

కనుక టీవీ వాళ్లకు నేను చెప్పేదేమిటంటే, దయచేసి మీరు







సినిమా తారలు, క్రికెటర్ల పట్ల మీకున్న మక్కువను వదులుకోండి. 'బ్రేకింగ్ న్యూస్' కోసం మీ పరుగులను ముగించండి; బదులుగా కచ్చితత్వం పైన, విశ్లేషణ మీద దృష్టి పెట్టండి; మరీ ముఖ్యంగా... సాగతీతల్ని ఆపేయండి. ఏ వార్తా కథనానికైనా తన సహజమైన నిడివి ఉంటుంది. కేవలం ప్రసార సమయాన్ని భర్తీ చేయడానికి ఆ నిడివిని పొడిగించుకుంటూ పోకండి. గుర్తుంచుకోండి. మేము పెద్దవాళ్లం; మమ్మల్ని పిల్లల్లా చూడకండి; మేము తరచు పిల్లల్లా స్పందిస్తున్నా కూడా

అలాగే, మన యాంకర్లకు ఎవరైనా చర్చల లక్ష్యం జనం మధ్య గొడవలు సృష్టించడం కాదని చెప్పగలరా... ఆ జనం ఒకవేళ గొడవలకు సిద్ధంగా ఉన్నప్పటికీ! చర్చ అనేది ప్రజాభిప్రాయాన్ని రాబట్టేందుకు... అది కూడా ఒక వివేచనతో, వీలైతే తక్కినవారికి భిన్నంగా, పూర్తిగా తమదైన ప్రత్యేకతతో ఉండాలనీ... చర్చకు వచ్చిన అతిథులు తమతో ఏకీభవించేలా యాంకర్లు వారిపై మాటల బల ప్రయోగం చేయకూడదనీ వీక్షకులుగా ఈ కొత్త సంవత్సరంలో మనం ఆశపడదాం.

చివరిగా, మనమంతా ప్రతిజ్ఞ చేయవలసిన అవసరం ఉన్న విషయం – సురక్షితంగా వాహనం నడపడం. పద్ధతిగా, తెలివిడిగా నడపాలి. వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు రద్దీని దాటేందుకు వేరే వైపు మళ్లకండి. ఎర్ర రంగు పడటానికి ముందు ఆరెంజి రంగులోకి సిగ్నల్ మారినప్పుడు మీ అదృష్టంపై నమ్మకంతో జంక్షన్‌లో మీ వాహనాన్ని ముందుకు దూకించకండి. ఇంకొక సంగతి, మీరు మీ కారును పార్క్ చేస్తున్నప్పుడు వేరొకరి గేటుకు కానీ, తోవకు కానీ అడ్డంగా నిలుపుతున్నారేమో గమనించండి. ఇక మన డ్రైవింగ్ ఎలా ఉండాలనే దానికి ఎల్లవేళలా వర్తించే సాధారణ నియమం – రోడ్డుపై మీరే కాకుండా ఇంకా చాలామంది వాహనం నడుపుతూ ఉంటారు కనక – రోడ్డుపై మీకున్నంత హక్కే వారికీ ఉంటుందని గ్రహించడం!

మరీ పాత సంగతి కాదు కానీ, సిగరెట్ తాగడం మొదలుపెట్టాలని నాకొక కొత్త సంవత్సర తీర్మానం ఉండేది. గడియారం సరిగ్గా రాత్రి పన్నెండు కొట్టగానే నా వేళ్ల మధ్య సిగరెట్ వెలుగుతుండేది. మర్నాడు సాయంత్రమంతా ఉమ్మడం, దగ్గడం! 'సిగరెట్ తాగకపోవడం' అనే వ్యసనాన్ని దూరం చేసుకోడానికి నేను ఎంచుకున్న మార్గం అది. అయితే జనవరి చివరినాటికి నా తీర్మానం పట్టు సడలిపోయేది. అది వ్యసనంగా మారుతుందేమోనన్న భయం నా చేత సంతోషంగా సిగరెట్ మాన్పించేది. అలా నేను దానికి దూరంగా ఉండటం జరిగేది.

ఈ సంవత్సరం నేను మరింత పెద్ద సవాలును స్వీకరిస్తున్నాను. టీవీలో ఇంటర్వ్యూ ఇచ్చేందుకు వచ్చే నా అతిథులకు అంతరాయం కలిగించడాన్ని మానుకోవాలని నిర్ణయించుకున్నాను. బదులుగా, వారిని తమ ఊకదంపుడుకు, అదే పనిగా మాట్లాడేందుకు అనుమతిస్తాను. వాళ్లేం మాట్లాడినా, మాట్లాడవలసిన దానిని వాళ్లసలే మాట్లాడకపోతున్నా – మీరు, మిగతా వీక్షకులు అరచి నిరసన తెలియజేసే వరకు వాళ్లకు అడ్డుతగలనే తగలను. 'వద్దు కరణ్, మీరు మీ పాత భౌభౌమనే రాట్‌వైలర్ జాతి శునకం స్టైయిల్‌కి వచ్చేయండి' అంటూ తొలి విజ్ఞాపన పత్రం నాకు అందినప్పుడు మాత్రమే నేను ఎప్పటిలా నా పాత శైలికి వచ్చేస్తాను.

మరి అలాంటి విజ్ఞాపన పత్రం ఒకటి ఎప్పటికీ రాకపోతే? మా ప్రియమైన పోస్ట్‌మ్యాన్ నేను ఎదురు చూసే క్రిస్మస్, న్యూ ఇయర్ కార్డులన్నిటినీ ఎక్కడో తారుమారు చేసి ఉండొచ్చని అనుకోవాలి. ఏ సంగతీ ఏదో ఒక విధంగా త్వరలోనే మీకు తెలుస్తుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



శక్తికి మించి...

మాల్దీవులు ఎంత శక్తిమంతమైన దేశం అంటే, 1988లో కేవలం 100 గన్ మెన్లకు అది లొంగిపోయింది. దాన్ని కాపాడటానికి ఇండియన్ ఆర్మీ, నేవీ ఆపరేషన్ కాక్టస్ చేపట్టవలసి వచ్చింది. టూరిజంలో ఆరోగ్యకరమైన పోటీ మంచిదే గానీ మాల్దీవుల ర్యాడికల్స్ తమ మాటలను గమనించుకుంటే మంచిది.

– దివ్య కుమార్ సోఢీ, భద్రతాంశాల విశ్లేషకుడు



ఇలా అయితే...

పొద్దున పార్కులో కొందరు పిల్లలు ఆడుతుంటే, ఇంటికెళ్లి చదువుకోవచ్చు కదా అన్నాను. ఓ 8–9 ఏళ్ల పిల్లాడు మేమంతా ఇంట్లోనే చదివామని చెప్పాడు. దేశానికి రాష్ట్రపతి ఎవరు అని అడిగాను. డాక్టర్ జవహర్ లాల్ నెహ్రూ అన్నాడు. వాళ్ల తండ్రికి ఈ విషయం చెప్పాను. పరిస్థితి బాలేదు అన్నాడు. పిల్లాడిది కాదు, మీది బాలేదు అన్నాను.

– ఎస్.సి. ఆస్థానా, మాజీ పోలీస్ అధికారి



సింపుల్ ప్లాన్

నాకు తగిన బరువు తగ్గే దినచర్య ఇన్నాళ్లకు దొరికింది. ఆగస్ట్ నుంచి 7 కిలోలు తగ్గాను. ఆశ్చర్యకరమైనది – చక్కెర. ఒక్క చక్కెరను పూర్తిగా తొలగించుకున్నందువల్ల నా బరువు తగ్గే ప్రక్రియ వేగవంతమైంది. అలాగే అద్భుతమైన నడక వ్యసనం! రోజుకు 5–6 కిలోమీటర్లు నడవగలనని ఏడాది క్రితం అనుకోలేదు. ఇక, రాత్రి 6:30–7 తర్వాత తినేది లేదంటే లేదు. మొదట్లో కష్టంగా ఉన్నా తర్వాత అలవాటవుతుంది.

– రీతూపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్



అసలు పెట్టుబడి

ఉసేన్ బోల్ట్ 3 ఒలింపిక్సుల్లో 8 బంగారు పతకాలు గెలుచుకున్నాడు. ట్రాక్ మీద 115 సెకన్ల కంటే తక్కువ సమయం పరుగెత్తి 11.9 కోట్ల డాలర్లు ఆర్జించాడు. కానీ ఆ 2 నిమిషాల కోసం అతడు 20 ఏళ్లు శిక్షణ పొందాడు.

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త



స్పష్టత కోసం

పాశ్చాత్య దేశాల్లో చర్చికీ, రాజ్యానికీ మధ్య విభజన తప్పకుండా ఉండాల్సింది. భారత్‌లో మతానికీ, తత్వానికీ మధ్య విభజన తప్పకుండా ఉండాల్సింది. మన ఆలోచన స్పష్టంగా ఉండాలంటే, కొన్నింటిని కలపకూడదు.

– జోసెఫ్ టి.నూనీ, థింకర్

ఇన్ బాక్స్

యుద్ధం అంటే ఉబలాటమా?

ఉత్తర కొరియా అధ్యక్షునికి మతి భ్రమించినట్లు ఉంది. లేకపోతే యుద్ధానికి సిద్ధంగా ఉండండని తమ దేశ రక్షణ వ్యవస్థను ఆదేశిస్తాడా! యుద్ధాలు ఎటువంటి విపత్కర పరిస్థితులను తెస్తాయో, ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా దెబ్బ తింటుందో అతడికి తెలియంది కాదు. ఇటీవల ప్రయోగించిన కొన్ని క్షిపణులు విజయవంతం కావడంతో అతడు ఇటువంటి దుందుడుకు పిలుపులకు ఒడిగట్టినట్లు అర్థమవుతోంది. ఇప్పటికే రష్యా– ఉక్రెయిన్, ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య జరుగుతున్న యుద్ధాలు ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ పిలుపు మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఉత్తర కొరియాకు రష్యా, చైనా వంటి అగ్ర దేశాల అండదండలు ఉన్నాయి. అందుకే అది తనకు ఉన్న శక్తి సామర్థ్యాలను అతిగా ఊహించుకొంటూ అమెరికాపై కాలు దువ్వుతోంది. అమెరికాను యుద్ధంలోకి లాగడానికి దక్షిణ కొరియాపై దాడి చేయాలనేది ఉత్తర కొరియా ఎత్తుగడలా ఉంది.

ఇక్కడ కిమ్ ఒకటి గుర్తు పెట్టుకోవాలి. అభేద్యమైన అగ్రదేశం అమెరికాతో పెట్టుకుంటే అది కొరివితో తల గోక్కున్నట్లే అని గ్రహించాలి. కేవలం ప్రమాదకర రసాయన ఆయుధాలు ఉన్నాయనే అనుమానంతోనే ఇరాక్ లాంటి దేశాలను సర్వ నాశనం చేసింది అమెరికా. తనకు అండగా ఉంటాయని భావిస్తున్న రష్యా, చైనాలు అప్పుడూ ఏమీ చేయలేకపోయిన సంగతిని ఉత్తర కొరియా అధ్యక్షుడు గుర్తుపెట్టుకోవాలి. కిమ్ తమ దగ్గర ఉన్న ఆయుధాలను చూసి రెచ్చిపోతున్నట్లు కనిపిస్తోంది. అయితే అమెరికా దగ్గర ఇంతకన్నా శక్తిమంతమైన ఆయుధాలు ఎన్నో ఉన్న విషయం మరచిపోరాదు. అనవసర ప్రకటనలు చేసి అంతర్జాతీయ అశాంతికి తాను కారకుడు కాకూడదు. ఐక్యరాజ్య సమితి కూడా ఉత్తర కొరియా దూకుడుకు కళ్లెం వేయలేకపోతున్నది. రష్యా– ఉక్రెయిన్, ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య జరుగుతున్న యుద్ధాలను ఆపలేని ఐక్యరాజ్య సమితి నిస్సహాయతను గ్రహించాడు కాబట్టే కిమ్ ఇలా దుందుడుకు ప్రకటనలతో ప్రపంచ శాంతికి అవరోధం కల్పిస్తున్నాడు అనిపిస్తుంది. చర్చల ద్వారానే అన్ని సమస్యలూ పరిష్కరింపబడతాయి. విశ్వం శాంతిగా ఉంటుంది. ఆ రోజు కోసం ఎదురు చూద్దాం.

– కనుమ ఎల్లారెడ్డి; ఆస్టిన్, అమెరికా

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

కొత్త ఏడాదిలో ఎదురు చూడాల్సిన ఘటనలు

వేగంగా మారే ప్రపంచంలో రేపు ఏమవుతుందో ఊహించటం కష్టమే, కానీ కొత్త సంవత్సరం యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొన్ని సంఘటనలను మోసుకొస్తోంది. అమెరికా, మెక్సికో ఎన్నికలు కావచ్చు; ఒలింపిక్, పారా ఒలింపిక్ పోటీలు కావచ్చు; ఒకేసారి అటు ఫ్లూను, ఇటు కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కోటానికి టీకా తేవటం కావచ్చు; సంపూర్ణ సూర్యగ్రహణం, చంద్రుని మీదకు మనుషుల్ని పంపేందుకు నాసా ప్రయోగం కావచ్చు. అన్నీ ఆసక్తికరమైనవే!

ఏప్రిల్ 8వ తేదీన మెక్సికో, అమెరికా, కెనడాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం ఆవిష్కారం అవుతోంది. 2017 ఆగస్టు 21న భూమికి, సూర్యునికి మధ్య చంద్రుడు ప్రవేశించి సూర్యుణ్ణి కప్పేసింది. 1918 జూన్ 8న కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. మళ్లీ 2044 దాకా అమెరికన్ ప్రజలకు ఇలాంటి అవకాశం దక్కదని నిపుణులు చెబుతున్నారు. నాసాకు చెందిన 'ఆర్టెమిస్ 2' మిషన్ చంద్రుని మీదకు నవంబర్‌లో నలుగురు వ్యోమగాములను పంపుతోంది. 1972లో అపోలో ఆర్టిమెస్ 2 మిషన్ తర్వాత నాసా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

ఆరోగ్యం, వైద్య రంగాల్లో కొన్ని పరిణామాలను చూద్దాం. కరోనా కొత్త వేరియంట్లు పుట్టుకొస్తూనే ఉంటాయి. ఇది పూర్తిగా అంతరించిపోయే పరిస్థితులు ఇప్పట్లో లేవనేది కఠిన వాస్తవం. దీర్ఘకాలం కొనసాగే కోవిడ్ కోడ్‌ను విచ్ఛిన్నం చేసే కొత్త వ్యాక్సిన్ల కోసం శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ఒకేసారి అటు ఫ్లూను, ఇటు కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కోగల టీకా రూపుదిద్దుకుంటోంది. ఇది ఈ ఏడాదే మార్కెట్లో వచ్చే అవకాశం ఉందంటున్నారు. ప్రతి సంవత్సరం లక్షల మంది ప్రాణాలను బలిగొంటున్న మలేరియాను నివారించేందుకు పలు ఆఫ్రికా దేశాలలో యాంటీ వైరల్ వ్యాక్సిన్‌ల పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు. 'ఆర్21/మ్యాట్రిక్స్–ఎం' ఇంతకు ముందు ఉన్న వ్యాక్సిన్ కంటే సమర్థంగా పనిచేస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే సర్టిఫై చేసింది. బ్రెజిల్‌లో 'నాన్ ప్రాఫిట్ వరల్డ్ మస్కిటో ప్రోగ్రామ్' ప్రారంభమవుతోంది. ఇందులో పట్టణ ప్రాంతాల్లో మాడిఫైడ్ మస్కిటోలను విడుదల చేస్తారు. ఈ దోమలు బ్యాక్టీరియాను కలిగి ఉంటాయి. అవి వైరస్ వ్యాప్తి కాకుండా అడ్డుకుంటాయి. దీని ప్రభావంతో డెంగ్యూ లాంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి ప్రజలు తప్పించుకోవచ్చు.

ఈ ఏడాది క్రీడారంగంలో సమ్మర్ ఒలింపిక్స్, ప్యారిస్‌లో నిర్వహించే పారా ఒలింపిక్స్ ప్రముఖమైనవి. బ్రేక్ డ్యాన్సింగ్ అనేది క్రీడగా తెరముందుకొస్తోంది. స్త్రీ పురుష క్రీడాకారులు సమాన సంఖ్యలో పోటీపడతారు. అమెరికా ఎన్నికల కంటే మెక్సికో ఎన్నికలను ప్రపంచదేశాలు ఆసక్తిగా చూస్తున్నాయి. చరిత్రలో మొట్టమొదటిసారిగా ఇద్దరు మహిళలు అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్నారు. అమెరికాలో 81 ఏళ్ల ప్రస్తుత అధ్యక్షుడు



బైడెన్ డెమోక్రటిక్ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. నవంబరు 24 ఎన్నికల్లో ఆయన గెలిచి అధికారం చేపట్టి నాలుగేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేయగలిగితే, అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన అతి పెద్ద అమెరికన్ అవుతారు. రిపబ్లికన్ల తరఫున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోటీ పడుతున్నారు. గత ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కోవటానికి ఆయన చేసిన ప్రయత్నాల కారణంగా ఫెడరల్, స్టేట్ క్రిమినల్ ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ట్రంప్‌తో పాటు ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్, మాజీ అమెరికన్ రాయబారి నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి తదితరులు కూడా రేసులో ఉన్నా, నిక్కీ హేలీకి అవకాశం ఉందన్న ప్రచారం ఉంది. ఇక పోతే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమయిన భారత్ లోనూ మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు ఉంటాయి. మరోవైపు అధిక జనాభా, ఒత్తిడి, పర్యావరణ ప్రభావం తదితర పరిణామాల కారణంగా ఇండోనేషియా తన రాజధానిని మార్చాలని నిర్ణయించింది. వరద ప్రభావానికి గురవుతూ సముద్రంలోకి జారుతున్న జకార్తాకు బదులుగా బోర్నియాలోని అటవీ ప్రాంతాన్ని ఎంచుకుంది. దీనికి 'నూసాంతర' అని పేరు పెట్టారు. 2019లోనే రాజధాని మార్పు ప్రారంభమైనా, అది 2024లో ఒక రూపాన్ని సంతరించుకుంటుందని భావిస్తున్నారు.

ఇకపోతే ఫేస్ బుక్ (మై స్పేస్) 20వ వార్షికోత్సవాన్నీ, అమెజాన్ 30వ వార్షికోత్సవాన్నీ జరుపుకుంటున్నాయి. పౌరహక్కుల చట్టానికి 60 ఏళ్లు, వింటర్ ఒలింపిక్స్‌కు 100 ఏళ్లు, ఈఫిల్ టవర్‌కు 135 ఏళ్ళు వస్తాయి. వాషింగ్టన్ లోని నేషనల్ ఆర్ట్ గ్యాలరీ, ప్యారిస్ లోని ముస్సే డీఓర్సెల 150 సంవత్సరాల వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నారు. 130 మంది రీనాయిర్, మొనట్, డేగస్ లాంటి ప్రసిద్ధ వ్యక్తుల 130 చిత్రాలను ప్రదర్శించనున్నారు. 'ప్యారిస్ 1854 ఇంప్రెషనిస్టు మూమెంటు'ను రెండు మ్యూజియమ్‌లలో ప్రదర్శించనున్నారు.

ద్రవ్యోల్బణం నెమ్మదించటం, స్టాక్ మార్కెట్ ఊపు అందుకోవటం తదితర కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇది ఆశావహ పరిణామంగా చెప్పుకోవాలి. జెన్నీఫర్ లోపెజ్ 20 ఏళ్ల తర్వాత ఓ కొత్త ఆల్బమ్‌ను విడుదల చేస్తోంది.

ఈ ఏడాది గేమర్స్ అందరూ 'ఫైనల్ ఫ్యాంటసీ' పైన ఆసక్తి చూపుతున్నారు. ఈ రంగంలో నిష్ణాతునిగా పేరు గాంచిన జెఫ్ మింటర్... కొత్తగా 40 గేమ్స్‌ను ప్రవేశ పెడుతున్నారు. ఈ ఏడాది లీపు సంవత్సరం... అంటే తెలుసుగా... ఫిబ్రవరిలో 29వ తేదీ కూడా ఉంటుంది. ప్రతి నాలుగేళ్లకోసారి వచ్చే ఈ సందర్భం ఫిబ్రవరి 29న పుట్టిన వ్యక్తులకు పండగే. హ్యాపీ బర్త్ టూ యూ!

– డాక్టర్ పార్థసారథి చిరువోలు
సామాజిక విశ్లేషకుడు

గెలుపు సూత్రం

'ది ఐడియల్ వర్షిపర్, వైల్ నాట్ నెగ్లెక్టింగ్ హిజ్ డ్యూటీ విల్ ప్లే హిజ్ పార్ట్, సెట్టింగ్ రిజల్ట్ ఎసైడ్' అంటుంది గీతను గూర్చి 'వరల్డ్ సివిలైజేషన్' అనే పుస్తకం. మనిషి ఏ పని ప్రారంభించినా 'గెలుపు' కోసమే అనుకుంటే, ఆ పరుగులో పని చేసే విధానం కూడా ప్రధానాంశమే కదా!' చేస్తున్న పనిని 'బాధ్యత మర్చిపోకుండా' నిర్వహిస్తూ 'ఆనందం' పొందమనే గీతాచార్యుని బోధ.

మనిషి జీవితంలో గెలుపునకు అంత ప్రాధాన్యం ఉందా? దానికోసం 'తపన, తాపత్రయం అవసరమా' అని ప్రశ్నించేవారు ఉన్నారు. అవసరమైన (కొత్త) పనిని ప్రారంభించే ముందు 'గెలుపే' కదా ప్రాధాన్యం. అయితే ఇందులో ఆనందం పొందుతూ చేయడం అనేది ప్రధానం. మహాభారత యుద్ధంలో అర్జునుడు క్షత్రియుడు. 'యుద్ధం' (పని) చేస్తేనే 'రాజ్యం' (విజయం) లభిస్తుంది. ఆ సమయంలో అతను ఆనందాన్ని (యుద్ధ కోరిక) చంపేసుకున్నాడు. పిరికితనం, భయం (తన వారనే వ్యామోహం) అతనిని ఆవహించాయి. కార్యోన్ముఖుణ్ణి చేశాడు కృష్ణుడు. అర్జునుడు నడుం బిగించాడు. విజేతగా నిలిచాడు. ప్రతీ మనిషి జీవితంలో ఇందు కోసమే గీతను జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి.



సంపాదన వేటలో గెలుచుకుంటూ పోతున్న వ్యక్తి వెనుకకు తిరిగి చూసుకుంటే ఓ 'అస్పష్ట విజయం' అతనిని నిరాశలా కమ్మేస్తుంటుంది. అంతిమ లక్ష్యం 'ఆత్మహత్య' అనుకుంటున్నారు. కానీ... ఒక్కసారి 'గీత'ను చేతిలోకి తీసుకొని పేజీలను తిప్పితే పరిష్కారం బోధపడుతుంది.

'గీ' అంటే త్యాగం. 'త' అంటే తత్వ జ్ఞానం. ఈ రెండిటిని బోధించేదే 'గీత'. భగవద్గీత 'కర్మ' సిద్ధాంతాన్ని కానీ, కర్మ సన్యాసాన్ని కానీ చెప్పదు. కర్మఫల త్యాగం గురించి చెబుతుంది. తెలుసుకోవాలనుకునే వారికి 'కావలసినంత' జ్ఞానామృతం 'గీత'లో ఉంది. మనిషి జనన మరణాల మధ్య కాలాన్ని ఆద్యంతం 'ఆనందం'గా, చిద్విలాసంగా, 'విజయవంతంగా' పూర్తి చేసుకునేందుకు అనేకానేక వ్యక్తిత్వ కోర్సు సూత్రాలు ఇందులో ఉన్నాయి. మనిషి తన గొప్పతనాన్ని గుర్తించినంతగా, బలహీనతలను గుర్తించడు. అలా తెలుసుకొని 'మేలుకోమని' 'గీత' చెబుతుంది.

– భమిడిపాటి గౌరీశంకర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.ద్వాదశి రా.9.17 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: అనూరాధ రా.7.58 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.1.36 నుండి 3.12 వరకు, దుర్ముహూర్తం: ప.12.29 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.43 నుండి 3.31 వరకు, అమృతఘడియలు: ఉ.9.13 నుండి 10.51 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.34, సూర్యాస్తమయం: 5.32.

క్లుప్తంగా...

నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్నా..

- అసత్య ప్రచారాలను నమ్మొద్దు
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి తాను పోటీచేస్తున్నానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. తనపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని చూస్తే తనకే ఆశ్చర్యం కలుగుతోందని చెప్పారు. అందుకే తాను కొన్ని మీడియాల్లో, సోషల్ మీడియాల్లో వచ్చే అసత్య కథనాలను పట్టించుకోనన్నారు. ఎటువంటి అపోహలు వద్దని, తాను వైఎస్సార్‌సీపీ తరఫున నెల్లూరు లోక్‌సభ స్థానానికి పోటీచేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.

బయటకు పొత్తులు.. మనసులో కత్తులు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు బయటకు పొత్తులు, మనసులో కత్తులు అన్నట్టుగా నడుస్తున్నాయని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం ఆయన పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ పొత్తులు, పోటీలు గత పదేళ్లనుంచి చూస్తూనే ఉన్నామన్నారు. టీడీపీ ఏనాడూ ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి రాలేదన్నారు. తాజా పొత్తుల్లో ఎప్పుడు ఎవరిని ఎవరు పొడుచుకుంటారో తెలియని పరిస్థితి ఉందని వ్యంగ్యంగా అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని తెలిపారు. ఎన్నికల తర్వాత ఈ రెండు పార్టీలు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని చెప్పారు.

మాజీ మంత్రి అమరనాథరెడ్డికి చుక్కెదురు

- మా ఇళ్లకు రావొద్దంటూ ఆయన పర్యటనను బహిష్కరించిన రెండు గ్రామాలు



మాకు జగనే బాగా చేశాడు.. మళ్లీ మీరెందుకొచ్చారంటున్న గడ్డిండ్లుకు చెందిన మహిళ

బైరెడ్డిపల్లి/పలమనేరు(చిత్తూరు జిల్లా): 'అమరన్నా.. 'మీ టీడీపీ పాలనలో మాకు చేసేందేమీ లేదు. జగనన్న పాలనలో అన్ని పథకాలు పొంది సంతోషంగా ఉన్నాం. మీరు మా ఇళ్లకాడికి రావొద్దు సామీ' అంటూ పలమనేరు నియోజకవర్గంలోని లక్కనపల్లి పంచాయతీ పెద్దపురం, గడ్డిండ్లు గ్రామాలకు చెందిన ప్రజలు తెగేసిచెప్పారు. ఈ మేరకు వారు ఇంటింటికీ తెలుగుదేశం, మీ భవిష్యత్తుకు మేము గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం బహిష్కరించారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆదివారం బైరెడ్డిపల్లి మండలంలోని లక్కనపల్లి పంచాయతీలో పర్యటించారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దపురం, గడ్డిండ్లు గ్రామస్తులు తమ ఇళ్లకు జగనన్న పాలనలో అందిన సాయానికి గుర్తుగా అంటించిన స్టిక్కర్లను చూపుతూ జగనన్నకే మా ఓటు అంటూ నినాదాలు చేస్తూ స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలను తీసుకొన్నారు. ఆపై గ్రామంలోకి మాజీ మంత్రి అమర్ రాకముందే ఇళ్లకు తాళాలు వేసుకొని పొలాల వద్దకు చేరుకున్నారు. తమకు వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని పథకాలు అంది తాము సంతోషంగా ఉన్నామని తెలిపారు. మీరు గత ఎన్నికల్లో హామీలిచ్చినట్టు ఎన్ని చెప్పినా మేం నమ్మమని భీష్మించారు. అందుకే మీ పర్యటనను బహిష్కరిస్తున్నామంటూ వెళ్లిపోయారు. ఈ విషయం తెలియని మాజీ మంత్రి ఆ గ్రామాల్లోకి వెళ్లి మూతబడిన ఇళ్లను చూసి అవాక్కయ్యారు. చేసేది లేక టీడీపీ అనుచరుల ఇళ్లకు మాత్రమే వెళ్లి అక్కడి నుంచి వేరే గ్రామాలకు జారుకున్నారు.

బీసీల అభివృద్ధే బీజేపీ అజెండా

ఓబీసీ జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్

ఎంవీపీకాలనీ(విశాఖపట్నం): రానున్న ఎన్నికల్లో బీసీల అభివృద్ధే తమ పార్టీ అజెండాగా ముందుకువెళ్తామని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. తొలి నుంచి దేశంలో బీసీలకు తమ పార్టీ పెద్ద పీట వేస్తుందని తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీసీ సామాజిక చైతన్య సభ విశాఖపట్నం ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానం వేదికగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణ్ మాట్లాడుతూ... దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధికంగా ఉన్న పెద్ద పార్టీగా బీజేపీ ఖ్యాతి గడించిందని గుర్తు చేశారు. దేశంలో ఉన్న 70 కోట్ల మంది బీసీల రాజకీయ ప్రాధాన్యం, ఆర్థిక అభివృద్ధే ప్రధాన ఎజెండా అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి నరేంద్ర మోదీ దేశ ప్రధాని కావడం ఖాయమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. బీసీ కులాలకు లబ్ధి చేకూర్చే విధంగా విశ్వకర్మ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని తెలిపారు.



ఏలూరు జిల్లా కన్నాపురంలో లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



నంద్యాల జిల్లా క్రిష్టిపాడులో సుజానమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్వాతి



విశాఖలోని ఆస్పత్రిలో శ్యామలకు పింఛన్ అందజేస్తున్న విజయనగరం జిల్లా సంతకవిటి వలంటీర్ రమేష్



కాకినాడ జిల్లా పెద్దాపురంలో వెంకటలక్ష్మికి చేనేత పింఛన్ అందిస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



తెనాలిలో మంగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉషాదేవి

అవ్వాతాతల దీవెన మధ్య పెన్షన్ పెంపు సంబరాలు

- వాడవాడలా వేడుకలు
- సీఎం జగన్‌ను మనసారా దీవిస్తున్న పింఛనుదారులు

సాక్షి, అమరావతి: లక్షలాదిమంది అవ్వాతాతలు, వితంతు, చేతి వృత్తిదారుల దీవెనల మధ్య రాష్ట్రమంతటా పెన్షన్ రూ.3,000కు పెంపు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ముందు చెప్పిన మాటను చెప్పినట్లే అమలు చేస్తూ పెన్షన్‌ను రూ.3,000కు పెంచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అవ్వాతాతలు జేజేలు కొడుతున్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో తాము ప్రతి నెలా పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి గంటల తరబడి ఆఫీసుల వద్ద క్యూలైన్లలో వేచి ఉండే పద్ధతులను పూర్తిగా మార్చి.. ఇప్పుడు ప్రతి నెలా ఠంఛన్‌గా.. పండుగైనా, ఆదివారమైనా, ఇతర సెలవు రోజయినా వలంటీర్లు తమ ఇంటికే వచ్చి పెన్షన్ డబ్బులు ఇచ్చే విధానం తీసుకొచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మనసారా దీవిస్తున్నారు. ఈ నెల నుంచి పెన్షన్‌ను రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచిన నేపథ్యంలో.. ఒకటోతేదీ నుంచి 8వ తేదీ వరకు మండల, మున్సిపాలిటీల వారీగా స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ లబ్ధిదారులతో మమేకమవుతూ పూర్తి పండుగ వాతావరణంలో వేడుకలా పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. జనవరి ఒకటోతేదీ నుంచి ఆదివారం (7వ తేదీ వరకు) 700 మండలాలు, మున్సిపాలిటీల్లో ఉత్సవ కార్యక్రమాలు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ఆదివారం 15 మండలాల్లో ఉత్సవాలు కొనసాగాయని, సోమవారం మిగిలిన 24 మండలాల్లో ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు.

సంక్షేమం కొనసాగింపు జగన్‌కే సాధ్యం

- మిగిలిన ఏ పార్టీలూ సంక్షేమ ఫలాలు కొనసాగించలేవు
- వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలదే..
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య



దాబాగార్డెన్స్ (విశాఖపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ అయననే సీఎంగా గెలిపించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు ఏ ప్రభుత్వం వచ్చినా కొనసాగించలేవని కుండబద్దలుగొట్టారు. మరే పార్టీకి సంక్షేమ ఫలాలు అందించే సత్తా లేదన్నారు. సంఘ సంస్కర్త జగన్‌ను గెలిపించుకోవల్సిన బాధ్యత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలపై ఉందని తెలిపారు. అయన ఆదివారం నగరంలోని ఓ హోటల్లో విలేకరులతో మాట్లాడారు. అధికారం కోసం ప్రతిపక్ష పార్టీలు బీసీలను ప్రలోభపెడుతున్నాయని, అటువంటి వాటిని తిప్పికొట్టాలన్నారు. బీసీల కోసం అనేక సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని స్పష్టంచేశారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో బీసీ ముఖ్యమంత్రులున్నప్పటికీ అయా రాష్ట్రాల్లో కూడా ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ ఫలాలు అమలుకావడం లేదన్నారు. స్వాతంత్య్రం వచ్చిన ఇన్నేళ్లలో ఏ నాయకుడు ప్రవేశపెట్టని, అమలుచేయలేని ఎన్నో సంక్షేమ పథకాలు జగన్ ప్రవేశపెట్టి దేశంలో వివిధ రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు.

70 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు

దాదాపు 70 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కృష్ణయ్య చెప్పారు. శాసనసభ స్పీకర్ పదవి బీసీ, శాసనమండలి చైర్మన్ ఎస్సీ వర్గానికి ఇవ్వడమే గాక 18 మంది ఎమ్మెల్సీల్లో 11 సీట్లు బీసీలకు కేటాయించడం చూసి దేశంలోని బీసీలంతా ఆశ్చర్యం వ్యక్తంచేశారన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంట్ చరిత్రను జగన్‌మోహన్‌రెడ్డి తిరగరాశారన్నారు. అందుకు వైఎస్సార్ సీపీ రెండేళ్ల కిందట బీసీ బిల్లు పెట్టిందని, మద్దతుగా 14 రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టిందన్నారు. అధికార బీజేపీ వ్యతిరేకించడంతో బిల్లు పెండింగ్‌లో ఉందన్నారు. చివరకు పార్లమెంట్‌లో బీసీ పార్టీలుగా చెప్పుకుంటున్న డీఎంకే, అన్నాడీఎంకే, పీఎంకే, ఆర్‌జేడీ, సమాజ్‌వాద్ పార్టీ, బీఎస్పీ, ఆప్నాదళ్, జనతాదళ్ వంటి పార్టీలు కూడా బీసీ బిల్లు పెట్టలేదన్నారు.

50 శాతం నామినేటెడ్ పోస్టులు బీసీలకే..

ఏపీలో 50 శాతం నామినేటెడ్ పోస్టులు వెనుకబడిన వర్గాలకు ఇవ్వడమే గాక, కాంట్రాక్టు పనుల్లో 50 శాతం కోటా ఇస్తూ అసెంబ్లీలో చట్టం చేసి దేశంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ ముఖ్యమంత్రులకు జగన్ సవాల్ విసిరారని కృష్ణయ్య చెప్పారు. 56 బీసీ కులాల కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు 56 చైర్మన్లు, 672 మంది డైరెక్టర్లను నియమించారన్నారు. 193 కార్పొరేషన్లకు సంబంధించి 109 కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కడం చూసి ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు దిమ్మతిరిగిందన్నారు. మంత్రివర్గంలో ఏకంగా 17 పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే అవకాశం కల్పించడం ద్వారా సరికొత్త సామాజిక మహావిప్లవాన్ని సీఎం ఆవిష్కరించారని చెప్పారు. ఐదుగురు డిప్యూటీ సీఎం పదవులు ఇస్తే..నాలుగు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే అవకాశం కల్పించారన్నారు. రాజ్యసభలో 9 మంది వైఎస్సార్ సీపీ సభ్యులుంటే..అందులో ఐదుగురు బీసీలేనని పేర్కొన్నారు. కాగా, చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలంటూ ఈ నెల 29, 30 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఆర్.కృష్ణయ్య తెలిపారు.

మనసున్న ముఖ్యమంత్రి జగన్

- గిరిజన శంఖారావం సభలో గిరిజన సంఘాల నాయకులు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ సీతారాం నాయక్, శంకరరావు

సాక్షి, అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులకు అత్యధికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ మాజీ ఎంపీ, ఆచార్య అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. గిరిజనులకు అన్ని విధాలుగా మేలు చేస్తున్న మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని ప్రశంసించారు. ఆదివారం విజయవాడలో 'గిరిజన శంఖారావం' సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీతారాంనాయక్ మాట్లాడుతూ.. ఏపీలో ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయడం గొప్ప విషయమన్నారు. ఏపీలో గిరిజనులకు జరుగుతున్నంత సంక్షేమం, అభివృద్ధి దేశంలో మరెక్కడా అందడం లేదని చెప్పారు. అందుకే ఏపీలోని గిరిజనులు జగన్‌ను దేవుడిగా అభిమానిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పపూలు ఏరుకుని బతికే కుటుంబానికి చెందిన తాను ఉమ్మడి ఏపీలో మొదటి పీహెచ్‌డీ చేసిన గిరిజన వ్యక్తినని చెప్పారు. విద్య ద్వారానే సమాజంలో ఉన్నతంగా ఎదుగుతామన్నారు.

రాష్ట్రంలో గిరిజనులకు ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రాధాన్యత

ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు మాట్లాడుతూ.. సీఎం జగన్ రాష్ట్రంలోని గిరిజనులకు ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రాధాన్యతను మరింతగా పెంచాలనే తపనతో పనిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో గిరిజనుల మాట వినే ప్రభుత్వం ఉందని, దాన్ని మళ్లీ నిలబెట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

గిరిజనులకు ఉప ముఖ్యమంత్రులుగా అవకాశం

గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం గిరిజనులకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదన్నారు. కానీ సీఎం జగన్ రెండు మంత్రివర్గాల్లోనూ గిరిజనులకు ఉప ముఖ్యమంత్రులుగా అవకాశం కల్పించారని చెప్పారు. ఎమ్మెల్సీలుగా గిరిజనులకు అవకాశం ఇచ్చి చరిత్ర సృష్టించారని చెప్పారు. అడవులకే పరిమితం అనుకున్న గిరిజన బిడ్డలను సీఎం జగన్ రాజకీయ రంగంలో కూడా చేయి పట్టుకొని ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకొని.. మరింతగా అభివృద్ధి చెందుదామని పిలుపునిచ్చారు. జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జి.మల్లిఖార్జున నాయక్, జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రాజునాయక్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే గిరిజన తండాలకు రోడ్లు, తాగునీటి సౌకర్యం, విద్య, వైద్యం.. తదితర సదుపాయాలన్నీ అందుబాటులోకి వచ్చాయన్నారు. రాష్ట్రంలో పెత్తందారులతో జరుగుతున్న యుద్ధంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల నాయకుడైన సీఎం జగన్‌ను గెలిపించుకుందామని కోరారు. గిరిజనులకు ఎంతో మేలు చేస్తున్న సీఎం జగన్ రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు కె.రామలక్ష్మి, జె.లిల్లీ, నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, కదిరి రూరల్ జెడ్పీటీసీ కృష్ణ నాయక్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీ, గిరిజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖ బంజార కళాకారుడు బిక్షు నాయక్ బృందం ప్రదర్శించిన గిరిజన కళారూపాలు ఆకట్టుకున్నాయి.

దళితులు, ఇతరులపై నమోదు చేసిన కేసుల ఉపసంహరణ

హోమ్ శాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి రాష్ట్రంలో వివిధ ఆందోళనల సందర్భంగా మాల, మాదిగ సామాజిక వర్గాలతో పాటు ఇతర వర్గాలపై నమోదు చేసిన 36 కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించింది. ఈమేరకు రాష్ట్ర హోమ్ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పీఎస్) నిర్వహించిన 'కురుక్షేత్ర' ఆందోళన సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా చిలకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన ఆరు కేసులపై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక వివిధ ఆందోళన కార్యక్రమాల సందర్భంగా మాల సామాజికవర్గానికి చెందినవారిపై నమోదు చేసిన కేసులను కూడా ప్రభుత్వం వెనక్కితీసుకుంది. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి, పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడూరు, బాపట్ల జిల్లా పరుచూరు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా రాపూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదు చేసిన 13 కేసులు వాటిలో ఉన్నాయి. వాటితోపాటు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో దళితులపై టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017లో నమోదు చేసిన 10 కేసులు, కాకినాడ జిల్లా కోరింగ పోలీస్ స్టేషన్ పరిధిలో దళితులపై నమోదు చేసిన కేసును కూడా ప్రభుత్వం ఉపసంహరించింది. ఇతర సామాజికవర్గాలపై అమలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన ఆరు కేసులను కూడా ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ కేసుల్లోని 350 మందికిపైగా నిందితులకు ఊరట లభించింది.

ఆక్వాజోన్ తెచ్చింది నువ్వు కాదా బాబూ?


- చంద్రబాబు వ్యాఖ్యలపై మండిపడ్డ అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం



సాక్షి, అమరావతి/ తాడేపల్లిగూడెం: ఆక్వా రంగంపై మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదని ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ అథారిటీ (అప్సడా) కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం విమర్శించారు. ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ పెట్టింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో జరిగిన సభలో చంద్రబాబు ఆరోపించడం చూస్తుంటే అతనికి ఉన్న అల్జీమర్ వ్యాధి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందన్నారు. 2018లో జోనేషన్ విధానాన్ని తీసుకొచ్చి ఆక్వా రైతులను గందరగోళానికి గురి చేసిన చరిత్ర చంద్రబాబుదేనన్నారు. ఒకే గ్రామంలో తమకు అనుకూలంగా ఉన్న వారి చెరువులను జోన్ పరిధిలోనూ, వ్యతిరేకంగా ఉన్న వారి చెరువులను నాన్ ఆక్వా జోన్‌లో పెట్టి వారి జీవితాలను అగమ్యగోచరం చేశారని దుయ్యబట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జోనేషన్ విధానంలో చోటు చేసుకున్న అవకతవకలను చక్కదిద్ది, మెజార్టీ రైతులకు మేలు చేసేలా చర్యలు చేపట్టారన్నారు. రాష్ట్రంలో 4.65లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా, జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు 3.56 లక్షల ఎకరాల్లోపు రైతులకు యూనిట్ రూ.1.50లకే విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఆక్వా చెరువులకు 64,645 విద్యుత్ కనెక్షన్లుండగా, 50,659 కనెక్షన్లకు విద్యుత్ సబ్సిడీ వర్తింప చేసారన్నారు. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.309.95 కోట్ల బకాయిలను చెల్లించడమే కాకుండా ఈ నాలుగున్నరేళ్లలో 3496.31 కోట్ల విద్యుత్ సబ్సిడీ అందించారన్నారు. దీనివల్ల సగటున ప్రతీ రైతుకు సబ్సిడీ రూపంలో రూ.7లక్షల మేర లబ్ధి చేకూర్చారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50లకే విద్యుత్ సరఫరా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం మత్స్యరంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రత్యేకంగా మత్స్య యూనివర్శిటీని ఏర్పాటు చేశారన్నారు. ఏటా ఫీడ్, సీడ్ ధరలు పెంచుకుంటూ పోయినా ఒక్కసారి కూడా కంపెనీలతో మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.

జగన్‌ను మళ్లీ సీఎంను చేసేందుకు కృషి చేయాలి

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి



కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తూ, అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం అయ్యేందుకు ప్రతి న్యాయవాదీ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో ఆదివారం పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటి వరకు అన్ని రంగాల్లోని ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అందించారని కొనియాడారు. అంతేగాక అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. న్యాయవాదులు తమ వృత్తిలో స్థిరపడేందుకు సీఎం జగన్ ప్రతి నెలా రూ.5 వేల చొప్పున మూడేళ్ల పాటు అందిస్తున్నారని ప్రశంసించారు. బార్ వెల్ఫేర్ ఫండ్‌ను కేటాయించి న్యాయవాదులకు న్యాయం జరిగేలా చూస్తున్నారని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై సమగ్రంగా విధి విధానాలను తయారు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి పక్షాలు ఈ యాక్ట్‌పై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంట్, జిల్లా అధ్యక్షుడు, కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, పద్మశాలీయ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది జింకా విజయలక్ష్మిలు ప్రసంగించారు.

లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ కోఆర్డినేటర్లు

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏపీలోని 25 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలను నియమించింది. కోఆర్డినేటర్ల జాబితాను ఆదివారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విడుదల చేశారు. అరకు-జగత శ్రీనివాస్, శ్రీకాకుళం-మీసాల సుబ్బన్న, విజయనగరం-బొడ్డేపల్లి సత్యవతి, విశాఖపట్నం-కొత్తూరి శ్రీనివాస్, అనకాపల్లి-సనపల అన్నాజీరావు, కాకినాడ-కేబీఆర్ నాయుడు, అమలాపురం-ఎం.వెంకట శివప్రసాద్, రాజమండ్రి-మూషిని రామకృష్ణ, నరసాపురం-జెట్టి గుర్నాథరావు, ఏలూరు-కె.బాపిరాజు, మచిలీపట్నం-కొరివి వినయ్‌కుమార్, విజయవాడ-డి.మురళీమోహనరావు, గుంటూరు-గంగిశెట్టి ఉమాశంకర్, నరసరావుపేట-వి.గురునాథం, బాపట్ల-శ్రీపతి ప్రకాశం, ఒంగోలు-యు.వెంకటరావు యాదవ్, నంద్యాల-బండి జకారియా, కర్నూలు-పీఎం కమలమ్మ, అనంతపురం-ఎన్.శ్రీహరి ప్రసాద్, హిందూపురం-షేక్ సత్తార్, కడప-ఎం.సుధాకర్‌బాబు, నెల్లూరు-ఎం.రాజేశ్వరరావు, తిరుపతి- షేక్ నజీర్‌అహ్మద్, రాజంపేట-ఎన్.తులసిరెడ్డి, చిత్తూరు-డి.రాంభూపాల్‌రెడ్డిని కోఆర్డినేటర్లుగా నియమించారు.

చంద్రబాబు బ్రోకర్

- ఆంబోతులకు ఆవులను సప్లైచేసి రాజకీయాల్లో ఎదిగారు
- పవన్‌కళ్యాణ్‌కు అఫిషియల్, అన్ అఫిషియల్ అలవాటే..
- విలేకర్ల సమావేశంలో మంత్రి అంబటి రాంబాబు



నగరంపాలెం: టీడీపీ నేత చంద్రబాబు ఆంబోతులకు ఆవులను సప్లైచేసి రాజకీయాల్లో ఎదిగిన బ్రోకర్ అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఈ విషయాన్ని గతంలో కూడా చెప్పానన్నారు. గుంటూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రా.. కదిలి రా.. అని పిలిస్తే ఎవరు వస్తారని ప్రశ్నించారు. టీడీపీ చచ్చిపోయిందని, అది కదలదని.. దత్తపుత్రుడితో కలిసి వచ్చినా కదిలే పరిస్థితి లేదని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రజాదరణ ఉన్న వ్యక్తి కాదన్నారు. 1983లో ఇందిరాగాంధీ ఆదేశిస్తే మామ ఎన్టీఆర్‌పై పోటీకి సిద్ధమని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు.. భార్య చెంగు పట్టుకుని దొడ్డదారిన ఎన్టీఆర్ ఇంట్లోకి ప్రవేశించారని ఎద్దేవా చేశారు. అధికారం కోసం ఎవరినైనా మోసగించే చంద్రబాబు నీచుడని విమర్శించారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఏపీలో సొంతిల్లులేని చంద్రబాబు, లోకేశ్‌ను హైదరాబాద్‌లోని సొంతింట్లోకి రావాలని రా.. కదిలి రా.. అని పిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. పవన్‌కళ్యాణ్‌కు అధికారికంగా బీజేపీతో, అనధికారికంగా టీడీపీతో పొత్తు ఉందని చెప్పారు. పవన్‌కళ్యాణ్‌కు అలా ఉండటం అలవాటేనన్నారు. పవన్ అఫిషియల్‌గా, అన్ అఫిషియల్‌గా ఉండటం అందరికీ తెలుసునని విమర్శించారు. చంద్రబాబు, లోకేశ్, పవన్.. ఇలా ఎందరూ వచ్చినా సీఎం వైఎస్ జగన్‌ను ఏమీచేయలేరని చెప్పారు. వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ దాదాపు అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. మాట ఇచ్చినట్లే ఈ నెలలో రూ.3 వేల పెన్షన్‌ను అమలు చేశారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకి 160 సీట్లు కాదని, 200 బీపీ వస్తుందని చెప్పారు. ఇటీవల చంద్రబాబు కుప్పంలో మాట్లాడిన తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబూ.. గతంలో ఏం చేశావు? గుడ్డి గుర్రానికి పళ్లు తోమావా?.. అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు చరిత్ర రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, ఎంత గ్యాస్ కొట్టుకున్నా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని మంత్రి పేర్కొన్నారు.

హామీలను 99.5 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు(చిత్తూరు జిల్లా): పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 99.5 శాతం నెరవేర్చారని రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పుంగనూరులో బలిజ కులస్తుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు రుణమాఫీ పేరుతో ప్రజలను మోసగించారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నేరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఓటు వేసినా వేయకపోయినా, కులం, మతం చూడకుండా పేదరికమే ప్రామాణికంగా అర్హులైన పేదలందరికీ సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందించారన్నారు. కరోనా కష్టాలతో రెండేళ్లు ఆర్థికంగా కష్టాలు పడినా మొక్కవోని దీక్షతో సీఎం జగన్ సంక్షేమ క్యాలెండర్ అమలు చేశారని తెలిపారు.

రాయల పాలనకు చారిత్రక ఆధారాలు

శ్రీకృష్ణదేవరాయలు మన ప్రాంతంలో పరిపాలన సాగించినట్లు చారిత్రక ఆధారాలున్నాయని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. అంతకుముందు ఆయన పుంగనూరులోని శ్రీ కృష్ణదేవరాయ బలిజ సంఘం, కాప్‌రాక్స్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణదేవరాయ సర్కిల్, విగ్రహాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిత్తూరు ఎంపీ ఎన్ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

80 ఏళ్లొచ్చినా రిటైర్మెంట్‌కు సిద్ధంగా లేరు: పవార్‌పై అజిత్

ముంబై: ఎన్సీపీ నేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తన చిన్నాన్న, సీనియర్ నేత శరద్ పవార్‌నుద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. కొందరు నేతలు 80లు దాటినా రిటైర య్యేందుకు సిద్ధంగా లేరంటూ ఎద్దేవా చేశారు. ''మహారాష్ట్ర ప్రభుత్వోద్యోగులు 58 ఏళ్లకే రిటైర వుతారు. 75 ఏళ్లు వచ్చేసరికి చాలా మంది వృత్తిగత జీవితంలో చురుగ్గా ఉండటం తగ్గిస్తుంటారు. కానీ, కొందరు మాత్రం 84 ఏళ్లు వచ్చినా విరమణ తీసుకునేందుకు సిద్ధంగా లేరు'' అంటూ థానెలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో అజిత్ చెణుకులు విసిరాన్నారు. ఆయన పలువురు ఎన్సీపీ ఎమ్మెల్యేలతో కలిసి శివసేన–బీజేపీ ప్రభుత్వంలో చేరిన విషయం తెలిసిందే. నేషనలిస్ట్ కాంగ్రెస్ పేరును, ఎన్నికల గుర్తును తనకే కేటాయించాలంటూ కోర్టుకెక్కారు.

మీ సంగతి చూసుకోండి
అఖిలేశ్ వ్యాఖ్యలపై మాయావతి ధ్వజం

లక్నో: బీఎస్పీపై ఇష్టారాజ్యంగా విమర్శలు చేసే ముందుకు ఆత్మపరిశీలన చేసుకోవాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌కు మాయావతి సూచించారు. బీఎస్పీని ఇండియా కూటమిలో చేర్చుకుంటారా అని మీడియా ప్రశ్నించగా ఎన్నికల తర్వాత పొత్తులు మార్చే అలవాటున్న మాయావతి పార్టీని ఎవరు నమ్ముతారని అఖిలేశ్ ప్రశ్నించారు. వీటిపై మాయా మండిపడ్డారు. బీజేపీని బలోపేతం చేస్తూ, వారితో అంటకాగుతున్న అఖిలేశ్ ప్రతిష్ట మంటగలిసిందని విమర్శించారు. 2019 ఎన్నికల ముందు, తర్వాత ప్రధాని మోదీని నాటి ఎస్పీ చీఫ్ ములాయం సింగ్ యాదవ్ ఆశీర్వదించారని గుర్తు చేశారు.

కుటుంబీకున్ని కొట్టిన బాలుడు...
దారి మళ్లిన విమానం

విన్నీపెగ్: ఎయిర్ కెనడా విమానంలో ఓ 16 ఏళ్ల బాలుడు తమ కుటుంబసభ్యుడిని కొట్టడం ఆ విమానాన్ని దారి మళ్లించేందుకు దారితీసింది. విమానం టొరంటో నుంచి కాల్గరీకి బయలుదేరాక గ్రాండ్ ప్రయరీస్‌కు చెందిన 16 ఏళ్ల బాలుడు తమ కుటుంబానికే చెందిన ఓ వ్యక్తిని తీవ్రంగా కొట్టాడు. వారి గొడవను విమాన సిబ్బంది, తోటి ప్రయాణికులు అడ్డుకున్నారు. గాయపడిన వ్యక్తికి సిబ్బంది చికిత్స అందించారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది. అనంతరం విమానాన్ని విన్నీపెగ్‌కు అధికారులు దారి మళ్లించి, ఆ బాలుడిని అధికారులకు అప్పగించారు. ఇదంతా పూర్తయ్యేవరకు దాదాపు మూడు గంటలపాటు ప్రయాణికులు నిరీక్షించాల్సి వచ్చింది. అనంతరం ఆ విమానం గమ్య స్థానం వైపు బయలుదేరిందని ఎయిర్ కెనడా తెలిపింది.

కార్గిల్‌లో నైట్ ల్యాండింగ్

విజయవంతంగా దిగిన సి-130జే ● భారత వాయుసేన అరుదైన రికార్డు

భారత వాయుసేన (ఐఏఎఫ్) అరుదైన ఘనత సాధించింది. సముద్ర మట్టానికి ఏకంగా 10,500 అడుగుల ఎత్తున హిమాలయ పర్వతాలపై ఉన్న కార్గిల్ అడ్వాన్స్‌డ్ ల్యాండ్ గ్రౌండ్‌పై సి-130జే సూపర్ హెర్క్యులస్ రవాణా విమానాన్ని రాత్రి పూట సురక్షితంగా ల్యాండింగ్ చేసింది. దీనికి సంబంధించి వాయుసేన 'ఎక్స్'లో పోస్టు చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఐఏఎఫ్ బాహుబలిగా చెప్పే ఈ విమానం పాక్ సరిహద్దులో నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) సమీపంలోని ఈ ఎయిర్ స్ట్రిప్‌పై రాత్రి సమయంలో దిగడం ఇదే తొలిసారి! గరుడ్ కమాండోలకు శిక్షణలో భాగంగా ఇటీవలే ఈ విన్యాసం నిర్వహించినట్లు వాయుసేన వర్గాలు వెల్లడించాయి. అంతేగాక ఐఏఎఫ్ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడానికి రక్షణపరంగా వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు వివరించాయి. నిజానికి రక్షణ శాఖలో రవాణా విమానాన్ని ఇలా రాత్రి పూట ల్యాండింగ్ చేయడం అత్యంత అరుదు. కొండలపై ఉన్న రన్‌వేపై భారీ విమానాన్ని క్షేమంగా దించడం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. హిమాలయ పర్వతాల్లో వాయుసేన ఆధ్వర్యంలో ఎయిర్‌స్ట్రిప్‌లు సేవలందిస్తున్నాయి. ఎల్‌ఏసీ సమీపంలో దౌలత్ బేగ్ ఓల్డీ అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్(ఏఎల్‌జీ) సముద్ర మట్టానికి 16,700 అడుగుల ఎత్తులో ఉంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎయిర్‌ఫీల్డ్ కావడం గమనార్హం. వాయుసేన వద్ద 12 సి-130జే విమానాలున్నాయి. ఇవి సైనికుల తరలింపు, సహాయక సామగ్రి రవాణాలో ఉపయోగపడుతున్నాయి.



- న్యూఢిల్లీ

మోదీపై మాల్దీవుల మంత్రుల నోటి దురుసు...
సర్వత్రా దుమారం

తీవ్ర నిరసన తెలిపిన కేంద్రం | సినీ తదితర ప్రముఖుల ఖండన | ఊపందుకున్న 'బాయ్‌కాట్ మాల్దీవ్స్'

- ఆ దేశానికి మనోళ్ల హాలిడే ట్రిప్పులు రద్దు
- నష్ట నివారణ చర్యలకు దిగిన మాల్దీవులు
- విమర్శలు చేసిన ముగ్గురు మంత్రులపై వేటు

మాలె/న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై మాల్దీవుల మంత్రుల అనుచిత వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. వాటిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ, సినీ ప్రముఖులు, సెలబ్రిటీలు ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. కేంద్రం కూడా వాటిపై తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చింది. మంత్రుల వ్యాఖ్యలకు నిరసనగా వేలాది మంది భారత పర్యాటకులు మాల్దీవులకు ప్లాన్ చేసుకున్న హాలిడే ట్రిప్పులను రద్దు చేసుకుంటున్నారు. ఆ దేశ పర్యాటకానికి మన టూరిస్టులే ఆయువుపట్టు. పైగా భారత్‌తో వ్యూహాత్మక బంధం మాల్దీవులకు అత్యంత కీలకం. దాంతో ఈ వివాదంపై ఆ దేశం హుటాహుటిన స్పందించింది. భారత ప్రభుత్వ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేసినట్లు ఆదివారం ప్రకటించింది. వారి వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగతమని, వాటితో ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టతనిచ్చింది. ''భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రజాస్వామ్యయుతంగా, బాధ్యతాయుతంగా ఉండాలే తప్ప, విద్వేషాన్ని, ప్రతికూల ప్రభావాన్ని కలిగించేలా ఉండొద్దు. అంతర్జాతీయ భాగస్వామ్య దేశాలతో సంబంధాలను దెబ్బతీయొద్దు'' అని పేర్కొంది. మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసేవారిపై కఠిన చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేసింది. సస్పెండైన మంత్రులు మరియం షియునా, అబ్దుల్లా మజూం మజీద్, మల్షా షరీఫ్ అని తెలుస్తోంది.

అసలేమైంది...?

ప్రధాని మోదీ ఇటీవల లక్షద్వీప్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. లక్షద్వీప్‌ను పర్యాటక ధామంగా మార్చాలంటూ ఆ సందర్భంగా ఆయన వీడియో, ఫొటోలు షేర్ చేశారు. అవి ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారాయి. పలువురు నెటిజన్లు లక్షద్వీప్‌ను మాల్దీవులతో పోల్చారు కూడా! దీనిపై మాల్దీవుల మంత్రి షియునా వ్యంగ్యంగా స్పందించారు. మోదీని జోకర్‌గా, తోలుబొమ్మగా పేర్కొంటూ ట్వీట్లు చేశారు. మంత్రులు మజీద్, మల్షా కూడా ఇవే రకమైన వ్యాఖ్యలు చేశారు. పర్యాటకంలో మాల్దీవులతో లక్షద్వీప్ ఏ మాత్రమూ సరితూగదంటూ ఎద్దేవా చేశారు. ''భారత్‌లో హోటల్ గదులు అసహ్యంగా ఉంటాయి. మా దేశంతో లక్షద్వీప్‌కు పోలికేమిటి?'' అంటూ మాల్దీవుల ఎంపీ జహీద్ రమీజ్ కూడా నోరు పారేసుకున్నారు. ఈ వ్యాఖ్యలపై మాల్దీవుల్లోని భారత హైకమిషన్ కార్యాలయం అధికారులు నిరసన తెలిపారు. దుమారం నేపథ్యంలోవారి వ్యాఖ్యలను 'ఎక్స్' నుంచి తొలగించారు. మంత్రుల వ్యాఖ్యలను మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ తీవ్రంగా ఖండించారు. ''భారత్ మనకు కీలక మిత్రదేశం. మాల్దీవుల భద్రత, అభివృద్ధిలో చాలా కీలకం. అలాంటి దేశాధినేతను ఉద్దేశించి నీచమైన భాష వాడటం తగదు'' అన్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని కొత్త అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుకు హితవు పలికారు. ఇంతగా నిరసనలు వ్యక్తమవుతున్నా మరియం మాత్రం ఆన్‌లైన్ వేదికలపై అక్కసు వెళ్లగక్కడం ఆపలేదు. దాంతో పలువురు భారత నెటిజన్లు 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' అంటూ పిలుపునిస్తున్నారు!



ఇటీవల లక్షద్వీప్ పర్యటన సందర్భంగా బీచ్ ఒడ్డున ప్రధాని మోదీ

బుకింగులు రద్దు

మోదీపై విమర్శల ప్రభావం మాల్దీవుల పర్యాటక రంగంపై తీవ్రంగా పడుతోంది. భారత పర్యాటకులు ఇప్పటికే 8 వేల పైచిలుకు హోటల్ బుకింగులు, 2,500కు పైగా విమాన టిక్కెట్లను రద్దు చేసుకున్నట్లు సమాచారం. మాల్దీవుల్లో ఇటీవలి ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన ముయిజ్జుకు చైనా అనుకూలునిగా, భారత వ్యతిరేకిగా పేరుంది. చైనాతో బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు జనవరి 8 నుంచి నాలుగు రోజుల పాటు ఆ దేశంలో పర్యటనకు వెళ్తున్నారు.

సెలబ్రిటీల ఖండన


మాల్దీవుల మంత్రుల నోటి దురుసును క్రికెటర్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటులు అక్షయ్ కుమార్, సల్మాన్ ఖాన్, జాన్ అబ్రహం, శ్రద్ధా కపూర్ తదితరులు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. వారి విద్వేష వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయని అక్షయ్ అన్నారు. ''మాల్దీవులకు ఏటా భారీగా పర్యాటకులను పంపే భారత్‌పై అలా మాట్లాడటం దారుణం. పొరుగువారితో స్నేహంగా మెలగాలనే అనుకుంటాం కానీ ఇలాంటి ద్వేషాన్ని మనమెందుకు సహించాలి? నేనెన్నోసార్లు మాల్దీవుల్లో పర్యటించా. ప్రతిసారీ ఆ దేశాన్ని ప్రశంసించా. కానీ మన ఆత్మగౌరవమే ఫస్ట్. ఇకపై మన దీవుల్లో పర్యటిస్తూ మన పర్యాటకానికి దన్నుగా నిలుద్దాం'' అని పిలుపునిచ్చారు. లక్షద్వీప్‌లో అందమైన, పరిశుభ్రమైన బీచుల్లో ప్రధాని మోదీని చూడటం ఎంతో బాగుంది. మన దేశంలోనే ఇంత అద్భుతమైన బీచ్‌లుండటం గర్వకారణం'' అని సల్మాన్ ఖాన్ పేర్కొన్నారు. ''అతిథి దేవోభవ సందేశంతో భారత్ ఇచ్చే అద్భుతమైన ఆతిథ్యం, విస్తారమైన మన సముద్ర తీరాలను చూడాలే తప్ప వర్ణించలేం. ఇందుకోసం లక్షద్వీప్‌కు వెళ్లాల్సిందే'' అంటూ జాన్ అబ్రహం బీచ్ ఫొటోలను షేర్ చేశారు. సుందరమైన లక్షద్వీప్ బీచ్‌ల అందాలను చూసేందుకు ప్లాన్ చేసుకుంటున్నట్లు నటి శ్రద్ధా కపూర్ తెలిపారు. సచిన్ కూడా ఇటీవలి లక్షద్వీప్ పర్యటన సందర్భంగా అక్కడ తాను క్రికెట్ ఆడిన వీడియో, బీచ్ ఫొటోలను షేర్ చేశారు.

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి...
13 నుంచి మోదీ శ్రీకారం!
బిహార్‌లో తొలి బహిరంగ సభ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. పార్టీలన్నీ అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కదన రంగంలోకి దూకబోతున్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఆయన శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిసింది. మొట్టమొదటి బహిరంగ సభను బిహార్‌లో నిర్వహించబోతున్నారు. బిహార్‌లోని చంపారన్ జిల్లా బేటియా సిటీలో భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొంటారని బీజేపీ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. అదేవిధంగా బిహార్‌లో పలు ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేస్తారని తెలిపాయి. బిహార్‌లో మొత్తం 40 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అన్ని స్థానాలను గెలుచుకొనేందుకు బీజేపీ వ్యూహాలు రచిస్తోంది. ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. జనవరి, ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో బేటియా, బెగూసరాయ్, ఔరంగాబాద్ సభల్లో మోదీ ప్రసంగించనున్నారు. బిహార్‌లో గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 39 స్థానాలు దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీకి ఒకే ఒక్క స్థానం లభించింది.

..ఆ స్ఫూర్తితోనే నేర న్యాయ చట్టాలు

జైపూర్: 'పౌరుడు ప్రథమం.. గౌరవం ప్రథమం.. న్యాయం ప్రథమం' స్ఫూర్తితోనే మూడు నేర న్యాయ చట్టాలను తీసుకొచ్చినట్లు మోదీ చెప్పారు. ఆదివారం జైపూర్‌లో డీజీపీలు, ఐజీల 58వ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ చట్టాలతో దేశ నేర న్యాయ వ్యవస్థలో గుణాత్మక మార్పు వస్తుందన్నారు. మహిళ భద్రత, వారి హక్కుల పరిరక్షణకు కొత్త చట్టాల్లో పెద్దపీట వేశామన్నారు. ''మహిళల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టండి. వారు ఎక్కడైనా, ఎప్పుడైనా స్వేచ్ఛగా పని చేసుకొనే వాతావరణముండేలా చూడండి'' అని సూచించారు. వికసిత భారత్‌లో భాగంగా పోలీసు వ్యవస్థ సైతం ఆధునికత సంతరించుకుని ప్రపంచ స్థాయి రక్షణ దళంగా మారాలన్నారు. అరేబియా సముద్రంలో సముద్రపు దొంగల చెర నుంచి భారత వాణిజ్య నౌకను క్షేమంగా విడిపించిన నావికాదళంపై మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిత్య ఎల్1 మిషన్ విజయవంతంగా గమ్యాన్ని చేరుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



నవీ ముంబైని ముంబైతో కలిపే అటల్ సేతు ఇది. దీని పొడవు ఏకంగా 21.8 కిలోమీటర్లు. భారత్‌లో సముద్రంపై నిర్మించిన అతి పొడవైన బ్రిడ్జి ఇదే. జనవరి 12న ప్రధాని మోదీ దీన్ని ప్రారంభించనున్నారు.

ఢిల్లీ స్కూళ్లకు మరో 5 రోజులు సెలవులు

న్యూఢిల్లీ: ఢిల్లీలో చలి తీవ్రత పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలకు ఈ నెల 12వ తేదీ వరకు సెలవులను పొడిగించింది. ఢిల్లీలో పాఠశాలలకు సోమవారంతో శీతాకాల సెలవులు ముగియాల్సి ఉంది. 'ఢిల్లీలో చలి వాతావరణ పరిస్థితులు కొనసాగుతుండటంతో నర్సరీ నుంచి అయిదో తరగతి వరకు ప్రభుత్వ స్కూళ్లను మరో అయిదు రోజుల పాటు మూసి ఉంచాలని నిర్ణయించాం'అని విద్యాశాఖ మంత్రి అతిషి ఆదివారం 'ఎక్స్'లో తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు తమ విద్యార్థుల కోసం ఆన్‌లైన్ తరగతులు నిర్వహించుకోవచ్చని తెలుపుతూ విద్యాశాఖ సర్క్యులర్ జారీ చేసింది. 6 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల కోసం ఉదయం 8 గంటలు–సాయంత్రం 5 గంటల మధ్యలోనే తరగతులు నడపాలని కోరింది.

సూపర్ మార్కెట్ల తిండి...
సర్వం ప్లాస్టిక్‌మయం!



- వాటి నిండా ఫ్తాలేట్స్, బైస్ఫెనాల్ రసాయనాలు
- క్యాన్సర్, మధుమేహం, వంధ్యత్వం, స్థూలకాయ సమస్యలు
- 'కన్జ్యూమర్ రిపోర్ట్స్' అధ్యయనంలో వెల్లడి

ఆధునిక యుగంలో సర్వం ప్లాస్టిక్‌మయం.. మనం తీసుకొనే ఆహారం కూడా ఇందుకు మినహాయింపు కాదు. కంటికి కనిపించని సూక్ష్మ రూపంలో ప్లాస్టిక్ రేణువులు ఆహారంలో చేరుతున్న సంగతి తెలిసిందే అయినా ఆరోగ్యానికి హాని కలిగించే ప్రమాదకరమైన రసాయనాలు ఉంటున్నాయని తేలడం ఆందోళన కలిగిస్తోంది. ఆహారంలో ప్లాస్టిక్ పరిమాణంపై 'కన్జ్యూమర్ రిపోర్ట్స్' అనే స్వచ్ఛంద సంస్థ ఒక అధ్యయనం నిర్వహించింది. సూపర్ మార్కెట్లలో లభ్యమయ్యే రెడీమేడ్ ఆహారంతోపాటు ఫాస్ట్‌ఫుడ్‌ను ప్రయోగశాలలో క్షుణ్నంగా పరీక్షించింది. ఆహార తయారీ సమయంలోనే అందులో ప్లాస్టిక్ కలుస్తున్నట్లు గుర్తించింది...

- ➤ ఫాస్ట్‌ఫుడ్స్‌తోపాటు సూపర్ మార్కెట్లలో లభించే 85 రకాల ఆహార పదార్థాలను పరీక్షించగా, 84 పదార్థాల్లో ఫ్తాలేట్స్ అనే ప్లాస్టిక్ రసాయనం ఆనవాళ్లు ఉన్నట్లు వెల్లడయ్యింది. ప్లాస్టిక్ ఎక్కువ కాలం మన్నికగా ఉండడానికి ఈ కెమికల్‌ను ఉపయోగిస్తుంటారు. పోలార్ సెల్ట్‌జెర్ కంపెనీ తయారు చేసిన రాస్ బెర్రీ లైమ్ అనే పండ్ల రసంలో ప్లాస్టిక్ లేదని తేలింది.
- ➤ తాము పరీక్షించిన వాటిలో 79 శాతం ఆహార నమూనాల్లో బైస్ఫెనాల్-ఏ(బీపీఏ) అనే మరో ప్లాస్టిక్ రసాయనం ఉన్నట్లు తేలిందని 'కన్జ్యూమర్ రిపోర్ట్స్' ప్రకటించింది. కానీ, 2009 నాటితో పోలిస్తే ఇప్పుడు ఆహార పదార్థాల్లో ఈ కెమికల్ పరిమాణం తక్కువే ఉన్నట్లు వెల్లడించింది.
- ➤ ఆహారంలో ఫ్తాలేట్స్ స్థాయి ఎంతవరకు ఉంటే క్షేమం అనేదానిపై సైంటిస్టులు ప్రమాణాలేవీ నిర్దేశించలేదు. అతి ఎంత తక్కువగా ఉన్నప్పటికీ ఆరోగ్యానికి ముప్పేనని చెబుతున్నారు.
- ➤ ఫ్తాలేట్స్, బైస్ఫెనాల్స్ శరీరంలో ఈస్ట్రోజెన్, ఇతర హార్మోన్ల ఉత్పత్తి, నియంత్రణను అస్తవ్యస్తం చేస్తాయి.
- ➤ ఇలాంటి రసాయనాలు కలిసిన ఆహారం తీసుకుంటే పుట్టుక లోపాలు, క్యాన్సర్, మధుమేహం, వంధ్యత్వం, స్థూలకాయం, నరాల సంబంధిత వ్యాధులతో పాటు పలు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు.
- ➤ చీరియోస్, గెర్బర్ బేబీ ఫుడ్, యోప్లాయిట్ యోగర్ట్‌తోపాటు వెండీస్, బర్గర్ కింగ్, మెక్‌డొనాల్డ్స్ వంటి ప్రఖ్యాత కంపెనీల బర్గర్లు, చికెన్ నగ్గెట్స్, ఫ్రైలలో ఫ్తాలేట్స్, బైస్ఫెనాల్స్ ఉన్నట్లు గుర్తించారు.
- ➤ ఆహారంలో ప్లాస్టిక్‌ల నియంత్రణ కోసం ప్రభుత్వాలు మరిన్ని చర్యలు చేపట్టాలని, నిబంధనలను కఠినతరం చేయాలని 'కన్జ్యూమర్ రిపోర్ట్స్' ప్రతినిధి జేమ్స్ రోజర్స్ సూచించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

90 ఏళ్ల మృత్యుంజయురాలు

టోక్యో: జపాన్‌లో ఇటీవల సంభవించిన భారీ భూకంపం తీవ్ర విషాదం మిగిల్చింది. వంద మందికిపైగా జనం మరణించారు. వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శిథిలాలను తొలగిస్తున్నారు. 90 ఏళ్లకుపైగా వయసున్న ఓ వృద్ధురాలు శిథిలాల నుంచి ప్రాణాలతో క్షేమంగా బయటపడడం ఆశ్చర్యం కలిగించింది. ఇషికావా జిల్లాలోని సుజు సిటీలో భూకంపం వల్ల కూలిపోయిన రెండంతస్తుల భవన శిథిలాలను తొలగిస్తుండగా ఆదివారం సాయంత్రం ఈ వృద్ధురాలు బయటకు వచ్చింది. ఆహారం, నీరు లేక బలహీనంగా మారిన బాధితురాలిని వెంటనే ఆసుపత్రికి తరలించి, చికిత్స ప్రారంభించారు. ఏకంగా 124 గంటలపాటు ఆమె ఈ శిథిలాల కిందే ఉండిపోయింది. బాధితురాలి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని, మాట్లాడగలుతోందని, ఆమె కాళ్లకు గాయాలయ్యాయని వైద్యులు చెప్పారు. జపాన్‌లో ఆరు రోజుల క్రితం సంభవించిన భూకంపంలో కనీసం 126 మంది మృత్యువాతపడ్డారని స్థానిక అధికారులు వెల్లడించారు.

ఇజ్రాయెల్ దాడుల్లో జర్నలిస్టుల మృతి



రఫా: గాజాస్ట్రిప్‌పై ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఆదివారం దక్షిణ గాజాపై జరిగిన దాడుల్లో ఇద్దరు పాలస్తీనా జర్నలిస్టులు మరణించారు. వీరిలో అల్–జజీరా సీనియర్ కరస్పాండెంట్ వాయిల్ దాహ్‌దౌ కుమారుడు హమ్జా దాహ్‌దౌ కూడా ఉన్నాడు. మరో జర్నలిస్టు కూడా మృతి చెందాడు. ఇజ్రాయెల్ దాడుల్లో వాయిల్ దాహ్‌దౌ కుటుంబంలో ఇప్పటిదాకా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆయన భార్య, ఇద్దరు కుమారులు, మనవడు ఇప్పటికే చనిపోగా, ఆదివారం మరో కుమారుడు బలయ్యాడు. దాహ్‌దౌ సైతం గాయాలపాలయ్యాడు. అయినప్పటికీ తన విధులు నిర్వర్తిస్తూనే ఉన్నాడు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధ వార్తలను ప్రపంచానికి అందిస్తున్నాడు. గాజాలో అసలేం జరుగుతోందో ప్రపంచం తెలుసుకోవాలని, అందుకోసం తన ప్రాణాలైనా ధారపోస్తానని వాయిల్ దాహ్‌దౌ చెప్పాడు. తన కుటుంబం మొత్తం బలైపోయినా తన సంకల్పం సడలిపోదని స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 22,800 మందికిపైగా పాలస్తీనియన్లు మృత్యువాత పడ్డారు.

కొత్తగా 756 కరోనా కేసులు

న్యూఢిల్లీ: దేశంలో ఒక్క రోజు వ్యవధిలో మరో 756 కరోనా కేసులు నమోదు కాగా, యాక్టివ్ కేసుల సంఖ్య 4,049కి చేరుకున్నట్లు ఆదివారం కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. అదే సమయంలో, కేరళ, మహారాష్ట్రల్లో ఇద్దరేసి చొప్పున, జమ్మూకశ్మీర్ ఒక్కరు కోవిడ్ బాధితులు చనిపోయారని పేర్కొంది. యాక్టివ్ కేసుల్లో అత్యధికంగా హోం ఐసోలేషన్‌తోనే నయమవుతున్నట్లు వివరించింది.

అమెరికా వ్యాపారవేత్త వల్ల...
స్టోర్ రూంలో నిద్రించాను

ఇన్ఫోసిస్ తొలినాళ్ల కష్టాలపై నారాయణమూర్తి



న్యూఢిల్లీ: అది ఇన్ఫోసిస్ అప్పుడప్పుడే నిలదొక్కుకుంటున్న తరుణం. న్యూయార్క్‌కు చెందిన డేటా బేసిక్స్ కార్పొరేషన్ దాని పెద్ద కస్టమర్లలో ఒకటిగా ఉండేది. దాని అధిపతి డాన్ లైల్స్‌కు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అంటే నచ్చేది కాదు. ఓసారి ఆయనతో భేటీ కోసం న్యూయార్క్ వెళ్లిన నారాయణమూర్తి ఆ రాత్రి డాన్ నివాసంలోనే నిద్ర పోవాల్సి వచ్చింది. ఇంట్లో నాలుగు బెడ్రూములున్నా నారాయణమూర్తి అంటే కిట్టని డాన్ మాత్రం ఆయన్ను తన సంస్థ స్టోర్ రూంలో పడుకొమ్మన్నాడు! అదీ, కనీసం కిటికీ కూడా లేని చోట, అట్టపెట్టెల మధ్య పడున్న ఓ పెద్ద బాక్స్‌పై! డాన్ వల్ల అప్పటిదాకా ఎన్ని ఇబ్బందులు పడ్డా ఇన్ఫోసిస్ కోసం భరించిన తనకు ఈ అవమానకర ఘటన మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోయిందంటారు నారాయణ మూర్తి. ''అతిథి దేవుడితో సమానమని మా అమ్మ చెప్పేవారు. అనుకోకుండా ఎవరైనా వస్తే అమ్మ తాను తినకుండా వారికి వడ్డించేవారు. పస్తు పడుకునేవారు'' అంటూ గుర్తు చేసుకున్నారు. 'యాన్ అన్‌కామన్ లవ్: ది అర్లీ లైఫ్ ఆఫ్ సుధా అండ్ నారాయణ మూర్తి' పుస్తకంలో ఇలాంటి ఆసక్తికర విషయాలెన్నో ఉన్నాయి. భారతీయ అమెరికన్ రచయిత్రి చిత్రా బెనర్జీ దివాకరుని రాసిన ఈ పుస్తకాన్ని జగ్గర్‌నాట్ బుక్స్ ప్రచురించింది. ఇన్ఫోసిస్ ఆవిర్భావం నుంచి వారి వివాహం, తల్లిదండ్రులవడం తదితర పరిణామాలన్నీ అందులో ఉన్నాయి. సుధా మూర్తి మంచి ఇంజనీర్ అయినా ఇన్ఫోసిస్‌లో చేరడం నారాయణ మూర్తికి తొలుత అస్సలు ఇష్టం లేదట. కుటుంబ యాజమాన్యాల్లోని సంస్థల ఇబ్బందులు ఆయన కళ్లారా చూడటమే అందుకు కారణమని రచయిత్రి వివరించారు. వారిద్దరిదీ అసాధారణ ప్రేమ కథ అని చెప్పుకొచ్చారు. సోషలిజాన్ని బాగా ఇష్టపడే మూర్తి రష్యన్ ప్రపంచ భాష అవుతుందని నమ్మేవారట. రెండేళ్లపాటు రష్యన్ తెగ నేర్చుకున్నారట. సుధా మూర్తి మాత్రం ఇంగ్లిషే ప్రపంచ భాష అవుతుందని చెప్పేవారట.

బంగ్లా పీఠంపై మళ్లీ హసీనాయే

- ప్రధానిగా వరుసగా నాలుగోసారి ఎన్నిక
- ఆమె పార్టీ అవామీలీగ్‌కు మూడింట రెండొంతుల మెజారిటీ

ఢాకా: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో అంతా ఊహించినట్టుగానే పాలక అవామీ లీగ్ నెగ్గింది. ఆదివారం పోలింగ్ జరగ్గా రాత్రికల్లా తొలి దశ ఫలితాలు వెలువడ్డాయి. 300 స్థానాలకు గాను ఇప్పటికే 200 చోట్ల నెగ్గి అవామీ లీగ్ మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. దాంతో ప్రధానిగా షేక్ హసీనా వరుసగా నాలుగోసారి పగ్గాలు చేపట్టనున్నారు. ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీతో పాటు విపక్షాలన్నీ బహిష్కరించిన ఈ ఎన్నికలపై జనం పెద్దగా ఆసక్తి చూపలేదు. దాంతో కేవలం 40 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించారు. సాయంత్రం పోలింగ్ ముగియగానే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించారు. బంగ్లాదేశ్‌లో 2018 సాధారణ ఎన్నికల్లో 80 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. ఈసారి అది ఏకంగా సగానికి పడిపోవడం గమనార్హం. మొత్తం 300 నియోజకవర్గాలకు గాను 299 చోట్ల పోలింగ్ నిర్వహించారు. ఒక స్థానంలో అభ్యర్థి మరణించడంతో ఎన్నిక వాయిదా వేశారు. 27 పార్టీల నుంచి 1,500 మందికిపైగా అభ్యర్థులు బరిలో నిలిచారు. 436 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. హసీనా 2009 నుంచి అధికారంలో కొనసాగుతున్నారు.



ఓటేస్తున్న బంగ్లాదేశ్ ప్రధాని హసీనా

భారత్ పొరుగుదేశం కావడం అదృష్టం

ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ–జమాత్–ఇ–ఇస్లామీ కూటమికి ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేదని ప్రధాని షేక్ హసీనా విమర్శించారు. ఓటు వేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించామని చెప్పారు. భారత్ తమకు అత్యంత నమ్మకమైన మిత్రదేశమని చెప్పారు. భారత్ లాంటి దేశం పొరుగున ఉన్నందుకు తాము చాలా అదృష్టవంతులమని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య ఉద్యమానికి భారత్ ఎంతగానో సహకరించిందని చేశారు. 1975 ఆగస్టులో తన తండ్రిని, తల్లిని, ముగ్గురు సోదరులను, ఇతర కుటుంబ సభ్యులను సైనికాధికారులు దారుణంగా హత్య చేశారని పేర్కొన్నారు.



ఇంటర్నేషనల్ కైట్స్ ఫెస్టివల్ సందర్భంగా ఆదివారం అహ్మదాబాద్‌లో పతంగిని ఎగురవేస్తున్న గుజరాత్ ముఖ్యమంత్రి భూపేశ్ పటేల్

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 8 । జనవరి । 2024



'స్పెల్ బీ'కి విశేష స్పందన

విద్యార్థులకు ఇంగ్లిష్‌పై భయం పోగొట్టి అవగాహన పెంపొందించడానికి 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్‌బీ టెస్ట్‌కు విశేష స్పందన లభిస్తోంది. -8లో▸



దుర్గమ్మ సేవలో చాగంటి

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు వారికి స్వాగతం పలికారు.

నేడు స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోనూ స్పందన కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

వేగంగా పూర్తి చేయండి



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్ మైదాన్‌లో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం మేజర్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన కొద్దిపాటి పనులు ఈ వారంలో పూర్తిచేయాలని మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి స్మృతివనంలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో పర్యాటక ప్రదేశంగా స్మృతివనం మారబోతుందన్నారు. ఈ నెల 19వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్మృతివనం ప్రారంభించి జాతికి అంకితమిస్తారని అన్నారు. పనులన్నీ జనవరి 10వ తేదీ నాటికి పూర్తికావాలని కాంట్రాక్టర్‌లను, అధికారులను ఆదేశించారు.

రేపటి నుంచి ఆర్జిత సేవలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో 9వ తేదీ మంగళవారం నుంచి అన్ని ఆర్జిత సేవలు యథాతథంగా నిర్వహిస్తామని ఈవో కేఎస్ రామారావు పేర్కొన్నారు. భవానీ దీక్ష విరమణలను పురస్కరించుకుని 3వ తేదీ నుంచి ఆర్జిత సేవల టికెట్ల విక్రయాలను దేవస్థానం నిలిపివేసింది. ఆదివారంతో దీక్ష విరమణలు పూర్తి కావడంతో మంగళవారం నుంచి ఉభయ దాతలను సేవలకు అనుమతించాలని నిర్ణయించారు. సోమవారం నుంచి సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్ల విక్రయాలు కొనసాగుతాయని ఈవో పేర్కొన్నారు.

తిరుమలకు 10 టన్నుల కూరగాయలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి నిత్యాన్నదానానికి సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీకి చెందిన దాతలు 10 టన్నుల కూరగాయలను ఆదివారం పంపిణీ చేశారు. ఆంధ్రప్రభకాలనీకి చెందిన దాతలు మాట్లాడుతూ శ్రీవారి అన్నదానానికి తమవంతుగా కూరగాయలు పంపించడం తమ పూర్వజన్మ సుకృతమని అభిప్రాయపడ్డారు. ముందుగా కూరగాయల లారీ వద్ద దాతలు కుటుంబ సమేతంగా పూజలు చేశారు. కార్యక్రమంలో దాతలు ఆర్.సోమేశ్వరరావు, బోగాది కృష్ణ, మున్నంటి సాంబశివరావు, వట్టిపోయిన శివరామకృష్ణ, పిన్నంశెట్టి శివరామ్, ఒల్లి పాండురంగారావు, మరడా నాగేంద్రరావు, మండవ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌వేర్, లెదర్‌గూడ్స్ తయారీపై ఉచిత శిక్షణ

కంకిపాడు(పెనమలూరు): విజయవాడ లిడ్ క్యాప్ వర్క్‌షాప్‌లో లిడ్ క్యాప్ ఆధ్వర్యంలో మాదిగ నిరుద్యోగ యువతకు ఫుట్‌వేర్, లెదర్ గూడ్స్ తయారీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆంధ్రప్రదేశ్ చర్మకార సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమెట్ల సురేష్‌బాబు తెలిపారు. నెప్పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సురేష్‌బాబు విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి చదివిన యువత శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. 300 మందికి శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు లెదర్ పార్కులో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి గల యువత ఈనెల 25వ తేదీ లోపు తమ ఆధార్‌కార్డును 9347902265 నంబర్‌కు పంపి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఢిల్లీ వర్క్‌షాపునకు జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి



ఇబ్రహీంపట్నం(మైలవరం): జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి ఢిల్లీలో జరగనున్న వర్క్‌షాపునకు బయలుదేరారు. ఈ నెల 9న ఢిల్లీలోని సుష్మాస్వరాజ్ భవన్‌లో ప్రాంతీయ సుస్థిర అభివృద్ధి, లింగ ఆధారిత హింస పరిష్కార మార్గాలపై జరిగే వర్క్‌షాపులో ఆమె రాష్ట్ర ప్రతినిధిగా హాజరుకానున్నారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఏ.సూర్యకుమారి నుంచి ఆహ్వానం అందినట్లు ఆదివారం ఆమె తెలిపారు. తనతో పాటు ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు గ్రామ సర్పంచ్ శ్రీదేవి, తూర్పు గోదావరి జిల్లా సీతారామపురం మండల ఎంపీపీ గుర్రాల జోత్స్నకు ఆహ్వానం అందినట్లు ఆమె వివరించారు.

సురక్షతో సుఖీభవ!

రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష షురూ

- ఆరు నెలల పాటు నిర్విరామంగా కొనసాగేలా ప్రణాళిక
- ప్రజల నుంచి విశేష స్పందన
- స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు
- ఇంటికే వచ్చేస్తున్న ఖరీదైన మందులు



మైలవరంలోని చంద్రాల సురక్ష శిబిరంలో రోగికి రిజిస్ట్రేషన్ చేసి పుస్తకం ఇస్తున్న ఆరోగ్య సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండటమే లక్ష్యంగా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఎన్నడూ లేని విధంగా స్పెషలిస్టు వైద్యులనే గ్రామాలకు పంపించి వైద్య పరీక్షలు నిర్వహించడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అదే స్ఫూర్తితో ప్రస్తుతం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా రక్తపోటు, మధుమేహం, హైపోథైరాయిడ్, గర్భకోశ వ్యాధులు, రక్తహీనత వంటి వ్యాధులపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నారు. అలాంటి వారికి గుర్తించి అవసరమైతే మందులను ఇంటికే తీసుకెళ్లి ఇస్తున్నారు.

ఆరు నెలల పాటు నిర్వహణ..

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఆరు నెలల పాటు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 257, విజయవాడలో 286, మునిసిపాలిటీల్లో 44 నిర్వహించనున్నారు. జనవరిలో 69, ఫిబ్రవరిలో 66, మార్చిలో 67, ఏప్రిల్‌లో 39, మేలో 16, జూన్‌లో 15 ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు. కాగా గ్రామీణ ప్రాంతాల్లో మే నెలలోనే పూర్తికానుండగా, విజయవాడలో మాత్రం జూన్‌లో కూడా కొనసాగేలా ప్రణాళికను సిద్ధం చేశారు. అందుకు అనుగుణంగా స్పెషలిస్టు వైద్యులు, వైద్యాధికారులను నియమించారు.



మైలవరంలోని చంద్రాల సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

జీవనశైలి వ్యాధులపై ప్రత్యేక దృష్టి..

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో జీవనశైలి వ్యాధులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా మధుమేహం, రక్తపోటు, హైపో థైరాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి గుర్తించి వారికి స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నారు. వారు క్రమం తప్పకుండా మందులు వాడేలా అవగాహన కలిగిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే ఎదురయ్యే సమస్యలు వారికి వివరిస్తున్నారు. దీంతో మొదటి విడతలో జీవనశైలి వ్యాధులున్నట్లు గుర్తించిన వారు రెండో విడత శిబిరాలకు వచ్చి పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుంటున్నారు.

ఇంటికే మందులు..

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి గుండె జబ్బులు, కిడ్నీ జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వస్తే, వారికి పరీక్షలు నిర్వహించడంతో పాటు, వారు గతంలో ఏ మందులైతే వాడుతున్నారో వాటినే వారికి అందించేలా ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా శిబిరంలో అందుబాటులో లేని మందులను సీడీఎస్ యాప్‌లో నమోదు చేసి, రోగి పేరు, చిరునామా కూడా పేర్కొంటున్నారు. దీంతో సీడీఎస్ నుంచి ఆ మందులు నేరుగా పోస్టు ద్వారా వారి ఇంటికే చేరుతున్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఖరీదైన మందులను సైతం పోస్టు ద్వారా ఇంటికే చేరుతున్నాయి.

స్పందన బాగుంది..



జిల్లాలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. స్పెషలిస్టు వైద్యులే గ్రామాలకు వచ్చి పరీక్షలు చేస్తుండటంతో ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వారికి పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేస్తున్నాం. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, హైపోథైరాయిడ్ వంటి వ్యాధులున్న వారు రెగ్యులర్‌గా మందులు వాడేలా అవగాహన కలిగిస్తున్నాం. ప్రతి శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, వైద్యాధికారులు పాల్గొంటున్నారు.

- డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్ జిల్లా

జగనన్న సురక్ష శిబిరాలు అద్భుతం



రాష్ట్రంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఒక అద్భుతం. స్పెషలిస్టు వైద్యులే గ్రామాలకు వెళ్లి పరీక్షలు చేయడమనేది ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ చేయలేదు. రోగులకు ఎంతో మేలు చూకూరుతుంది. మారు మూల గ్రామం నుంచి స్పెషలిస్టు వైద్యుల కోసం నగరాలకు రావాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నది. ఇప్పుడు గ్రామాలకే వైద్యులు రావడంతో ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

- డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు, రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్, వైద్య విద్యాశాఖ

హాకీ జిల్లా జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హాకీ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఎన్టీఆర్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.రాజశేఖర్ తెలిపారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన చిరంజీవి, చరణ్‌తేజ, తనిష్క్, సూర్య, చరణ్, ఆదిత్య ఈశ్వర్, దుర్గాప్రసాద్, ప్రవీణ్, హరివినయ్, మహేష్‌కుమార్, దినేష్‌సాయిరామ్, సాయికోటేశ్వరరావు, యాసిన్, సునీల్‌కుమార్, మున్నా, సందేష్, ఇర్ఫాన్, అమిన్ ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో జరిగే అంతర జిల్లాల పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

రేపు జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు మంగళవారం జిల్లా ఉపాధి కార్యాలయం ఆవరణలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. షాపర్స్ స్టాప్, కూల్‌మాన్, ల్యాండ్ మార్క్ గ్రూప్, హెటిరో డ్రగ్స్ మొదలైన కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరై యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న యువతీయువకులు ఈ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్న ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 8142416211లో సంప్రదించాల్సిందిగా కోరారు.

విరమణ ఘట్టం.. పరిసమాప్తం

- ఇంద్రకీలాద్రిపై ముగిసిన భవానీ దీక్షల విరమణ
- 5వ రోజూ తరలివచ్చిన భవానీలు
- 15 లక్షల లడ్డూలు విక్రయం
- అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం



అమ్మవారి దర్శనానంతరం బయటకు వస్తున్న భక్తులు, భవానీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఆదివారం దిగ్విజయంగా ముగిసింది. 3వ తేదీ నుంచి ప్రారంభమైన భవానీ దీక్షలు ఆదివారం నిర్వహించిన పూర్ణాహుతితో పరిసమాప్తమయ్యాయి. శనివారం అర్ధరాత్రి 1 గంటకు ప్రారంభమైన అమ్మవారి దర్శనం ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. ఉదయం 10 గంటలకు మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, సీఐ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగింపు..

దేవస్థాన యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణశర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.

అందరి సహకారంతో..

చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు మీడియాతో మాట్లాడారు. సీపీ టి.కె. రాణా, కలెక్టర్ ఢిల్లీరావు, నగర మున్సిపల్ కమిషనర్, ఇతర ముఖ్య శాఖల అధికారుల సహకారంతో దీక్ష విరమణలను దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. నిత్య అన్నదానంతో పాటు భవానీలకు అల్పాహారం నిరంతరాయంగా అందజేశామన్నారు. ఈ ఏడాది 15 లక్షల లడ్డూలను విక్రయించినట్లు చెప్పారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఇతర అధికారులు ఉత్సవాల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారన్నారు.

గిరి ప్రదక్షిణలో భక్తుల కోలాహలం

భవానీ దీక్షల విరమణ, గిరి ప్రదక్షిణ అంటే కేవలం భవానీలకే కాదు.. నగరవాసులు, భక్తులకూ పండుగే.. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి భవానీలతో పాటు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, ఆలయ సిబ్బంది, అధికారులు, నగర వాసులు భవానీలతో కలిసి అడుగులో అడుగు వేసి గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన రద్దీ ఆదివారం తెల్లవారుజామున 5 గంటల వరకు కొనసాగింది. శనివారం రాత్రి 10 గంటల తర్వాత ప్రతి వెయ్యి మందిలో మూడు వందల మంది భవానీలు, ఉంటే మిగిలిన వారు సాధారణ భక్తులే గిరి ప్రదక్షిణ మార్గంలో కనిపించారు. కుమ్మరిపాలెం, విద్యాధరపురం, సితార, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, బ్రాహ్మణ వీధి, ఆలయ పరిసరాలలో సాధారణ భక్తులు అధికంగా కనిపించారు. ఇక గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న భవానీలు అర్ధరాత్రి నుంచే క్యూలైన్‌లో వేచి ఉండటంతో ఒంటి గంటలకే ఆలయ ద్వారాలను తెరిచారు. దీంతో తెల్లవారుజామున 6 గంటల వరకు ఆలయ పరిసరాలన్ని భవానీలతో కిటకిటలాడాయి.

దుర్గమ్మ దర్శనానికి నాగసాధువు

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం తెల్లవారుజామున నాగసాధువు దర్శించుకున్నారు. కాశీకి చెందిన శివ విష్ణుబ్రహ్మ రామేశ్వరం పాదయాత్రగా వెళ్తూ మార్గమధ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జిల్లాలో 79.52 శాతం పింఛన్ పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక 79.82 శాతం పంపిణీ పూర్తయ్యింది. జిల్లాలో మొత్తం 2,38,838 మంది పెన్షనర్లకు గాను 1,89,928 మందికి నగదు పంపిణీ చేశారు. జిల్లాలో అత్యధికంగా వత్సవాయి మండలంలో 98.97 శాతం, పెనుగంచిప్రోలులో 98.89 శాతం, జగ్గయ్యపేటలో 98.5 శాతం, కొండపల్లి అర్బన్‌లో 98.34శాతం, నందిగామ అర్బన్‌లో 98.18 శాతం పంపిణీ జరిగింది.

ఆన్‌లైన్‌లో పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం లైఫ్ సర్టిఫికెట్స్ ఆన్‌లైన్ సేవా కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఎన్టీఆర్ జిల్లా శాఖ నిర్వహించింది. ప్రతి నెలా పెన్షన్ అందుకునే ప్రభుత్వ ఉద్యోగులు ఏటా లైఫ్ సర్టిఫికెట్స్‌ను ప్రభుత్వ ఖజానాకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో యూటీఎఫ్ ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సేవా కేంద్రంలో పెన్షనర్స్ కళ్లు లేదా బయోమెట్రిక్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్స్‌ను ఆన్‌లైన్ చేసి ట్రెజరీకి పంపించారు. కార్యక్రమంలో ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూరిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సందక కృష్ణ, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 'జన్ భగీదరి' నిర్వహించండి

చిలకలపూడి(మచిలీపట్నం): విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహఆవిష్కరణ సందర్భంగా జన్ భగీదరి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనం ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 19వ తేదీన జరుగుతుందన్నారు. ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు జన్ భగీదరి కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో పౌరులను, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించాలన్నారు. బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనిస్తామని మద్దతు తెలుపుతూ, ప్రతిజ్ఞ చేస్తూ బ్యానర్లపై సంతకం చేసేలా కార్యక్రమాలను జరపాలన్నారు. పాఠశాలలో చిత్రలేఖనం, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు.

పుస్తకం.. శాశ్వతబంధం

- ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి
- ముగిసిన పుస్తక మహోత్సవం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న తనికెళ్ల భరణి, కాంతిలాల్ దండే, ఇంతియాజ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పుస్తకాలతో స్నేహం చేయడం అంటే ఆనందాన్నిచ్చే శాశ్వత బంధం వంటిందని.. కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరుగుతున్న 34వ విజయవాడ పుస్తకమహోత్సవం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు సభకు తనికెళ్ల భరణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ మన పూర్వీకులు మనకు అపారమైన సాహిత్య నిధిని ఇచ్చారన్నారు. అక్షరం అంటే నాశనం లేనిది అని అన్నారు. కొత్త తరానికి పుస్తకాలను, సాహిత్య విలువలను పరిచయం చేయడంలో పుస్తక మహోత్సవం చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. విద్యార్థులు, యువత సెల్‌ఫోన్‌ను బానిసలు కాకుండా ఉండేందుకు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. టీవీ, సెల్‌ఫోన్‌ను చూడటం నుంచి పుస్తకాలను చదవడం వైపునకు పిల్లలను మళ్లించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని తనికెళ్ల భరణి అన్నారు.

ఆనందదాయకం..

గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే మాట్లాడుతూ పుస్తక ప్రచురణకు ప్రసిద్ధి చెందిన విజయవాడలో పుస్తక మహోత్సవం విజయవంతం కావడం ఆనందదాయకంగా ఉందన్నారు. పుస్తకాలను జీవితంలో భాగం చేసుకోవాలని చెప్పారు. మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ పుస్తకాలు తన జీవితంలోని ప్రతి దశలోనూ అభివృద్ధికి, ఆనందానికి కారణమయ్యాయని చెప్పారు. పుస్తకాలు చదవడం వల్ల భిన్నాభిప్రాయాలను స్వీకరించడం, మానసిక వికాసం సాధ్యమవుతుందని చెప్పారు. విజయవాడ పుస్తక మహోత్సవం సంఘం అధ్యక్షుడు మనోహర్ నాయుడు మాట్లాడుతూ పుస్తక మహోత్సవాన్ని ఆదరించిన ప్రజలకు, పుస్తక ప్రియులకు ధన్యవాదాలు తెలిపారు. పుస్తక మహోత్సవంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు అతిథులు బహుమతులను అందించారు. పుస్తక మహోత్సవ సంఘం గౌరవ అధ్యక్షుడు బెల్లపు బాబ్జీ, కార్యదర్శి కె.లక్ష్మయ్య, సభ్యుడు గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఎమెస్కో సంస్థ అధినేత విజయకుమార్ సభకు అధ్యక్షత వహించారు.

స్పెల్ బీకి విశేష స్పందన

- 'సాక్షి' ఆధ్వర్యంలో పరీక్ష
- ఇంగ్లిష్‌పై అవగాహన పెరిగింది : విద్యార్థులు

SAKSHI
సాక్షి | SAKSHI TV
SAKSHI DIGITAL
MEDIA GROUP


స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

SAKSHI SPELL Bee 2023-24

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులకు ఇంగ్లిష్‌పై భయం పోగొట్టి అవగాహన పెంపొందించడానికి 'సాక్షి' నిర్వహిస్తున్న స్పెల్‌బీ టెస్ట్‌కు విశేష స్పందన లభిస్తోంది. విజయవాడ ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఆదివారం స్పెల్ బీ పరీక్ష జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షను రాశారు. సులువైన పద్ధతిలో ఇంగ్లిష్ నేర్చుకోవడానికి పరీక్ష దోహద పడుతుందని వారు ఆనందం వ్యక్తం చేశారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నాలుగు గ్రూపులుగా విభజించి పరీక్ష నిర్వహించారు. కేటగిరీ–1 నుంచి 1, 2 తరగతుల విద్యార్థులు 41 మంది, కేటగిరీ–2 నుంచి 3, 4 తరగతుల విద్యార్థులు 40 మంది, కేటగిరీ–3 నుంచి 5, 6, 7 తరగతుల విద్యార్థులు 68 మంది, కేటగిరీ–4లో 8, 9, 10 తరగతుల నుంచి 42 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణకు ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూలు యాజమాన్యం వ్యవహరిస్తున్నారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పరీక్ష తమ పిల్లల భవిష్యత్‌కు ఎంతగానో ఉపకరిస్తుందని తలిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంగ్లిషంటే భయం పోయింది



నేను 1వ తరగతిలో ఉన్నప్పటి నుంచి ఇంగ్లిష్ అంటే భయం ఉండేది. ఈ స్పెల్ బి పరీక్ష ద్వారా నాకు భయం పోయింది. దీనికి తోడు సులువైన పద్ధతిలో ఇంగ్లిష్ భాషను అర్థం చేసుకుని పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తున్నాను. థ్యాంక్స్ టు సాక్షి.

–టి.ధనిష్ వర్మ, 4వ తరగతి,
సెయింట్‌జాన్స్ స్కూల్, గుణదల

కాంపిటేటివ్ పరీక్షల్లో ఉపయోగం



స్పెల్ బీ పరీక్ష ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడంతో పాటు పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి ఉపయోగపడే విధంగా ఉంది. గతంలో కూడా ఈ పరీక్షలు నేను రాశాను. దీనికి హాజరైనప్పుడల్లా కొత్త విషయాలు, అంశాలను తెలుసుకుంటున్నాను. ఇంగ్లిష్‌ను క్షుణ్ణంగా పరిశీలించి అవగాహన పెంచుకున్నాను.

–వి.తేజస్వి 7వ తరగతి,
కేకేఆర్ గౌతమ్ స్కూల్, గుడివాడ

ఇంగ్లిష్‌పై ఇష్టం పెరిగింది



గతంలో ఇంగ్లిష్ భాష అర్థమయ్యేది కాదు. రాను రాను పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తుండేవి. స్పెల్ బీ పరీక్షకు హాజరై సులువైన పద్ధతిలో నేర్చుకున్నాను. ఇంగ్లిషంటే భయం పోవడమే కాకుండా ఇప్పుడు ఇష్టంగా మారింది. మార్కులు కూడా అధికంగా వస్తున్నాయి.

–ఎస్‌కే ఖలీద్, 5వ తరగతి,
క్విజ్ హైస్కూల్, ఒంగోలు

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన



సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, షేక్ ఆసిఫ్, దేవినేని అవినాష్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం జగన్ పాలన చేస్తున్నారని మేయర్ భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు, పశ్చిమ ఇన్‌చార్జిలు దేవినేని అవినాష్, షేక్ ఆసిఫ్ తెలిపారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన స్మృతివనం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న ప్రారంభిస్తారని చెప్పారు. స్మృతి వనం, అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, అంబేడ్కరిస్టులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. భవానీపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం రాష్ట్రానికి తలమానికమన్నారు. స్మృతివనాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారన్నారు. అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం కావాలని కోరిన వ్యక్తి అంబేడ్కర్ అని పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. సర్పంచ్‌ల నుంచి మంత్రుల వరకు ఆయా వర్గాలకు సామాజిక న్యాయం పాటించారన్నారు. అవినాష్ మాట్లాడుతూ.. రూ.404 కోట్లతో స్మృతివనం, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు స్వరాజ్య మైదానాన్ని సింగపూర్ కంపెనీలకు డెవలప్‌మెంట్‌కు అప్పగించారని గుర్తు చేశారు. అంబేడ్కర్ జీవిత విశేషాలను, రాజ్యాంగ నిర్మాణంలో ఘట్టాలను రాబోయే తరాలకు తెలియజేయడానికి ఏర్పాట్లు చేశారన్నారు. పార్కులు, ఫుడ్ కోర్టులు, థియేటర్లు ఏర్పాటు చేశారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇటువంటి ఆలోచన చేయలేదన్నారు. టీడీపీ, పచ్చ పత్రికలు నిత్యం అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. చంద్రబాబు తన పార్టీ కోసం పని చేసిన విజయవాడ ఎంపీ కేశినేని నానిని అవమానించి పార్టీ నుంచి పంపేశారన్నారు. నమ్మిన వాళ్లను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారన్నారు. అంబేడ్కర్ విగ్రహం సామాజిక న్యాయ స్ఫూర్తికి గుర్తుగా నిలుస్తుందన్నారు. సమావేశంలో ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బండి పుణ్యశీల, తోలేటి శ్రీకాంత్, నాయకులు కె.దుర్గారావు, చందకిరణ్, నిడుమోలు శివరామకృష్ణ, బూదాల శ్రీనివాసరావు, గద్దల లాజర్, కట్టా సత్తి అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందూ ఐకమత్యానికి నడుంబిగించాలి

గుడివాడరూరల్: హిందూ ఐకమత్యానికి నడుంబిగించాలని విజయవాడ శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి అన్నారు. కృష్ణా జిల్లా గుడివాడలోని బంటుమిల్లి రోడ్డులో ఉన్న తాళ్లూరి కల్యాణ మండపంలో ఆజాద్ హిందూ బోర్డ్, వాసవి ఇంటర్నేషనల్ పరివార్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హిందూ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా శివస్వామి అనుగ్రహ భాషణం చేశారు.
పేద, బడుగు, బలహీన వర్గాల హిందువులను ఆదుకోవాలని సూచించారు. ఆత్మీయ అతిథి చికోటి ప్రవీణ్ మాట్లాడుతూ గుడివాడలో గోపరిరక్షణకు తన వంతు సహాయం అందిస్తానన్నారు. బ్రహ్మపథం విశ్వధర్మ పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, యోగసాధకుడు, బ్రహ్మపథం విశ్వధర్మ పరిరక్షణ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రుద్రయోగీశ్వరానందస్వామి, నవశక్తి క్షేత్రం పీఠాధిపతి, విశ్వధర్మ పరిరక్షణ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీశంకరానందస్వామి, శతాధిక ప్రతిష్టాచార్య పండితుడు చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, సుప్రీంకోర్టు అడ్వకేట్ జూపూడి రంగరాజు, వాసవీ ఇంటర్నేషనల్ పరివార్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా పాల్గొన్నారు. అనంతరం పెద ఎరుకపాడులోని దళితవాడలో అన్నవరపు శ్రీనివాసరావు ఇంట్లో స్వాములు సహపంక్తి భోజనాలు చేశారు.

క్లుప్తంగా

దేశంలో ఓబీసీల లెక్క తేలితేనే న్యాయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో ఓబీసీల లెక్క తేలితేనే వారికి విద్య, ఉపాధి, ఉద్యోగం, నిధులు, పదవులు వంటి అంశాల్లో న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. దేశంలో 2021 జనాభా లెక్కల్లో ఓబీసీలను లెక్కిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ మాట తప్పిందని ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని సంఘ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే మొదటిగా బిహార్‌లో ఓబీసీలను లెక్కించారని, అక్కడ 63 శాతం ఉన్నట్లు తేలిందన్నారు. దేశంలో బీసీలను లెక్కించిన మొదటి రాష్ట్రంగా బిహార్ నిలిస్తే, ఏపీలో కూడా లెక్కించి రెండో రాష్ట్రంగా నిలవాలని ఆకాంక్షించారు. బీసీలకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు ధూళిపూడి శ్రీనివాసరావు, ఎస్‌కే ముస్తాఫా, మేకా వెంకటేశ్వరరావు, ఉప్పాల రాజ్‌కిరణ్, పుల్లారావు, కంభంపాటి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి



కంకిపాడు: కోడిపందేల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నెప్పల్లి శివారు బహిరంగ ప్రదేశంలో కోడిపందేలు ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ ప్రాంతంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,300 నగదు, కోడిపుంజు, 38 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

268 మద్యం సీసాలు స్వాధీనం

కంకిపాడు: బెల్టుషాపులపై కంకిపాడు పోలీసులు ఆదివారం విస్తృత దాడులు చేశారు. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఈడుపుగల్లు, వేల్పూరు, పునాదిపాడు, కంకిపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై దాడులు చేసి ఎనిమిది మంది మద్యం విక్రేతలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 268 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం అక్రమ విక్రయాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ సంఘ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసులరెడ్డి (ఎఫ్ఆర్‌ఓ, విజయవాడ) గెలుపొందారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం జరిగింది. దీనిలో సంఘ రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసులరెడ్డి 50 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆయనకు మొత్తం 83 ఓట్లు లభించగా ఆయనపై పోటీచేసిన అభ్యర్థి రామ్ నరేష్‌కు 33 ఓట్లు లభించాయి. అధ్యక్షుడుగా ఎస్.లక్ష్మీపతి, ఉపాధ్యక్షుడిగా ఎస్.వి.కె.కుమార్, టి.ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎ.సౌమ్య, అదనపు సంయుక్త కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, ప్రాంతీయ కార్యదర్శులుగా ఆర్.రాజాబాబు, ఎస్.అశోక్‌కుమార్ యాదవ్, కోశాధికారిగా ఇ.విశ్వేశ్వరరావు ఎన్నికయ్యారు. జె.వి.సుబ్బారెడ్డి (డీఎఫ్ఓ, పలమనేరు), రవిశంకర శర్మ (డీఎఫ్ఓ, మంగళగిరి) ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. నూతన కమిటీ మూడేళ్ల కొనసాగుతుందని సభ్యులు తెలిపారు. నూతన కమిటీని సంఘ సభ్యులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

షేర్ మహమ్మద్ పేట (జగ్గయ్యపేట): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గండ్రాయికి చెందిన నల్లబోతు హనుమంతు (30) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. జగ్గయ్యపేట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చెరువు కట్ట వద్ద వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. అతని తలకు తీవ్ర గాయం కావడంతో ఘటనా స్థలంలోనే మరణించాడు. స్థానికులు గుర్తించి చిలకల్లు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

సైబర్ నయా ఎత్తుగడ

- ప్రభుత్వ పథకాల పేరుతో బురిడీ
- యూపీఐ యాప్‌లలో నగదు జమ చేస్తామని నమ్మిస్తున్న నేరస్తులు
- క్యాష్ రిక్వెస్ట్‌లతో దోపిడీ
- పటమట, సింగ్‌నగర్ పీఎస్‌ల పరిధుల్లో ఘటనలు



యూపీఐ యాప్‌లలో క్యాష్ రిక్వెస్ట్‌ల చిత్రాలు

విజయవాడ స్పోర్ట్స్: సైబర్ నేరగాళ్లు నయా ఎత్తుగడలతో ప్రజలను మోసగిస్తున్నారు. ప్రజల స్థితిగతులు తెలుసుకుంటూ సమాజంలో జరుగుతున్న మార్పులను వారు మోసం చేయడానికి అనుగుణంగా మార్చుకుంటున్నారు. సైబర్ నేరాలకు రోజుకొక కొత్త రూపాన్ని ఇస్తూ.. ఆన్‌లైన్ నేరాలను కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను ఆసరాగా చేసుకుంటున్నారు. తాజాగా విజయవాడలోని పటమట, సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన పరిధుల్లో ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో జిల్లా సైబర్ యంత్రాంగం అప్రమత్తమైంది.

మోదీ పథకమంటూ..

సింగ్‌నగర్‌లోని ఓ గర్భిణికి ఇటీవల సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. గర్భిణిగా ఉన్న మీకు కేంద్ర ప్రభుత్వం రూ. 80 వేలు మంజూరు చేసిందని నమ్మించారు. బ్యాంకు ఖాతాతో పాటు మరికొన్ని వ్యక్తిగత వివరాలను ఆమె నుంచే సేకరించారు. బ్యాంకు ఖాతాలో కనీసం రూ.2 వేలు ఉంటేనే ప్రభుత్వ నగదు మీ బ్యాంకు ఖాతాలో పలు విడతల్లో మొత్తం 24 గంటల్లో జమ అవుతుందని నమ్మించారు. అప్పటికే ఆమె బ్యాంకు ఖాతాలో రూ.62 వేలు ఉండటంతో డబ్బులున్నాయని నేరగాళ్లకు ఆమె తెలిపింది. వెంటనే ఆమె ఫోన్ పే యాప్‌కు రూ. 10 వేలు క్యాష్ రిక్వెస్ట్ పంపారు. మెసేజ్ క్యాష్ రిక్వెస్ట్ అని తెలీక.. డబ్బులు పడ్డాయేమోననే ఆశతో నేరగాళ్ల సూచనతో రిక్వెస్ట్‌పై క్లిక్ చేసి, ఓటీపీ ఎంటర్ చేసింది. ఆ తర్వాత ఆమె ఖాతా నుంచి రూ. 10 వేలు పోయినట్లు వచ్చిన మెసేజ్ ఆధారంగా గ్రహించి మళ్లీ వారిని సంప్రదించింది. నేరగాళ్ల మాయమాటల్లో పడి కేవలం మూడు గంటల వ్యవధిలో ఎనిమిది సార్లు రూ. 60,905 పోగొట్టుకుంది.

ఆపరేషన్ చేయించుకున్న మహిళకు ఫోన్

కంటి ఆపరేషన్ చేయించుకుని పటమటలోని తన ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న ఓ మహిళ సైబర్ నేరగాళ్ల వలలో పడింది. ఆపరేషన్ చేయించుకున్న మీకు ఆరోగ్యశ్రీ పథకంలో ప్రభుత్వం రూ.8,859 మంజూరు చేసిందని, ఆ నగదును మీ ఫోన్ పే నకు పంపిస్తామని, బ్యాంకులో కనీసం రూ. 2 వేలు బ్యాలెన్స్ ఉండాలని నమ్మించారు. ఆమె బ్యాంకు ఖాతాలో నగదు లేవని చెప్పడంతో.. నగదు నిల్వలు ఉండే మీ బంధువుల నంబర్ ఇస్తే.. వాటికి పంపిస్తామని నేరగాళ్లు ఆమెకు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆమె బంధువు నంబర్ ఇచ్చింది. ఆ నంబర్‌కు పలుమార్లు ఫోన్ పే లో క్యాష్ రిక్వెస్టులు పంపి రూ. 23 వేలను దోచేశారు.

ఇది ఎలా చేస్తారంటే

చికిత్స చేయించుకున్న/చేయించుకునే అవసరం ఉన్న వారే ఎక్కువగా ఇలాంటి నేరాల్లో బాధితులుగా ఉన్నారు. వైద్యానికి డబ్బులు అవసరం వారికే ఎక్కువ ఉండటం, ఇలాంటి వారు అప్పు చేసైనా బ్యాంకుల్లో దాచుకుంటారనే ఆలోచనలో సైబర్ నేరగాళ్లు వారికి గాలం వేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచే రోగుల నంబర్లను సేకరించి మోసానికి తెరదీస్తున్నారు. ముందుగా ఫోన్ చేసిన నేరగాడు.. రోగికి ఉపశమనం కలిగేలా తియ్యని మాటలతో దింపుతాడు. ప్రభుత్వ పథకంలో డబ్బులు వచ్చాయని నమ్మించి బాధితుల నుంచే వారి బ్యాంకు ఖాతా, కుటుంబ వివరాలను సేకరిస్తున్నారు. రోగులతో ఫోన్‌లో సంభాషిస్తూనే వారి యూపీఐ యాప్‌లకు నేరగాడు క్యాష్ రిక్వెస్ట్ పంపిస్తాడు. దాన్ని క్లిక్ చేసి వచ్చిన ఓటీపీని ఎంటర్ చేస్తే మీ బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వ పథకం నగదు జమవుతుందని నమ్మించి మోసం చేస్తున్నారు. యూపీఐ యాప్‌లు(ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం)లలో క్యాష్ రిక్వెస్ట్ సిస్టమ్‌ను ప్రజలు అత్యధికంగా ఉపయోగించకపోవడం, అసలు ఆ ఆప్షన్ ఎక్కడుంటుందో చాలా మందికి తెలీకపోవడం నేరగాళ్లకు వరంగా మారింది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రజలు ఈ నేరాల బారిన పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి

ప్రభుత్వ పథకం పేరుతో సైబర్ నేరాలు జరుగుతున్నాయి. సంక్షేమ పథకాల నగదును ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేయవని లబ్ధిదారులు గ్రహించాలి. ఎవరైనా ఫోన్ చేసి ప్రభుత్వ అధికారులమని చెబితే పూర్తిగా నిర్ధారించుకోకుండా నమ్మవద్దు. దీనిపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఈ రెండు నేరాలకు పాల్పడింది ఒకే వ్యక్తి. హైదరాబాద్ కేంద్రంగా ఆ వ్యక్తి ఈ నేరాలు చేస్తున్నాడు.

– ఎల్.రాజవర్ష, ఎస్ఐ,
సైబర్ పోలీస్‌స్టేషన్, ఎన్టీఆర్ జిల్లా

పీఎస్ వద్ద చాకుతో దాడి

తోట్లవల్లూరు: పోలీస్‌స్టేషన్ వద్ద వ్యక్తిపై చాకుతో దాడికి పాల్పడిన ఘటన తోట్లవల్లూరులో జరిగింది. తోట్లవల్లూరు శివారు కలాసుమాల పల్లికి చెందిన గుమ్మడి నాగేశ్వరరావు, గుమ్మడి శిరీష, తెలుగు సుధాకర్, సుజాత ఆదివారం మధ్యాహ్నం పరస్పరం కర్రలతో కొట్టుకున్నారు. పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి, చికిత్స కోసం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి పంపించారు. చికిత్స అనంతరం ఇరువర్గాలను పోలీసులు రాత్రి 7.30 గంటలకు విచారణకు పిలిచారు. స్టేషన్‌లో ఎస్ఐ విశ్వనాథ్, గుమ్మడి నాగేశ్వరరావు, శిరీషను విచారణ చేస్తున్నారు. ఆ సమయంలో వీరి సమీప బంధువు గోగులమూడి అనిల్‌కుమార్ స్టేషన్ బయట ఉన్న తెలుగు సుధాకర్‌పై వెనుక నుంచి ఫోల్డింగ్ చాకుతో దాడికి పాల్పడ్డాడు. సుధాకర్ గాయపడటంతో పోలీసులు ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి చేసిన గోగులమూడి అనిల్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పమిడిముక్కల సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ విశ్వనాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెదపాలెంలో విజయవాడ యువకుడికి కత్తిపోట్లు

నాగాయలంక: పెదపాలెంలో ఆదివారం రాత్రి 7గంటల సమయంలో విజయవాడకు చెందిన షేక్ షరీఫ్ హుస్సేన్ కత్తి పోట్లకు గురయ్యాడు. నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం ఇచ్చిన వివరాల ప్రకారం.. విజయవాడలోని మొబైల్ ఫోన్ల షాపులో చేస్తున్న షరీఫ్‌కు అదే షాపులో పనిచేసిన పెదపాలెం యువతితో పరిచయం ఏర్పడింది. ఆమె కోసం అతను ఇక్కడకు రావడంతో యువతి తండ్రి అర్జునరావు, సోదరుడు నాగరాజు షరీఫ్‌పై కత్తితో పొడిచారని ఎస్ఐ పేర్కొన్నారు. షరీఫ్‌ను 108వాహనంలో అవనిగడ్డ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం బందరు ప్రభుత్వాసుపత్రికి పంపించారని ఎస్ఐ చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పిట్టగోడపై పడి వ్యక్తి అనుమానాస్పద మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పిట్టగోడపై నుంచి పడి ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన ఆదివారం కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట రాజగిరి వారి వీధికి చెందిన పడాల లక్ష్మి, జగదీష్ భార్యాభర్తలు. జగదీష్ తాపీ పని, లక్ష్మి టిఫిన్ బండి పెట్టుకుని జీవిస్తుంటారు. కొంత కాలంగా భార్యాభర్తలు అనారోగ్య కారణాలతో ఇంటి వద్దే ఉంటున్నారు. లక్ష్మి కుటుంబానికి బంధువులతో కొన్ని ఆస్తి తగాదాలున్నాయి. దీన్ని పెద్ద మనుషుల మధ్య మాట్లాడుకోవాలని నిర్ణయించి సూరిబాబు అనే వ్యక్తిని ఆదివారం ఇంటికి రావాల్సిందిగా కోరారు. అతను ఇంటికి వచ్చాక, జగదీష్ వరండాలో కూర్చుని మాట్లాడుకోసాగారు. ఈ క్రమంలో జగదీష్ గట్టిగా మాట్లాడుతూ పైకి లేచి పిట్టగోడపై పడటంతో తలకు గాయమైంది. స్థానిక ఆర్ఎంపీ పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 522.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 829.00 అడుగుల వద్ద ఉంది.


ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాల నృత్యాలు

నేత్రపర్వం 'సంక్రాంతి' నృత్య రూపకం

విజయవాడ కల్చరల్: జేఎంఎస్ నాట్యవేద అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ఆదివారం సంక్రాంతి సంబరాల నృత్య రూపకం నేత్రపర్వంగా సాగింది. నృత్య కళాకారిణులు జంగం మనీషాచక్రవర్తి, శిరీషాచక్రవర్తి నృత్య పర్యవేక్షణలో తెలుగు వారి ఇంట సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. హరిదాసులు, భోగిమంటలు, ఇంటిముందు గొబ్బిళ్లు, భోగిపళ్లు, రంగవల్లులు, రైతులు వరిమడులు కోయడం, కుప్పలు వేయడం, పండిన పంటలను ఇంటికి చేర్చడం, తదితర అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. కార్యక్రమాలను కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో తెలుగు వారి తొలి పండుగ సంక్రాంతి అని తెలుగు వారు సంయుక్తంగా జరుపుకుంటారని తెలిపారు. సాహితీవేత్త డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ నేటి తరం వారికి పండుగల విశిష్టతను తెలియజేయాల్సిన అవసరముందన్నారు. రైతు ప్రతినిధులు అన్నవరపు పూర్ణచంద్రరావు, సాంబశివరావు, రాజా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రావులపల్లి రాజా తదితరులు పాల్గొన్నారు. సంస్థ నిర్వాహకులు జంగం విజయకుమార్, జంగం చక్రవర్తి నిర్వహించారు.

క్లుప్తంగా

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): కుల, మత, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి అన్నారు. డివిజన్‌లోని 110 వార్డు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ ముందంజ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయడంలో సహాయం చేయడమే కాకుండా సాయం అవసరమైన వారికి వ్యక్తిగతంగా ఆదుకోవడంలోనూ తాము ఎల్లప్పుడు ముందంజలో ఉంటామని వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి, వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. క్రీస్తురాజుపురంలో నివాసం ఉంటున్న ఆలేటి రమేష్‌కు జీవనోపాధి నిమిత్తం రూ.20 వేలు విలువ చేసే బడ్డీ కొట్టును యలమంచిలి జయప్రకాష్ కొనుగోలు చేసి ఆదివారం ఉదయం వారికి అందజేశారు. కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, పార్టీ నాయకులు శివ, నీలం కొండ, లోకేష్, రత్నరాజు, సుందర్‌రావు పాల్గొన్నారు.

వృద్ధులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): చలికాలం దృష్ట్యా వృద్ధులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే వేడి ఆహారం, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. అనంతరం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



4వ డివిజన్‌లో నమూనా చెక్కు అందజేస్తున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ, నాయకులు

గుణదల(విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 4వ డివిజన్ పరిధిలోని పటాల ఓంకార్ కల్యాణ మండపంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పేదల నాడి తెలిసిన నాయకుడుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారని తెలిపారు. ప్రజా క్షేత్రంలో సీఎంకు ఆదరణ పెరుగుతోందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఆయన సఫలమయ్యారని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వివరించారు. ముఖ్యంగా పింఛన్లు పెంచుతూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం వృద్ధుల్లో ఆనందాన్ని నింపుతుందని చెప్పారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని 4, 10, 11 డివిజన్లకు చెందిన 1,936 మందికి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డివిజన్ ఇన్‌చార్జి గల్లా రవి, నాయకులు పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నినాదంతో ప్రభుత్వ పాలన

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా మారుతుందని, దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. పటమట 10వ డివిజన్ మారుతీ కో–ఆపరేటివ్ కాలనీలో ఆదివారం పటమట పంటకాల్వ రోడ్డు నుంచి గురునానక్ నగర్ వరకు రూ.40 లక్షలతో నూతనంగా వేయనున్న రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే గెలుపోటములు, ఓట్ల రాజకీయాలతో సంబంధం లేకుండా అభివృద్ధి నినాదంతో ప్రభుత్వం పాలన సాగుతోందన్నారు. ఈ ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేయడమే కాకుండా వాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తున్నామని చెప్పారు.

టీడీపీది ప్రచార ఆర్భాటమే..

నిత్యం ప్రభుత్వం మీద విమర్శలు చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, 10వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఇంత వరకు కౌన్సిల్‌లో డివిజన్ అభివృద్ధిపై మాట్లాడలేదని అవినాష్ అన్నారు. టీడీపీకి ప్రజా సమస్యల కంటే ప్రచార ఆర్భాటమే ఎక్కువని విమర్శించారు. గత ప్రభుత్వంలో స్ట్రామ్‌వాటర్ పేరుతో కోట్లాది రూపాయలు దోచుకొని నగర అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తూ వారికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. మేము మంచి చేశాం కాబట్టి ధైర్యంగా ప్రజల ముందుకు వచ్చి చెబుతున్నామని టీడీపీ ఏంచేశారో చెప్పే దమ్ముందా అని ప్రతిపక్షాలకు అవినాష్ సవాల్ విసిరారు. కార్యక్రమంలో 10వ డివిజన్ ఇన్‌చార్జి కరుటూరి హరీష్, కో ఆప్షన్ సభ్యుడు ముసునూరి సుబ్బారావు, శాప్ డైరెక్టర్ కావటి దామోదర్, కాలనీ పెద్దలు కొమ్మినేని హరి ప్రసాద్, శంకరరావు, అచ్యుతరావు, సతీష్ రెడ్డి, శ్రీనివాసరావు, ఉదయ్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

'చంద్రబాబు ఓ నయవంచకుడు'



డాక్టర్ మెహబూబ్ షేక్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓ నయవంచకుడు అని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ విమర్శించారు. నగరంలోని తన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. తిరువూరు సభలో చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రానికి అసమర్థుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడని పేర్కొన్నాడన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఏమి చేశావో చెప్పుకోలేని చంద్రబాబు అసమర్థుడా, నాలుగున్నరేళ్లలో చేసిన మంచి చూసి ఓటేయమని అడుగుతున్న వైఎస్ జగన్ అసమర్థుడా ప్రజలే చెబుతారన్నారు. చంద్రబాబు మాటలు వింటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక అవుతుందన్న చంద్రబాబు, ఇప్పుడు అమలవుతున్న పథకాలనే పేర్లు మార్చి తాను అమలు చేస్తానని చెప్పడం ఆయన దిగజారుడు తనానికి, అవకాశవాద రాజకీయాలకు తార్కాణమన్నారు. గతంలో 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి ఒకటీ నెరవేర్చలేదని, ఇప్పుడు కూడా అలాగే చేస్తారని ప్రజలు భావిస్తున్నారన్నారు. విజనరీ ఎవరో ప్రజలు తేలుస్తారని డాక్టర్ మెహబూబ్ షేక్ పేర్కొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి వసుమతి



ఇంద్రగంటి జానకీబాలకు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి చలసాని వసుమతి అని ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు అన్నారు. చలసాని మధుమతి మాధవ సేవా సాహితీ సమితి ఆధ్వర్యంలో టిక్కిల్‌రోడ్డులోని సమితి కార్యాలయంలో సాహితీవేత్తలు ఎల్ఆర్ స్వామి, ఇంద్రగంటి జానకీబాలలకు వసుమతి జీవన సాఫల్య పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్ణచందు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలోని కథ, నవల, అనువాద ప్రక్రియలలో వసుమతి తమ ప్రతిభను చాటుకున్నారన్నారు. రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు వసుమతి సాహితీ సేవలను వివరించారు. చలసాని వసుమతి మాధవ సేవా సమితి ద్వారా తెలుగు సాహిత్యంలో కృషి చేసిన వారికి జీవన సాఫల్య పురస్కారాలను ప్రధానం చేస్తునన్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీత జానకీబాల వసుమతి సాహితీ సేవలను వివరించారు. అనువాదకుడు ఎల్ఆర్ స్వామి తెలుగు సాహిత్యంలో అనువాదాలు అంశంగా ప్రసంగించారు. రచయిత్రి వసుమతి సంస్థ లక్ష్యాలను తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రగంటి మోహనకృష్ణ, మాధవ సేవా సమితి నిర్వాహకుడు చలసాని రవి తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పౌర గ్రంథాలయ శాఖ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనలో పలు రకాల నీతి కథలు, రామాయణం భారత కథలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. చిన్నారులకు పుస్తకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి కే రమాదేవి మాట్లాడుతూ పుస్తకాలు దారి చూపే దివ్వెలని అంతటి మహోన్నత్యం గల పుస్తకాల ప్రాముఖ్యత గురించి పిల్లలకు అవగాహన కల్పించడానికే ప్రదర్శన నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వై ధనలక్ష్మి, జే శంకర్, ఫణిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు గుర్తింపునిచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్



హరీష్‌ను సన్మానిస్తున్న తోలేటి శ్రీకాంత్, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏడున్నర దశాబ్దాల భారతదేశ చరిత్రలో బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకొని వదిలేసిన ప్రభుత్వాలను చూశామని, కానీ తొలిసారి బీసీలకు అసలైన గుర్తింపునిచ్చిన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తున్నామని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం నగర యువజన అధ్యక్షుడిగా ఎంపికైన చిట్టూరి హరీష్‌కు బీసీ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యాన సింగ్‌నగర్‌లో ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకాంత్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో బీసీలకు అన్నిరంగాల్లో అధిక ప్రాధాన్యత లభించిందన్నారు. కిందిస్థాయి డైరెక్టర్ల నుంచి పలు కార్పొరేషన్ల చైర్మన్లు, మేయర్లు, ఎమ్మెల్యే సీట్లు, క్యాబినెట్‌లో మంత్రుల వరకూ బీసీలకు అప్పగించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. బీసీలంతా రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. హరీష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి యువజన విభాగ బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర అధ్యక్షులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభివృద్ధి కోసం తనశక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. బీసీ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



విజేతలతో నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య చెప్పారు. సిప్ అబాకస్ ఇండియా ఆధ్వర్యంలో సిప్ అర్థమెటిక్ జీనియస్ కాంటెస్ట్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగాయి. వివిధ జిల్లాల్లోని పలు పాఠశాలలకు చెందిన 700 మందికిపైగా విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని సీతారామయ్య అతిథిగా హజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవజీ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.అరుణారెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు వారిలోని ప్రతిభకు మరింత పదును పెట్టుకునేందుకు అవకాశం లభిస్తోందన్నారు. సిప్ అబాకస్ సంస్థ స్టేట్ హెడ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ఈ నెల 28న చెన్నైలో జాతీయ స్థాయిలో జరిగే పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆదివారం నిర్వహించిన పోటీల విజేతలకు అతిథులు బహుమతితో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్ మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంబరాల్లో భాగంగా భోగి మంటలు, భోగిపళ్లు పోయడం, వరిపొలాల్లో వరికుప్పలు నూర్చడం లాంటి సన్నివేశాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అలాగే హరిదాసులు, రంగవల్లులు, గొబ్బెమ్మలు, పిండివంటలు చేయడం లాంటివి చూడముచ్చటగా ఉన్నాయి. యాంత్రిక జీవనంలో పడి మర్చిపోయిన పల్లె వాతావరణాన్ని, జ్ఞాపకాలను విద్యార్థులు గుర్తు చేశారు. సంక్రాంతి సంబరాల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



గాయనీ గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: గాయనీ గాయకులు స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హైదరాబాద్‌కు చెందిన సరస్వతీ కళాపీఠం వ్యవస్థాపకురాలు మధిర రోజా ప్రసన్నత సూచించారు. నూతన సంవత్సరం, సంక్రాంతి వేడకల సందర్భంగా సరస్వతి కళాపీఠం ఆధ్వర్యంలో గాం. దీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర రోజా ప్రసన్నత మాట్లాడుతూ గాయనీ గాయకులు నిత్యం పాటలోని సాహిత్యం అధ్యయనం చేయాలని సూచించారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణ మూర్తి మాట్లాడుతూ సరస్వతీ కళాపీఠం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విలువలతోకూడిన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ప్రతిభను గుర్తిస్తూ నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తునట్లు తెలిపారు. పీసుపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, కొప్పరపు ఉమాబలరాం, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి తదితరులు శాస్త్రీయ, క్లాసికల్ గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులు కాటూరి దుర్గాప్రసాద్, దేవికృష్ణ, చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, చిత్రకారుడు మల్లిక్‌తోపాటు గాయనీ గాయకులను వాద్య సహకారం అందించిన వారిని ఆత్మీయంగా సత్కరించారు.

అమ్మా.. మనసాస్మరామి











ఇంద్రకీలాద్రిపై ఐదు రోజులుగా జరుగుతున్న భవానీ దీక్ష విరమణలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భవానీలు ఆదివారం తరలివచ్చారు. గిరి ప్రదక్షిణ నిర్వహించి, అమ్మ వారిని దర్శించుకున్న అనంతరం ఇరుముడులను సమర్పించారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేడు వీఎంసీ 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

భక్తిశ్రద్ధలతో సారె సమర్పణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ఆండాళ్ అమ్మ వారికి సారె సమర్పించారు. తొలుత ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షణలో భక్తులు, మండలి సభ్యులు వివిధ రకాల పండ్లు, పసుపు, కుంకుమ, రవిక, వస్త్రాలు, పుష్పాలు, ఆహార పదార్థాలతో సత్యనారాయణపురం, ముత్యాలంపాడు పుర వీధుల్లో మేళతాళాలతో పారాయణం చేస్తూ మందిరానికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా గాజులతో అలంకరించిన ఆండాళ్ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. సుమారు 1000 మంది భక్తులు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను పారాయణ మండలి సభ్యులు పర్యవేక్షించారు.

• ఇబ్రహీంపట్నం: దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలో ఇబ్రహీంపట్నానికి చెందిన దస్తావేజు లేఖరి కొమ్మూరి వెంకటేశ్వరరావు రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు.

అయోధ్య రామ మందిరం అక్షింతల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): అయోధ్య రామ మందిరం నిర్మాణంలో భాగంగా అక్కడ నిర్వహించిన యాగానికి సంబంధించిన అక్షింతలను విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని రోటరీనగర్, శ్రీనిధి శాంతినగర్ కాలనీ, బ్రహ్మయ్య కాలనీవాసులకు ఆదివారం సాయంత్రం పంపిణీ చేశారు. కబేళా సెంటర్‌లోని వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరామచంద్రమూర్తి అక్షింతలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. వాటితో పాటు అయోధ్య రామమందిరం నిర్మాణ ఫొటో, ఆలయ విశిష్టతను తెలిపే కరపత్రం, ప్రసాదం, పసుపు కుంకుమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దుర్గా కిషోర్ మాట్లాడుతూ.. అయోధ్య రామమందిర అక్షింతలు తమ ట్రస్ట్‌కు కార్యాలయానికి చేరుకున్నాయని, భక్తులకు అక్షింతలు అందజేయాలనే తలంపుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. తొలుత శ్రీరామపట్టాభిషేకం చిత్రపటానికి, అయోధ్య రామమందిర అక్షింతలకు పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ విజయలక్ష్మి, ట్రెజరర్ చంద్రభట్ల రాజ్యలక్ష్మి, రమణమూర్తి, బొమ్ము గోవింద లక్ష్మి, విశ్వహిందూ పరిషత్ రాజేష్, ఆర్ఎస్ఎస్ సభ్యులు రాజేంద్రప్రసాద్, లక్ష్మి శ్రీనివాస్, శిరీష, ట్రస్ట్ సభ్యులు వీరయ్య, సుధాకర్, దుర్గాప్రసాద్, రాజేష్ ప్రసాద్, శంకర్, జయలక్ష్మి పాల్గొన్నారు.

తీరం మనదే.. వేటా మనదే

నిశ్చింతగా మత్స్యకారులు.. వలసలకు స్వస్తి

సాక్షి, అమరావతి: మత్స్యకారులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో పది ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనులు శరవేగంగా పూర్తి చేస్తోంది. రాష్ట్రంలో ఫిషింగ్ హార్బర్లు లేకపోవడంతో మత్స్యకారులు ఉపాధి కోసం గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు వలస వెళ్లాల్సి వస్తోంది. పాదయాత్ర సమయంలో వారి కష్టాలను స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే వారికి స్థానికంగానే ఉపాధి కల్పించేలా ఫిషింగ్ హార్బర్లు నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. ఈమేరకు రూ.3,520.56 కోట్లతో రెండు దశల్లో పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం, రూ.126.91 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. తొలిదశలో చేపట్టిన జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జువ్వలదిన్నె హార్బర్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తి కావడంతో త్వరలో ప్రారంభించనున్నారు. మరో మూడు హార్బర్ల పనులు 60 నుంచి 70 శాతం పూర్తి కాగా సెప్టెంబర్ నాటికి ఇవి అందుబాటులోకి రానున్నాయి. ఇక రెండో దశలో బుడగట్లపాలెం, పూడిమడక, బియ్యపుతిప్ప, ఓడరేవు, కొత్తపట్నం, మంచినీళ్లపేట ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వీటికి అదనంగా మత్స్యకారులు బోట్లను నిలుపుకొని చేపలు దింపుకునే విధంగా చింతపల్లి, భీమిలి, రాజయ్యపేట, దొండవాక, ఉప్పలంక, రాయదరువు వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ హార్బర్లు అందుబాటులోకి వస్తే అదనంగా 4.5 లక్షల టన్నుల మత్స్య సంపద సమకూరుతుందని, వీటి ద్వారా రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.9 వేల కోట్ల మేర పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.



జువ్వలదిన్నె హార్బర్‌లో ఏర్పాటు చేసిన షెడ్లు

హార్బర్ ఆధారిత పరిశ్రమలు..

హార్బర్ల ద్వారా మత్స్యకారులు అధికాదాయం పొందే మార్గాలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె వద్ద రూ.288.81 కోట్లతో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు దాదాపు పూర్తి కావడంతో ఇక్కడ ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్, బోట్ బిల్డింగ్ యార్డులను ఏపీ మారిటైమ్ బోర్డు నెలకొల్పుతోంది. ఒక్క జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారానే ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద సమకూరనుంది. వచ్చే 30 ఏళ్లలో ఈ హార్బర్ ద్వారా మిలియన్ టన్నుల మత్స్య సంపద లభిస్తుందని ఏపీ మారిటైమ్ బోర్డు అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగా హార్బర్ వెలుపల 20 ఎకరాల విస్తీర్ణంలో ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్, 5 ఎకరాల విస్తీర్ణంలో బోట్ల తయారీ యూనిట్ ఏర్పాటు కానుంది.

కొత్త బోట్లకు డిమాండ్

రాష్ట్రంలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్లలో 10,521 బోట్లను నిలుపుకునే సామర్థ్యం ఉండటంతో కొత్త బోట్లకు పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడనుంది. 9ఎం ఎఫ్ఆర్‌పీ రకం, 12 ఎం గిల్ నెట్టర్, 15ఎం ట్రావలర్, 24ఎం టూనా లాంగ్ లైనర్ లాంటి అత్యాధునిక బోట్లు అవసరం కానున్నాయి. అన్ని హార్బర్ల వద్ద ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్లను అభివృద్ధి చేయడం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

ఫిషింగ్ హార్బర్	వ్యయం	మత్స్యకార కుటుంబాలకు లబ్ధి	బోట్లు నిలిపే సామర్థ్యం
జువ్వలదిన్నె	రూ.288.80 కోట్లు	6,100	1,250
నిజాంపట్నం	రూ.451 కోట్లు	9,000	1,600
మచిలీపట్నం	రూ.422 కోట్లు	3,300	550
ఉప్పాడ	రూ.361 కోట్లు	17,700	2,500
మంచినీళ్లపేట	డీపీఆర్ దశలో ఉంది		
బుడగట్ల పాలెం	రూ.365.80 కోట్లు	3,840	780
పూడిమడక	రూ.392.53 కోట్లు	4,870	930
కొత్తపట్నం	రూ.392.53 కోట్లు	4,200	820
ఓడరేవు	రూ.417.55 కోట్లు	9,500	1,650
బియ్యపు తిప్ప	రూ.429.43 కోట్లు	2,348	441
మొత్తం	రూ.3,520.56 కోట్లు	60,858	10,521

కూలీల నుంచి యజమానులుగా..



రాష్ట్రంలో ఫిషింగ్ హార్బర్లు లేకపోవడంతో ఇన్నాళ్లూ పని కోసం చెన్నై, మంగళూరు వలస కూలీలుగా వెళ్లాం. ఇప్పుడు ఇక్కడే ఫిషింగ్ హార్బర్లు వస్తుండటంతో అత్యాధునిక మెకనైజ్డ్ బోట్లు కొనుగోలు చేసుకొని యజమానులుగా మారే అవకాశాన్ని ఈ ప్రభుత్వం కల్పించింది. ఫిషింగ్ హార్బర్, దీనికి అనుబంధంగా వచ్చే పరిశ్రమల వల్ల ఒక్క జువ్వలదిన్నెలోనే 15 వేల మందికిపైగా ఉపాధి లభించనుంది. తుపాన్లు వచ్చినా తట్టుకునే విధంగా హార్బర్‌ను నిర్మిస్తున్నారు.

– కొండూరు అనిల్ బాబు, చైర్మన్, ఏపీ ఫిషరీస్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ (ఆఫ్కాఫ్)

సురక్షితంగా ఒడ్డుకు బోట్లు



ఫిషింగ్ హార్బర్ లేకపోవడం వల్ల బోట్లను ఒడ్డుకు చేర్చడం చాలా కష్టమయ్యేది. అమావాస్య, పౌర్ణమి సమయంలో ఆటు పోట్లు వల్ల ఈ ఇబ్బంది అధికంగా ఉండేది. కొన్ని సందర్భాల్లో బోట్లు తీరానికి తగలడం వల్ల పగిలిపోయేవి. ఇప్పుడు మచిలీపట్నంలో అత్యాధునిక వసతులతో హార్బర్ నిర్మిస్తుండటంతో బోట్లను సురక్షితంగా నిలుపుకోవచ్చు.

– పైకం ఆంజనేయులు, ఫైబర్ బోట్ల యజమానుల సంఘం, మచిలీపట్నం.



జువ్వలదిన్నె హార్బర్‌లో కమర్షియల్ కాంప్లెక్స్

పర్యాటక ఏర్పాట్లు పరిశీలిస్తున్నాం



మత్స్యకారులు చేపల వేట కోసం కుటుంబాలకు దూరంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే అవసరం లేకుండా ముఖ్యమంత్రి జగన్ ఏక కాలంలో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని చేపట్టారు. కేవలం ఫిషింగ్ హార్బర్లు కట్టి వదిలేయడమే కాకుండా చేపలకు మంచి విలువతో పాటు స్థానిక మత్స్యకారులకు ఉపాధి లభించేలా హార్బర్ ఆధారిత పరిశ్రమలను పెద్దఎత్తున నెలకొల్పుతున్నాం. ప్రతి ఫిషింగ్ హార్బర్ వద్ద ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్, బోట్ బిల్డింగ్ యార్డులతో పాటు ఇతర అవకాశాలను కూడా పరిశీలిస్తున్నాం. ప్రయోగాత్మకంగా జువ్వలదిన్నె వద్ద ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు బోట్ బిల్డింగ్ యార్డ్ ఏర్పాటుకు టెండర్లు పిలిచాం. హార్బర్ల వద్ద పర్యాటక ఏర్పాట్లను కూడా పరిశీలిస్తున్నాం.

– ప్రవీణ్ కుమార్, సీఈవో ఏపీ మారిటైమ్‌బోర్డు, వీసీఎండీ ఏపీఐసీసీ.

మినీ పోర్టు స్థాయిలో



ఇప్పటి వరకు బోట్లు నిలుపుకోవడానికే సరైన సదుపాయాల్లేక అవస్థలు ఎదుర్కొన్నాం. పాదయాత్ర సమయంలో మా పరిస్థితిని వైఎస్ జగన్ దృష్టికి తేవడంతో మినీ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఏకంగా రూ.361 కోట్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద హార్బరును మినీపోర్టు స్థాయిలో నిర్మిస్తున్నారు. బోట్లు నిలపడం నుంచి రిపేర్లు, డీజిల్, వేలంపాటలు, అమ్మకాలు అన్నీ ఒకేచోట ఉండేలా నిర్మిస్తుండటంతో వ్యయం తగ్గి లాభాలు పెరుగుతాయి. దీని ద్వారా తొండంగి, కొత్తపల్లి, కాకినాడ రూరల్ మండలాలకు చెందిన 50 వేల మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ స్థాయిలో హార్బర్ నిర్మాణ పనులు ఇంత వేగంగా జరుగుతాయని ఎవరూ ఊహించలేదు. మేమంతా సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– ఎస్. మణికంఠబాబు, సర్పంచ్, అమినాబాద్, ఉప్పాడ

జూ.ఎన్టీఆర్ X టీడీపీ



పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీని అడ్డుకుంటున్న టీడీపీ క్యాడర్



ఆచంటలో జనసేన జెండాను విసిరేస్తున్న టీడీపీ కార్యకర్తలు

ఫ్లెక్సీలతో హడావిడి.. అభిమానుల కొట్లాట

- ఆచంట, తిరువూరులో టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం
- రెండు చోట్లా కానరాని జనస్పందన
- రొటీన్ ప్రసంగంతో ఆకట్టుకోలేకపోయిన చంద్రబాబు
- ఆచంటలో కానరాని జనసేన, తిరువూరులో కేశినేని కేడర్ డుమ్మా

సాక్షి, భీమవరం/పెనుగొండ/తిరువూరు: పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట, ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'రా... కదలి రా..' పేరిట ఆదివారం నిర్వహించిన సభకు హాజరైన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులపై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. వారు తీసుకొచ్చిన ఫ్లెక్సీలు, జెండాలను లాక్కుని వారిపై వీరంగం సృష్టించి అక్కడినుంచి తరిమేశారు. ఆచంటలో వారిని అడ్డుకునేందుకు వచ్చిన జనసేన కార్యకర్తలపైనా టీడీపీ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. ఆచంటలో లక్ష మంది జనంతో ఈ సభ నిర్వహించాలని టీడీపీ నాయకత్వం విస్తృత ప్రచారం నిర్వహించినా కనీసం 12 వేల మంది కూడా హాజరుకాకపోవడంతో క్యాడర్‌లో నిరుత్సాహం నెలకొంది. ఈ తరుణంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ జై ఎన్టీఆర్ పేరుతో జూనియర్ ఎన్టీఆర్ బొమ్మతో రూపొందించిన ఫ్లెక్సీలు తీసుకుని సభాస్థలికి వచ్చారు. టీడీపీ క్యాడర్ వారిని అడ్డుకున్నారు. వారి చేతిలోని ఫ్లెక్సీని లాక్కుని వారితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు జై ఎన్టీఆర్, జై జూనియర్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో జనసేన అభిమానులు సైతం వారి పార్టీ జెండాలతో రావడంతో వారి చేతుల్లోని జెండాలను కూడా టీడీపీ క్యాడర్ లాక్కుని బయటకు విసిరేశారు. ఈ తరుణంలో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది.

ఆచంటలో కానరాని జనసేన టీడీపీ, జనసేన నాయకత్వం మధ్య అంతర్గత పోరు జరుగుతున్నట్టు ఆచంటలో జరిగిన చంద్రబాబు సభ ద్వారా బయటపడింది. ఈ సభకు సంబంధించి జనసేనకు సరైన సమాచారం ఇవ్వలేదన్న భావనతో ఆ పార్టీ నాయకులు బహిరంగ సభకు దూరంగా ఉన్నారని తెలియవచ్చింది. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చేగొండి సూర్యప్రకాష్ సైతం రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

వెలవెలబోయిన రెండు సభలు

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించిన రెండు సభలకు జనం నుంచి ఆదరణ కరువైంది. రెండు చోట్లా ఆశించిన రీతిలో జనం రాకపోవడంతో నాయకులు హతాశులయ్యారు. ఆచంటలో చంద్రబాబు జనంకోసం ఎదురు చూస్తూ హెలీప్యాడ్ వద్దే నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో ఆలస్యంగా సభ ప్రారంభం కావడంతో వచ్చిన జనం కాస్తా వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇక తిరువూరులో 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సభ జనం లేక వెలవెలబోయింది. సగానికి పైగా స్థలంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సభకు వచ్చిన జనం కూడా చంద్రబాబు ప్రసంగం ప్రారంభించకముందే వెనుదిరగడం గమనార్హం. ఎంపీ కేశినేని నాని రావడం లేదన్న సమాచారంతో ద్వితీయ వర్గం నాయకులు, కార్యకర్తలు డుమ్మా కొట్టారు.

విసుగెత్తించిన 'బాబు' ప్రసంగం

రెండు సభల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రసంగించిన తీరు హాజరైన ప్రజలను విసుగెత్తించింది. ఆరు హామీల అమలుపై 'బాబు' ప్రసంగంపై మహిళలు పెదవి విరిచారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలుచేసే సంక్షేమ పథకాలు తమకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయంటూ బాహాటంగానే విమర్శించడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను చంద్రబాబు విమర్శించిన తీరుని సైతం పలువురు తప్పుపట్టారు. ప్రసంగం ఆద్యంతం ఆత్మస్తుతి పరనిందగా సాగింది. ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది తానేనని చెప్పుకొచ్చారు.

అంబులెన్సుకూ దారివ్వని తమ్ముళ్లు

తిరువూరు సభకు వచ్చిన వాహనాలు విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దూరప్రాంతాల నుంచి వచ్చిపోయే భారీవాహనాలతో పాటు అత్యవసర చికిత్స నిమిత్తం రోగులను తరలించే అంబులెన్సుకు కూడా దారి ఇవ్వకుండా తెలుగుతమ్ముళ్లు అవరోధాలు కల్పించారు. తిరువూరు సీఐ అబ్దుల్ నబీ తన సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ చేసి అంబులెన్సును పంపారు.

అధికారమిస్తే ఆరుపథకాలు

- తిరువూరు, ఆచంట సభల్లో చంద్రబాబు నాయుడు

తిరువూరు/సాక్షి, భీమవరం/పెనుగొండ: రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని గెలిపించి అధికారం కట్టబెడితే ఆరు పథకాలను అమలు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో ఆదివారం నిర్వహించిన రా కదలిరా పేరిట టీడీపీ నిర్వహించిన సభల్లో ఆయన ప్రసంగించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఉచిత సరఫరా, రైతులకు ఏడాదికి రూ.50 వేల ఆర్థికసాయం ప్రధానంగా అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికీ అండగా నిలబడటమే టీడీపీ, జనసేన లక్ష్యమని చెప్పుకొచ్చారు. తెలుగు జాతిని తిరుగులేని శక్తిగా తయారు చేసే బాధ్యతను తీసుకుంటామని పేర్కొన్నారు. ఆక్వారంగాన్ని వైఎస్సార్‌సీపీ అతలాకుతలం చేసిందనీ, తాము అధికారంలోకి వస్తే ఆక్వా రంగానికి పూర్వ వైభవం తెస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వంలో సమర్థుడైన మంత్రి ఒకరూ లేరన్నారు. తాము అధికారంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగాలు తెస్తామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తన విజన్ కారణంగానే హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ రంగానికి ప్రధాన కేంద్రమైందని, లక్షలాదిమంది ఉద్యోగాలు పొందడానికి తానే కారణమని గొప్పగా చెప్పారు. తిరువూరు సభలో వేదికపై ఎంపీ కేశినేని నానికి ప్రోటోకాల్ ప్రకారం చంద్రబాబు పక్కనే సీటు కేటాయించారు. కానీ ఆయన డుమ్మాకొట్టారు. తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు సైతం సభ వైపునకు రాకపోవడం చర్చనీయాంశమైంది. తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ప్రకటిస్తారని ఆశించిన ప్రస్తుత ఇన్‌చార్జి శావల దేవదత్ ఆ ఊసే లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆచంట సభలో పాలకొల్లు, ఉండి ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, కేఎస్ జవహర్, పీతల సుజాత తదితరులు ప్రసంగించారు.



ఆచంటలో చంద్రబాబు ప్రసంగిస్తుండగా ఖాళీ అయిన కుర్చీలు



తిరువూరులో చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో వెనుదిరిగిన జనం

క్లుప్తంగా...

ఐఎల్ టీ20 టోర్నీలో ముంబై ఇండియన్స్ తరఫున ఆడతా..

- వృత్తిపరమైన క్రికెట్‌ను ఆడుతున్నప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండాలి
- 'ఎక్స్'లో భారత జట్టు మాజీ క్రికెటర్ అంబటి రాయుడు వెల్లడి

సాక్షి, అమరావతి : క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన భారత జట్టు మాజీ క్రికెటర్ అంబటి రాయుడు మళ్లీ బ్యాట్ పడతానని ప్రకటించారు. ఈ నెల 20 నుంచి దుబాయ్‌లో జరిగే ఇంటర్నేషనల్ లీగ్(ఐఎల్) టీ20 టోర్నీలో ముంబై ఇండియన్స్ తరఫున ఆడతానన్నారు. ప్రొఫెషనల్ క్రికెట్ ఆడుతున్నప్పుడు నిబంధనలు ప్రకారం రాజకీయాల్లో ఉండకూడదని 'ఎక్స్'లో ఆదివారం ట్వీట్ చేశారు. ఐఎల్ టీ20 టోర్నీలో ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అంబటి రాయుడు ఈ నెల 20 నుంచి టోర్నీలో పాల్గొనేందుకు వైఎస్సార్‌సీపీని వీడినట్లు స్పష్టమవుతోంది.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో 35 లక్షల మంది భాగస్వామ్యం

కేంద్రమంత్రి భారతీ ప్రవీణ్ పవార్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో... ఇప్పటి వరకు రాష్ట్రంలో 35 లక్షల మంది ప్రజలు భాగస్వాములయ్యారని కేంద్రమంత్రి భారతీ ప్రవీణ్ పవార్ తెలిపారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో, గ్రామగ్రామాన 125 ప్రచార వాహనాలతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కొనసాగుతున్నట్టు ఆమె పేర్కొన్నారు.

'తెలంగాణ బిడ్డ'ను ఆంధ్రాకెలా పంపిస్తారు

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



కడియం: 'నేను తెలంగాణ బిడ్డను.. ఇక్కడే పెరిగాను.. ఇక్కడే గొబ్బెమ్మలు ఆడాను' అంటూ ప్రకటించుకున్న షర్మిలను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆంధ్రాకు ఎలా పంపిస్తుందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ప్రశ్నించారు. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధిష్టానం దృష్టిలో ఆంధ్రా వాళ్లు దద్దమ్మలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి వారికి ఆత్మగౌరవం ఉండదా? అని ప్రశ్నించారు. విభజన పేరుతో ఒకసారి ఆంధ్రుల ఆత్మగౌరవం దెబ్బ తీశారని, ఇప్పుడు ఆంధ్రాతో సంబంధం లేదని ప్రకటించుకున్న వ్యక్తిని ఇక్కడికి పంపించి, బాధ్యతలు అప్పగిస్తామనడం ఎంత వరకు సబబని హర్షకుమార్ నిలదీశారు. ఇటువంటి తీరుతో కాంగ్రెస్‌కు మద్దతు ఇద్దామనుకుంటున్న దళితులు పునరాలోచించుకుంటారని హర్షకుమార్ స్పష్టం చేశారు.

పేదలను ఎదగనీయకపోవడమే చంద్రబాబు అజెండా

బహుజన పరిరక్షణ సమితి నాయకులు



నిరసన తెలియజేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: అధికారంలో ఉండి పేదలను ఎదగనీయకుండా అడ్డుకోవడమే అజెండాగా చంద్రబాబు ఆలోచన చేస్తున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం, తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1,197వ రోజుకు చేరాయి. దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి, ప్రసంగించారు. 14 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను విస్మరించిన బాబు ఇప్పుడు ఉద్ధరిస్తానంటూ ప్రజల్లోకి రావడం సిగ్గుచేటన్నారు. గతంలో మూడు రాజధానుల అజెండాతో ఎన్నికలకు వెళ్లిన తరువాతే పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు అన్ని వర్గాలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ విధానాలకే ఓట్లు వేసి గెలిపించారని, కుప్పంలో సైతం బాబును కుప్పతొట్టిలో పడేశారని గుర్తు చేశారు. రాజధాని 29 గ్రామాలతోపాటు, తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో సైతం బాబును స్థానిక సంస్థల్లో చిత్తుచిత్తుగా ఓడించారని, కానీ కులవాదులంతా ఏకమై ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీ విష బీజాలు నాటేందుకు అడ్డదారిలో రావడం సిగ్గుచేటని అన్నారు. కులోన్మాదులతో కలిసి ఏపీలో పాగా వేసేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర ప్రజలు బొంద పెట్టడం ఖాయమన్నారు. ఎంతమంది కలిసొచ్చినా బాబు అండ్ కోకు ఓటమి తప్పదన్నారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు పెరికే వరప్రసాద్, కారుమూరి పుష్పరాజు, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.



సుందర విశాఖ... ప్రగతి వీచిక...

ఇదీ మార్పు

నాలుగేళ్లుగా అభివృద్ధిలో పురోగమిస్తున్న నగరం

కేజీ రాఘవేంద్రారెడ్డి, సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

మహానగరంగా రూపుదిద్దుకున్న విశాఖపట్నం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఓ వైపు కడలికెరటాల సవ్వడులు... మరోవైపు పచ్చదనం పరచుకున్న ప్రకృతి అందాలు... పెట్టని ఆభరణాలుగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఇటు విస్తరిస్తున్న ఐటీ రంగం... అటు విద్యాసుగంధాలు వెదజల్లుతున్న సరస్వతీ నిలయాలు నగరానికి ప్రత్యేక గుర్తింపునిస్తున్నాయి. నగరవాసుల ట్రాఫిక్ కష్టాలు తీర్చే ఫ్లై ఓవర్లు... మల్టీ లెవెల్ కారు పార్కింగ్ సౌకర్యాలు విశేష గౌరవాన్ని ఆపాదిస్తున్నాయి. ఆహ్లాదాన్ని పంచుతున్న పార్కులు... ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దిన జంక్షన్లు నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం... ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఓడరేవు... నగర సమీపంలో విస్తరిస్తున్న పారిశ్రామిక వాడలు విశాఖకు విశేష గుర్తింపునివ్వగా... గతేడాది మార్చిలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జీ20 సన్నాహక సదస్సులతో నగరానికి అంతర్జాతీయ ఖ్యాతిని సంతరించుకుంది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ప్రగతి పథంలో నడుస్తూ కార్యనిర్వాహక రాజధానికి కావలసిన అర్హతలన్నీ పుణికిపుచ్చుకుంది.

విస్తరిస్తున్న ఐటీ రంగం



- రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖను బీచ్ ఐటీ కారిడార్‌గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా ఐటీ కంపెనీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. వాటికోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీనిచ్చింది. ఫలితంగా ప్రధాన ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ తన డెవలప్‌మెంట్ సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేసింది. దానికి అవసరమైన స్థలాన్ని కేటాయించడంతో పాటు కంపెనీకి వెళ్లేందుకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేశారు.
- ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్ర, హెచ్‌సీఎల్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్ఎస్, అమెజాన్ తదితర ఐటీ, వాటి అనుబంధ దిగ్గజ సంస్థలన్నీ విశాఖవైపు అడుగులు వేశాయి. రుషికొండ ఐటీ సెజ్ లో హిల్ నెంబర్–2లో ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. తొలి విడతలో 1000 మందితో ఇన్ఫోసిస్ ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.
- దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 2006లో విప్రో క్యాంపస్‌కు 750 మందితో ప్రారంభించేందుకు వీలుగా స్థలాన్ని కేటాయించారు. అటు తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో 300 మందితో ప్రస్థానం మొదలు పెట్టింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో దశలవారీగా 1000 సీట్లకు విస్తరించేందుకు సిద్ధమవుతోంది.
- వర్చువల్ డెస్క్‌టాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(వీడీఐ), క్లౌడ్ ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖ క్యాంపస్‌ని మార్చాలని నిర్ణయించింది. విశాఖలో స్టార్టప్‌ల ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కామ్) సీఈవో సంజీవ్ మల్హోత్రా ప్రకటించారు.
- ఐటీ రంగంలో విశాఖను అభివృద్ధి చేసేందుకు ఇక్కడే ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఐటీ పరిశోధనలు, అభివృద్ధిలో భాగంగా.. ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఎకోసిస్టమ్‌ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు కేంబ్రిడ్జిలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) సహకారంతో పాటు సంయుక్త సర్టిఫికేషన్ కోర్సుల్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది.

అంతర్జాతీయ సదస్సులకు వేదికగా...

ఈ ఏడాది మొదట్లో నిర్వహించిన అంతర్జాతీయ ఐటీ సదస్సు, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జీ20 సన్నాహక సదస్సులు సూపర్ సక్సెస్ అయ్యాయి.

నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్స్ ఇన్ ఇండియా(ఎన్ఎఫ్ఐసీఐ) 28వ బోర్డు ఆఫ్ గవర్నెన్స్ సమావేశంతో పాటు 12వ సర్వ సభ్య సమావేశాలు, జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సు, అగ్రిసదస్సు, ఇలా ప్రతి ఒక్కరికీ విశాఖ ఆహ్వానం పలుకుతోంది.

డేటా సెంటర్లు.. స్టార్‌హోటల్స్‌కు కేరాఫ్



ఐటీ డెస్టినీగా మారుతున్న విశాఖపట్నంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ఆస్కారం కలిగించేలా సీఎం వైఎస్ జగన్ తీర్చిదిద్దారు. అందుకే.. ఆదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు తానే స్వయంగా శంకుస్థాపన చేశారు.

- వైజాగ్ టెక్‌పార్క్ కూడా 39,815 మందికి ఉపాధి కల్పించేలా డేటాసెంటర్‌తో పాటు బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీని రూ.21,844 కోట్లతో ఏర్పాటుకు ముందుకొచ్చింది.
- గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఎన్టీపీసీ, ఇంధన రంగంలో హెచ్‌పీసీఎల్, పర్యాటక రంగంలో ఒబెరాయ్, తాజ్, ఇనార్బిట్‌మాల్, టర్బో ఏవియేషన్.. ఇలా.. విభిన్న రంగాల్లో బహుళ ప్రాజెక్టుల్ని విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు

రాబోతున్న స్టార్ హోటల్స్...

సంస్థ	ప్రాంతం	నిర్మాణం	పెట్టుబడులు	ఉపాధి	విస్తీర్ణం
ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్	అన్నవరం	విల్లాలు, రిసార్టులు	రూ.350 కోట్లు	5,500	40 ఎకరాలు
మేఫెయిర్ హోటల్స్	అన్నవరం	కన్వెన్షన్ సెంటర్, హోటల్	రూ.525 కోట్లు	1000	40 ఎకరాలు

సరికొత్తగా నగర రహదారులు

గుంతలమయంగా ఉన్న రహదారులు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సరికొత్తగా రూపు దిద్దుకున్నాయి.

- నాలుగేళ్లలో మంజూరైన రహదార్లు: 2089
- వెచ్చించనున్న నగదు: రూ.547.45 కోట్లు
- ఇప్పటివరకూ పూర్తయిన రోడ్లు: 1,216
- వీటికి అయిన ఖర్చు: రూ. 202.59 కోట్లు
- పురోగతిలో ఉన్న రహదారులు: 873
- వీటికి చేస్తున్న ఖర్చు: రూ.344.86 కోట్లు
- కొత్తగా వేస్తున్న రహదారుల పొడవు: 27 కి.మీ.
- వీటికి వెచ్చిస్తున్న మొత్తం: రూ.104 కోట్లు




ట్రాఫిక్ కష్టాలకు ఫ్లైఓవర్‌తో చెక్



అత్యంత రద్దీ కూడలిగా ఉన్న ఎన్ఏడీలో ఫ్లైఓవర్ నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ 2016 నుంచి ప్రయత్నిస్తున్నా అప్పటి టీడీపీ ప్రభుత్వం సరైన సహకారం అందించలేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తూతూ మంత్రంగా 2018 చివర్లో పనులు ప్రారంభించారు. కానీ.. ఎన్నికల ముందు నాటికే బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ పనులు భుజానికెత్తుకొని రూ.150 కోట్ల వ్యయంతో పూర్తి చేశారు. ఎన్ఏడీ జంక్షన్.. నగర కూడళ్లలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం. దీనివల్ల పూర్తిగా ట్రాఫిక్ కష్టాలకు తెరపడింది.

పర్యాటకం...మరింత ఆకర్షణీయం..



- గతంలో విశాఖ పేరు వింటేనే ఆర్‌కే బీచ్, రిషికొండ, భీమిలి బీచ్ ప్రాంతాలు గుర్తుకువచ్చేవి. ఇప్పుడు పర్యాటకులను మరింత ఆకర్షించేందుకు వీలుగా ప్రభుత్వం 11 కొత్త బీచ్‌లను అభివృద్ధి చేసింది.
- రూ.12.55 కోట్లతో మొత్తం 6 బీచ్ క్లీనింగ్ యంత్రాలతో ఎప్పటికప్పుడు బీచ్‌లలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఏరివేస్తూ శుభ్రం చేస్తున్నారు.
- ఈ 11 బీచ్‌లను అనుసంధానిస్తూ.. కోస్టల్ బీచ్ మాస్టర్ ప్లాన్‌లో జిల్లాలోని 25 బీచ్‌లు అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. భీమిలిలోని పాండవుల పంచ బీచ్, అన్నవరం, భీమిలి, నేరెళ్లవలస, ఎర్రమట్టిదిబ్బలు, ఐఎన్ఎస్ కళింగ, మంగమారిపేట, తొట్లకొండ, తిమ్మాపురం, ఎస్ఈజెడ్, రుషికొండ, ఇస్కాన్ టెంపుల్, సాగర్‌నగర్, జూపార్క్, జోడుగుళ్లపాలెం, తెన్నేటిపార్క్, ఆర్‌కేబీచ్, రాధాకృష్ణ బీచ్, రాక్‌బీచ్, దుర్గా బీచ్, యారాడ, ప్యారడైజ్, అప్పికొండ, అప్పికొండ–2, అప్పికొండ బ్రిడ్జ్ బీచ్‌లు కొత్తగా పర్యాటకుల్ని స్వాగతం పలకనున్నాయి.

ఆరోగ్యప్రదాయినిగా కేజీహెచ్

- గత ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌ను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్లతో ఆధునికీకరించింది.
- ఐదు దశాబ్దాల క్రితం ఏర్పడిన క్యాజువాలిటీయే ఇప్పటికీ కొనసాగుతుండగా రెండో క్యాజువాలిటీ నిర్మాణానికి కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున రూ.30 లక్షలు కేటాయించి చేసి 15 పడకలతో నిర్మించారు.
- సెకెండ్ క్యాజువాలిటీని రౌండ్‌ది క్లాక్ పనిచేసేలా తీర్చిదిద్దారు. రోగుల కోసం రూ.15 లక్షలతో లేబొరేటరీతో పాటు మొబైల్ ఎక్స్‌రే యూనిట్, అల్ట్రా స్కానింగ్ సిద్ధం చేశారు. ఆధునిక సౌకర్యాలు,సెంట్రల్ ఎయిర్ కండిషన్, పడకలు, ఆక్సిజన్, ఇతర సదుపాయాలు కల్పించారు.
- కార్డియాలజీ విభాగాన్ని రూ.24 లక్షల సీఎస్సార్ నిధులతో పునర్నిర్మించారు. ఐసీయూ, ఈకో, స్టేర్ కేస్, ఏసీ సదుపాయం, పెయింటింగ్స్, మరుగుదొడ్లు కొత్తగా తీర్చిదిద్దారు.
- విద్యుత్ ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో కేజీహెచ్‌లో 120 కేవీ సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.
- ఓపెన్ హార్ట్ సర్జరీకి అవసరమైన పరికరం దశాబ్దం నుంచి పనిచేయకపోవడంతో శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. ప్రభుత్వం చొరవ తీసుకొని టెంపరేచర్ కంట్రోల్ మెషీన్‌ని మంజూరు చేసింది.
- అకస్మాత్తుగా వచ్చే గుండె నొప్పి బారిన పడేవారికోసం రాష్ట్ర ప్రభుత్వం స్టెమి పథకాన్ని రూపొందించింది. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉన్న మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న బోధనాస్పత్రుల్లో దీనిని అమలు చేస్తున్నారు. కార్డియాలజీ వైద్యుల సూచన మేరకు సుమారు రూ.30 వేల విలువైన ఇంజక్షన్ కేజీహెచ్‌లో ఉచితంగా రోగులకు అందిస్తున్నారు.

రెండింతల అభివృద్ధి...!

- 2014-19 వరకూ టీడీపీ చేసిన ఖర్చు: రూ.1450 కోట్లు
- టీడీపీ ఐదేళ్ల హయాంలో చేపట్టిన పనులు: 4450
- 2019-2023 వరకూ వైఎస్సార్‌సీపీ చేసిన ఖర్చు: రూ.2490 కోట్లు
- వైఎస్సార్‌సీపీ హయాంలో నాలుగేళ్ల కాలంలో చేపట్టిన పనులు: 9920
- గడపగడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన పనులు: 708
- దీనికోసం వెచ్చిస్తున్న నగదు: రూ. 66 కోట్లు

నీటి సరఫరా పనులు

మంజూరు చేసినవి:	362
కేటాయించిన నిధులు:	రూ.56.91 కోట్లు
పూర్తయిన పనులు:	284
ఖర్చు చేసిన నిధులు:	రూ.36.30 కోట్లు
కొనసాగుతున్న పనులు:	78
ఖర్చు చేస్తున్న నిధులు:	రూ.20.56 కోట్లు

వీధి దీపాలు పనులు

మంజూరు చేసినవి:	94
కేటాయించిన నిధులు:	రూ.20.58 కోట్లు
పూర్తయిన పనులు:	84
ఖర్చు చేసిన నిధులు:	రూ.18.22 కోట్లు
కొనసాగుతున్న పనులు:	10
ఖర్చు చేస్తున్న నిధులు:	రూ.2.36 కోట్లు

బ్యూటిఫికేషన్, స్ట్రీట్ స్కేపింగ్ పనులు

మంజూరు చేసినవి:	174
కేటాయించిన నిధులు:	రూ.47.6 కోట్లు
పూర్తయిన పనులు:	121
ఖర్చు చేసిన నిధులు:	రూ. 22.69 కోట్లు
కొనసాగుతున్న పనులు:	53
ఖర్చు చేస్తున్న నిధులు:	రూ.23.07 కోట్లు

మురుగు నీటి పనుల నిర్వహణ

మంజూరు చేసినవి:	17
కేటాయించిన నిధులు:	రూ.91.54 కోట్లు
పూర్తయిన పనులు:	6
ఖర్చు చేసిన నిధులు:	రూ.31.52 కోట్లు
కొనసాగుతున్న పనులు:	11
ఖర్చు చేస్తున్న నిధులు:	రూ.60.02 కోట్లు

ప్రభుత్వ భవనాలు, ఇతర పనుల నిర్మాణం..

మంజూరు చేసినవి:	1712
కేటాయించిన నిధులు:	రూ.284.06 కోట్లు
పూర్తయిన పనులు:	1129
ఖర్చు చేసిన నిధులు:	రూ.133.25 కోట్లు
కొనసాగుతున్న పనులు:	583
ఖర్చు చేస్తున్న నిధులు:	రూ.150.81 కోట్లు

గ్రేటర్ పరిధిలో ఆయా విభాగాల్లో చేపట్టిన పనుల వివరాలివీ...

మురుగు కాల్వలు/యూజీడీ..

మంజూరు చేసినవి:	1326
కేటాయించిన నిధులు:	రూ.225.12 కోట్లు
పూర్తయిన పనులు:	777
ఖర్చు చేసిన నిధులు:	రూ.105.21 కోట్లు
కొనసాగుతున్న పనులు:	549
ఖర్చు చేస్తున్న నిధులు:	రూ.119.91 కోట్లు

జంక్షన్లు... జిగేల్ !



రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద రైల్వే కోచ్‌తో కూడిన జంక్షన్ నగరవాసులతో పాటు పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఇక బస్టాండ్లను కూడా అత్యాధునికంగా తీర్చిదిద్దారు.

మహావిశాఖ పరిధిలోని జంక్షన్లు కొత్త రూపును సంతరించుకున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారులు కలిసే జంక్షన్లను విశాలంగా తీర్చిదిద్దారు. అంతేకాకుండా కూడళ్ల వద్ద అందరినీ ఆకట్టుకునేలా అభివృద్ధి చేశారు.


ఉభయ గోదావరిలో
చంద్ర-సేన సిగపట్లు!

'దేశం'-జనసేన పొత్తుల పితలాటకం.. వర్గ విభేదాలతో ఎడమొహం, పెడమొహం

త్యాగాలకు సిద్ధం కావాలంటున్న పవన్ • ఇన్నేళ్ల శ్రమ ఎలా త్యాగం చేస్తామంటున్న నేతలు

'పొత్తులతో పోటీ చేస్తే ఉభయ గోదావరులు మనవే' అని గాలిలో ఈతలు కొడుతున్న టీడీపీ, జనసేన పార్టీలకు క్షేత్రస్థాయిలో సిగపట్లు మింగుడుపడడం లేదు. ఇరుపార్టీల అధిష్టానాల నుంచి ఎలాంటి సంకేతాలూ రాకముందే పరిస్థితి ఇలా ఉంటే.. సీట్ల ప్రకటన వెలువడే సమయానికి ముదురు పాకాన పడడం ఖాయంగా కనిపిస్తోంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో చాలా నియోజకవర్గాల్లో ఆయా పార్టీల నేతల వ్యవహారాలతో కేడర్ అయోమయంలో పడుతోంది.టీడీపీతో జట్టు కట్టడంపై జనసేన నేతలు, ఆ పార్టీ శ్రేణులు ఇప్పటికే పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై నిప్పులు చెరుగుతున్నారు. తన సామాజికవర్గాన్ని గంపగుత్తగా చంద్రబాబు వద్ద మోకరిల్లేలా చేసి, త్యాగాలకు సిద్ధం కావాలని దిశానిర్దేశం చేయడంపై జనసేన నేతలు, ఆశావహులు కారాలు మిరియాలు నూరుతున్నారు. ఇరుపార్టీల్లో కనిపిస్తున్నది మేకపోతు గాంభీర్యమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

-సాక్షి ప్రతినిధి, కాకినాడ/ఏలూరు



ఉమ్మడి తూర్పుగోదావరి

➤ కాకినాడ జిల్లా **జగ్గంపేట** టీడీపీలో సీనియర్‌గా చెప్పుకునే మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్రరావుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఇటీవల టీడీపీ-జనసేన సమన్వయ సమావేశంలో ఇద్దరూ ఒకరిని ఒకరు ఓడిస్తామంటూ సవాళ్లు - ప్రతిసవాళ్లు చేసుకున్నారు.

➤ **పిఠాపురం** నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని జనసేన నిర్ణయించింది. కాపు సామాజిక వర్గం బలంగా ఉన్న ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం స్థానికేతరుడైన టీ టైమ్ అధినేత తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ టికెట్ రేసులో ఉన్నారు. స్థానికేతరుడైన అతడికి టికెట్ ఇస్తే ఓడిస్తామని స్థానిక జనసేన నేతలు హెచ్చరిస్తున్నారు. మరోవైపు పొత్తులో టీడీపీ ఈ సీటు కోల్పోవాల్సి వస్తే ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే వర్మ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగే ఏర్పాట్లలో ఉన్నారు.

➤ **కాకినాడ రూరల్** సీటు జనసేనకేనని ఆ పార్టీ నాయకులు బల్లగుద్ది మరీ చెబుతున్నారు. ఆ పార్టీ అభ్యర్థిగా నిన్నమొన్నటి వరకూ పంతం నానాజీకి లైన్ క్లియర్ అయ్యిందని ప్రచారం జరగగా, మారిన రాజకీయ పరిణామాల్లో నానాజీకి కాకుండా ఆర్థికంగా స్థితిమంతుడైన నాయకుడికి కట్టబెట్టే ఆలోచనలో ఉన్నారనే సమాచారంతో ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జనసేనకు కేటాయిస్తే స్వతంత్రంగా పోటీ చేస్తామని టీడీపీ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీలో మరో వర్గం నుంచి జెడ్పీటీసీ పేరాబత్తుల రాజశేఖర్ కూడా బరిలో ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

➤ **కాకినాడ సిటీ** కోసం జనసేన ఇన్‌చార్జి ముత్తా శశిధర్, టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు టికెట్ ఆశిస్తున్నారు. కొండబాబుకు ఇస్తే పార్టీ నష్టపోతుందని మిగిలిన నాయకులు మోకాలడ్డుతున్నారు. జనసేన నుంచి కాకినాడ లోక్‌సభ స్థానానికి పోటీ చేయాలనుకుంటున్న పారిశ్రామికవేత్త సానా సతీష్ కూడా కొండబాబు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ పరిణామాలతో టీడీపీ రెండు గ్రూపులుగా విడిపోయింది.

➤ తూర్పు గోదావరి జిల్లాలో **రాజమహేంద్రవరం రూరల్** సీటు తమదంటే తమదేనని జనసేన నుంచి కందుల దుర్గేష్ ఒకపక్క, టీడీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మరోపక్క ప్రచారం చేసుకుంటున్నారు. రెండు పార్టీల శ్రేణుల మధ్య విభేదాలు రచ్చకెక్కుతూ పొత్తు చిత్తవ్వడం ఖాయమంటున్నారు.

➤ **రాజానగరం** సెగ్మెంట్ కోసం టీడీపీ మాజీ ఎమ్మెల్సీ దివంగత బొడ్డు భాస్కర రామారావు కుమారుడు వెంకట రమణ చౌదరి ప్రచారంలో ఉన్నారు. అయితే ఈ సీటు జనసేనకేనని, అభ్యర్థిని తానేనని అంటూ బత్తుల బలరామకృష్ణ చేస్తున్న ప్రచారం రెండు వర్గాల మధ్య చిచ్చు రేపుతోంది.

➤ ఎస్సీలకు రిజర్వ్ చేసిన జనసేనకు బలమైన కేడర్ ఉన్న **అమలాపురం** సీటు తమకే ఇవ్వాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు పట్టుబడుతున్నారు. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఇప్పటికే పోటీ పడుతూండగా, ఆయనను కాకుండా మాజీ ఎంపీ బుచ్చిమహేశ్వరరావు కుమార్తె పాము సత్యశ్రీని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెర మీదకు తీసుకువచ్చారు. దీంతో ఇరు వర్గాలూ నువ్వా నేనా అనే స్థాయిలో తలపడుతున్నాయి. ఈ రెండు పార్టీల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి.

➤ గత ఎన్నికల్లో జనసేన గెలుపొందిన ఏకైక నియోజకవర్గం **రాజోలు** నుంచి బొంతు రాజేశ్వరరావు సీటు కోసం పోటీ పడుతున్నారు. ఈ స్థానాన్ని టీడీపీకే కేటాయించాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పట్టుబడుతున్నారు.

➤ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా **ముమ్మిడివరం** టీడీపీకే ఖాయమైందని మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రచారం చేసుకుంటూండగా.. ఆవిర్భావం నుంచీ లక్షల రూపాయలు తగలేసుకున్న తమను విస్మరించి, టీడీపీకి కేటాయిస్తే తమ సత్తా చాటుతామని జనసేన ఇన్‌చార్జి, బీసీ నాయకుడు పితాని బాలకృష్ణ వర్గం బాహాటంగానే చెబుతోంది.

➤ **కొత్తపేట** నియోజకవర్గంలో జనసేన-టీడీపీల మధ్య సీటు కోసం సిగపట్లు నడుస్తున్నాయి. టీడీపీ, జనసేన తరఫున అన్నదమ్ములైన బండారు సత్యానందరావు (టీడీపీ), బండారు శ్రీనివాస్ (జనసేన) పోటీ పడుతున్నారు. దీంతో తెలుగు తమ్ముళ్ల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారింది. బండారు సత్యానందరావుకు పోటీగా మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యానికి కేటాయించాలని బీసీ సామాజికవర్గం డిమాండ్ చేస్తోంది.

ఉమ్మడి పశ్చిమ గోదావరి

➤ **కొవ్వూరు** కోసం టీడీపీ మాజీ మంత్రి జవహర్, జనసేన నుంచి మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు వర్గాలు కత్తులు దూసుకుంటున్నాయి.

➤ **ఏలూరు**లో జనసేన నుంచి రెడ్డి అప్పలనాయుడు 2019 నుంచి పని చేస్తూండగా, ప్రస్తుతం 2024 ఎన్నికల్లో టికెట్ కోసం ఇద్దరు ముగ్గురు నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు అప్పలనాయుడుకి టికెట్ ఇస్తారా లేదా అనేది ప్రశ్నార్థకమే. కాపు సామాజిక వర్గానికి చెందిన, వ్యాపారవేత్త నారా శేషు, మామిళ్ళపల్లి జయప్రకాష్ కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో ఎవరికి టికెట్ ఇచ్చినా మరొకరు సహకరించే పరిస్థితి లేదు. టీడీపీ అభ్యర్థిగా బడేటి రాధాకృష్ణ (చంటి), ఇడా చైర్‌పర్సన్‌గా పని చేసిన మధ్యాహ్నాపు ఈశ్వరి భర్త బలరాం టికెట్‌కు ప్రయత్నాలు సాగిస్తూ నువ్వా నేనా అన్నట్టు తలపడుతున్నారు.

➤ **కైకలూరు** నియోజకవర్గంలో టీడీపీ, జనసేనల పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంది. జనసేన నుంచి బీవీ రావు ఒకపక్క, కొల్లి వరప్రసాద్ మరోపక్క పోటీ పడుతున్నారు. కొల్లి మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌కు మద్దతు ఇస్తుంటే.. బీవీ రావు టీడీపీ నాయకులకు మద్దతుగా ఉన్నారు. జనసేన నాయకులను టీడీపీ నేతలు అసలు పట్టించుకోవడం లేదనే ఆవేదనతో ఇరు వర్గాలూ కత్తులు దూస్తున్నాయి.

➤ **ఉంగుటూరు** నియోజకవర్గంలో జనసేన నుంచి పత్సమట్ల ధర్మరాజుకు టికెట్ ఇస్తారనే ప్రచారం జరుగుతుండగా, టీడీపీ నుంచి గన్ని వీరాంజనేయులు టికెట్ ఖాయమైందని ఆయన వర్గీయులు ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో రెండు పార్టీల మధ్య వైషమ్యాలు నేతలకు తలపోటుగా మారాయి.

➤ **పోలవరం** సీటు కోసం జనసేన నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన చిర్రి బాలరాజు మరోసారి టికెట్ ఆశిస్తుండగా, టీడీపీలో మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్, ప్రగడపల్లి కార్యదర్శి కొవ్వాసి జగదీశ్వరి టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ కూడా సీట్ల సిగపట్లతో పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది.

➤ **దెందులూరు** టికెట్ రేసులో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో టీడీపీ రాష్ట్ర సాధికారత చైర్మన్ అశోక్‌గౌడ్, ఈడ్పుగంటి శ్రీనివాస్ తలపడుతున్నారు. చింతమనేనికి వ్యతిరేకంగా ముఖ్య నేతలు చంద్రబాబును కలిసి టికెట్ ఇవ్వవద్దని ఫిర్యాదులు చేశారు. ఆ సామాజికవర్గం నుంచి ఈడ్పుగంటి శ్రీనుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేయడంతో టీడీపీలో ఇరువర్గాల వైషమ్యాలూ ఆ పార్టీని రోడ్డున పడేశాయి.

➤ **పాలకొల్లు** సీటు టీడీపీకి కేటాయించనున్నారని ప్రచారం చేసుకుంటున్న సిటింగ్ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆ టికెట్ తనదేనని అంటున్నారు. ఈ స్థానం టీడీపీని కాదని జనసేనకు కేటాయిస్తే నిమ్మల ఇండిపెండెంట్‌గా వెళ్లడం తప్పదని చెబుతున్నారు.

➤ **నూజివీడు**లో జనసేన నుంచి బర్మా ఫణిబాబు, టీడీపీ నుంచి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పోటీ పడుతున్నారు.

➤ **తణుకు**లో టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, జనసేన నుంచి విడివాడ రామచంద్రరావు టికెట్ ఆశిస్తున్నారు. రామచంద్రరావుకు ఈసారి న్యాయం చేస్తానని, ఇతనే అభ్యర్థని పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చినట్టు చెబుతున్నారు. ఆమేరకు ఆయన ప్రచారం కూడా చేసుకుంటున్నారు. మరోవైపు ఎట్టిపరిస్థితుల్లో టికెట్ వదలబోమని టీడీపీ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ హడావుడి చేస్తోంది.

➤ **నర్సాపురం** టీడీపీలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, ప్రస్తుత ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, ఎన్నారై కొవ్వలి యతిరాజు రామ్మోహన్ నాయుడు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పోటీ పడుతున్నారు. జనసేన నుంచి బొమ్మిడి నాయకర్‌కు టికెట్ ఖాయం అయ్యిందనే ప్రచారంతో టీడీపీ ఆశావహులు రోడ్డెక్కేందుకు సిద్ధంగా ఉన్నారు.

➤ **తాడేపల్లిగూడెం**లో టీడీపీ నుంచి వలవల మల్లికార్జునరావు (బాబ్జీ) రేసులో ఉంటే మరోపక్క ఈలి నాని కూడా టికెట్ తనదే అని ప్రచారం గట్టిగా చేసుకుంటుండటంతో విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఇక్కడ బలంగా ఉన్న జనసేనకే సీటు కేటాయించాలని ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తమ సత్తా చూపిస్తామంటున్న పరిస్థితులు రెండు పార్టీలకూ మింగుడుపడటం లేదు.

➤ **భీమవరం** టీడీపీలో గ్రూపు రాజకీయాలు భగ్గుమంటున్నాయి. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మిపై కేడర్‌లో తీవ్ర అసంతృప్తి ఉంది. పార్టీ పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమాలు కూడా మొక్కుబడిగా చేస్తున్న తోటను కాకుండా మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావును ప్రతిపాదిస్తున్న పరిస్థితులు.. పార్టీలోని అంతర్గత విభేదాలను రోడ్డున పడేసే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ జనసేన నుంచి పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పోటీ చేసే అవకాశం ఉండటంతో ఆశావహులు దిక్కుతోచని స్థితిలో ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారు. పవన్ కాకుంటే ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) కూడా రేసులో ఉన్నారు. జనసేన నుంచి ఎవరు బరిలోకి దిగినా మద్దతు ఇచ్చేది లేదని టీడీపీ నేతలు చెబుతున్నారు.

➤ **ఉండి** సీటు కోసం జనసేన ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు గట్టిగా పట్టుబడుతుండగా.. టీడీపీకే ఇవ్వాలని ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు డిమాండ్ చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు వర్గం ఎమ్మెల్యే రామరాజుతో విభేదిస్తోంది. ఇక్కడ జనసేన, టీడీపీ పైకి ఐక్యతగా కనిపిస్తున్నా.. అంతర్గత విభేదాలతో కొట్టుమిట్టాడుతున్నాయి.

సీఎం జగన్ ఉద్యోగుల పక్షపాతి

- మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయి
- సంక్రాంతి లోపు ఉద్యోగులకు శుభవార్త వస్తుంది.. వారంలో సరెండర్ లీవ్ డబ్బుల చెల్లింపు
- మంత్రులు బొత్స, ఆదిమూలపు



వేదికపై మంత్రులు ఆదిమూలపు, బొత్స, మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ నేతలు

టీచర్‌రోడ్డు(విశాఖ తూర్పు)/విజయనగరం: సీఎం వైఎస్ జగన్.. ఉద్యోగుల పక్షపాతి అని, సమస్య చెప్పుకుంటే వెంటనే పరిష్కరిస్తున్నారని రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ మొదటి మహాసభలు విశాఖలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు తమ సమస్యలను ఇప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని, కానీ ఇప్పటికే ఆ సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయన్నారు. వాటిని త్వరలోనే పరిష్కరించి సంక్రాంతి కానుకను మున్సిపల్ ఉద్యోగులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ తరఫున ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు 11 సమస్యలను మంత్రుల దృష్టికి తెచ్చారు. వాటిపై మంత్రులు స్పందిస్తూ సర్వీస్ రూల్స్ అమలు విషయం గతంలో ఎన్నడూ తమ దృష్టికి రాలేదని, నిజంగా అమలు కావాలనుకుంటే అన్ని కార్పొరేషన్ల ఉద్యోగులు మాట్లాడుకుని వస్తే వెంటనే అమలు చేస్తామన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు త్వరలోనే సరిపడా కేడర్లను కేటాయిస్తామని తెలిపారు. పదోన్నతులతో పాటు గతంలో విభజించిన కేటగిరీలనూ మరోసారి సమీక్షిస్తామన్నారు. బిల్లు కలెక్టర్లు, వార్డు కార్యదర్శుల పదోన్నతుల సమస్య తమ దృష్టిలో ఉందని, త్వరలోనే వాటికి మంచి పరిష్కారం లభిస్తుందన్నారు. సరెండర్ లీవ్ డబ్బులను వారం రోజుల్లో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్ విషయంలో జరుగుతున్న జాప్యాన్ని తొలగించేందుకు త్వరలో సీఎంతో చర్చించి ప్రక్రియ ముగింపు తేదీలను ప్రకటిస్తామన్నారు. ఐఆర్‌సీ ప్రకటించాలని ఉద్యోగులు అడుగుతున్నారు కానీ తమ ప్రభుత్వం నేరుగా పీఆర్‌సీనే ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందని మంత్రులు వివరించారు.

అప్పుల పేరుతో దుష్ప్రచారం

సంక్షేమ పథకాల అమలు కోసం చేస్తున్న అప్పులు పెరిగిపోతున్నాయంటూ కొన్ని పార్టీలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం సరికాదని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు అప్పులు చేయకుండానే పాలన సాగించారా అంటూ ప్రశ్నించారు. కొద్ది రోజుల్లో జరిగే ఎన్నికలు పేదవాడి ఆకలికి, పెద్దవాళ్ల దోపిడీకి మధ్య జరిగేవని.. పాలనలో తేడాను గమనించి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. ఉద్యోగులకు తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదన్నారు. ఈ నెల 5 నుంచి గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ కిట్లు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ దశలో అంగన్‌వాడీలు విధులు నిర్వహించకుంటే అవి వారికి ఎలా అందుతాయన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు పాల్గొన్నారు.

42 సమస్యల్లో 37 పరిష్కరించిన ఏకైక ప్రభుత్వం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల 42 సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే.. వాటిలో 37 సమస్యలను పరిష్కరించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. మంత్రుల ఉప సంఘం ఉద్యోగుల సమస్య పరిష్కారంలో చాలా చురుగ్గా ఉందన్నారు. పలు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఈశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

లోకేశం మాకొద్దు..
పరువుపోతోంది

▶ మొదటి పేజీ తరువాయి

విపరీతంగా ట్రోల్ అవుతున్న విషయం తెలిసిందే. అవగాహనా రాహిత్యంతో ఏదో ఒకటి మాట్లాడేయడంవల్ల ఆయనవల్ల పార్టీ అనేకసార్లు ఇరకాటంలో పడింది. ప్రజలను ఆకర్షించలేకపోగా ఆయన చేష్టలు, డైలాగులవల్ల పార్టీకి నష్టమే తప్ప ఎలాంటి లాభంలేదనే భావన మొదటి నుంచి పార్టీ నేతల్లో బలంగా నాటుకుపోయింది. కానీ, తానే పార్టీని మొత్తం నడిపిస్తున్నట్లు లోకేశ్ బిల్డప్ ఇస్తూ పర్యటనలు చేసి తమకు ఎక్కడాలేని ఇబ్బందికర పరిస్థితులు సృష్టించారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే విషయాన్ని చంద్రబాబుకు పలువురు ముఖ్యులు అనేకసార్లు చెప్పినా ఆయన విని ఊరుకునే వారే తప్ప ఎలాంటి స్పందన ఉండేది కాదు. ఇప్పుడు ఎన్నికల సమీపించడంతో నేతలు ఈ విషయాన్ని గట్టిగా చెబుతుండడంతో పార్టీ శ్రేణుల ఒత్తిడికి చంద్రబాబు తలొగ్గక తప్పలేదు. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో లోకేశ్‌ను జిల్లా పర్యటనలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు నిర్ణయించారు. దీంతో కొద్దిరోజులుగా లోకేశ్ జిల్లాల పర్యటనలు చేయడంలేదు. పార్టీ ముఖ్య కార్యక్రమాలకు సైతం ఆయన్ను రానీయడంలేదు. యువగళం పాదయాత్ర తర్వాత లోకేశ్ జిల్లా పర్యటనలు, పార్టీ ముఖ్య కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటున్నారు.

పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్‌తో కనువిప్పు..

నిజానికి.. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ అయింది. దీనికోసం తెలుగుదేశం పార్టీ నాయకులు, శ్రేణులు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. సోషల్ మీడియా, ఎల్లో మీడియాలో ఆయనకు ఎంత ప్రచారం కల్పించినా బూడిదలో పోసిన పన్నీరైంది. ఆయన సభలకు జనాన్ని సమీకరించలేక నేతలు చేతులెత్తేశారు. డబ్బులిచ్చినా, ప్రలోభాలకు గురిచేసినా లోకేశ్ సభలంటే జనం వచ్చే పరిస్థితిలేదని పార్టీ నేతలు తరచూ వాపోయేవారు. ఈ సమయంలో.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అరెస్టవడంతో లోకేశ్ తన పాదయాత్రను అర్థాంతరంగా నిలిపివేశారు. తనను కూడా అరెస్టుచేస్తారనే భయంతో ఢిల్లీ వెళ్లి అక్కడే మకాం వేశారు. ఆ సమయంలో పాదయాత్ర కొనసాగించాలని పార్టీ నేతలు ఎంత ఒత్తిడి చేసినా అరెస్టు భయంతో ఆయన జనాల్లోకి రాలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన తల్లి భువనేశ్వరితో తూతూమంత్రంగా 'నిజం గెలవాలి' పేరుతో ఒక కార్యక్రమం మొదలు పెట్టినా దానికీ ఆదరణ లభించలేదు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చాక లోకేశ్ తన పాదయాత్ర రూటుమార్చేసి, నడవలేక చేతులెత్తేసి చివరికి మమ అనిపించారు. మొత్తం మీద యువగళం పాదయాత్ర వల్ల టీడీపీకి మైలేజ్ సంగతి ఎలా ఉన్నా అభాసుపాలైన ఘటనలే ఎక్కువ జరిగాయి.

లోకేశ్ మంగళగిరికే పరిమితం..

ఈ పరిస్థితుల్లో.. లోకేశ్‌ను తెర వెనుక నుంచే ఎన్నికలకు పని చేయించాలని ముఖ్య నేతలు సూచించినట్లు సమాచారం. ఆయన పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల నష్టమని వ్యూహకర్తలు కూడా తేల్చిచెప్పినట్లు తెలిసింది. దీంతో లోకేశ్‌ను ప్రస్తుతం మంగళగిరికి మాత్రమే పరిమితం చేశారు. ముఖ్యమైన పార్టీ కార్యక్రమాలకు సైతం ఆయన రావడంలేదు. చంద్రబాబు చేపట్టిన 'రా కదలిరా' కార్యక్రమాలకు ఆయన దూరంగానే ఉంటున్నారు. ఇటీవల నిర్వహించిన 'జయహో బీసీ' కార్యక్రమానికి సైతం చిన్నబాబు దూరంగా ఉన్నారు. గత ఎన్నికల్లో తాను పోటీచేసి ఓడిపోయిన మంగళగిరి నియోజకవర్గంలోనే ఆయన అడపాదడపా తిరుగుతున్నారు. అక్కడ డబ్బులిచ్చి కొందరు నాయకుల్ని మేనేజ్ చేస్తూ బిల్డప్ ఇచ్చుకోవడం.. చోటామోటా నేతలకు కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు చెప్పుకోవడం, స్థానికంగా చిన్నపాటి సమావేశాలతోనే ఆయన సరిపెట్టుకుంటున్నారు. అది కూడా కొంత సమయం మాత్రమే. ఎక్కువగా ఆయన హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. వచ్చే ఎన్నికల్లో అయినా ఎమ్మెల్యేగా గెలవాలని సూచిస్తూ ఆయన్ను మంగళగిరిపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించేలా చేయడంతో పార్టీ నేతలు ఓ రకంగా సఫలమయ్యారు. తద్వారా లోకేశ్ గండం నుంచి ప్రస్తుతానికి గట్టెక్కామని వారు భావిస్తున్నారు. తమ నియోజకవర్గాలకు ఆయన రాకుండా చూసుకుంటూ కొంతవరకైనా పరువు నిలుపుకోగలిగామని సంబరపడుతున్నారు.

జెండా పీకేశారు..

- ఫలించని కనకమేడల రాయబారం
- ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో టీడీపీ జెండాల తొలగింపు
- తిరువూరు సభకు డుమ్మా
- నాని అనుచరుడు మాజీ ఎమ్మెల్యే స్వామిదాస్ గైర్హాజరు
- విజయవాడ ఎంపీగానే పోటీచేస్తానన్న కేశినేని నాని



విజయవాడలో ఎంపీ కేశినేని నాని కార్యాలయం వద్ద తొలగించిన టీడీపీ జెండా

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ ఎంపీ కేశినేని నాని తన పార్టీ కార్యాలయంలో ఆదివారం టీడీపీ జెండాలను పీకేసినట్లు స్వయంగా ఆయనే తెలిపారు. దీంతో ఆయన టీడీపీతో పూర్తిగా తెగతెంపులు చేసుకొన్నట్లుగా అర్థం అవుతోంది. టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ శనివారం రాత్రి కేశినేని నానితో సమావేశమై బుజ్జగించే ప్రయత్నం చేశారు. తిరువూరు సభకు రావాలని అధిష్టానం దూతగా కోరినట్లు తెలిసింది. అయితే ఆయన ససేమిరా అంటూ తిరస్కరించారని సమాచారం. ఆదివారం సైతం తన రాజీనామాపై స్పందించారు. రాజీనామా చేస్తామని చెప్పాక కచ్చితంగా చేసేస్తానని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యతో రాజీనామా ఆలస్యం అవుతుందని, దానిపై ఇక చర్చించేది ఏమీ ఉండదని తేల్చి చెప్పారు. దీనిని బట్టి ఎంపీ కేశినేని నాని పూర్తిగా టీడీపీ నుంచి వెళ్లిపోవటానికి, తన ఎంపీ పదవికి రాజీనామా చేయటానికి నిర్ణయించుకున్నట్టు స్పష్టమవుతోంది. విజయవాడ ఎంపీగానే పోటీ చేస్తానని ఆయన మరోసారి స్పష్టం చేశారు. ఎంపీ ఆదివారం తన కార్యాలయంలో అనుచరులతో మంతనాలు జరిపారు. తిరువూరులో జరిగిన రా కదిలిరా సభకు ఎంపీ కేశినేని నాని అనుచరులు మాజీ ఎమ్మెల్యే స్వామిదాస్, రామసుబ్బారావు, వాసన్ మునెయ్య, చెరుకూరి రాజేశ్వరరావు, దేవభక్తుని సీతారాం ప్రసాద్, జక్కె వెంకటేశ్వరరావుతో తదితరులు దూరంగా ఉన్నారు.

తిరువూరు సభలో సీటు కేటాయించినా..

తిరువూరు సభలో టీడీపీ నేతలు వేసిన ఎత్తుగడ బెడిసి కొట్టింది. తిరువూరు సభలో ముందు వరసలో ఎంపీ కేశినేని నానికి సీటు కేటాయించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్లెక్సీల్లో సైతం ప్రొటోకాల్ ప్రకారం ఎంపీ ఫొటోలు వేశారు. ఈ విషయం ఎంపీ కేశినేని నాని దృష్టికి మీడియా తీసుకెళ్తే.. 'నాకు ప్రొటోకాల్ ఇచ్చామని, పాటిస్తున్నామని చెప్పుకోవటానికి బ్యానర్లలో ఫొటోలు వేశారు. గతంలో ప్రొటోకాల్ పాటించలేదే' అని ప్రశ్నించారు. అన్ని పద్ధతులూ పాటిస్తున్నామని చెప్పుకోవటానికే ఇదంతా అని అన్నారు. ఇదేదో తనమీద, ప్రేమ, గౌరవంతో చేసిన విషయం కాదని తేల్చి చెప్పారు. తమ తప్పు లేదని విజయవాడలో మీడియాకు చెప్పుకోవటానికి గిమ్మిక్కు చేశారని ఎద్దేవా చేశారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిచాక, తనకు పలు అవకాశాలు వచ్చాయన్నారు. అయితే అప్పట్లో టీడీపీని వీడాలనేది తన ఉద్దేశం కాదని కేశినేని నాని అన్నారు. కష్టాల్లో ఉన్న అధినేత చంద్రబాబుకు అండగా ఉండాలని ఆయన వెంటే నడిచానన్నారు. ఇప్పుడేమో తన వద్దకు దూతలను పంపి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండమని, పట్టించుకోవద్దని చెబుతున్నారని ఆరోపించారు. అధినేత ఆదేశాలను శిరసావహిస్తున్నా, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని వ్యంగ్యంగా అన్నారు. ఎంపీ హోదాలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటానని స్పష్టం చేశారు.

అనుచరులతో చర్చించి

విజయవాడ పార్లమెంటు పరిధిలో తన అనుచరులుగా ఉన్న ఎంకే బేగ్, బొమ్మసాని సుబ్బారావు, స్వామిదాస్, మరికొంత మంది పరిస్థితి ఏమిటని విలేకర్లు అడిగిన ప్రశ్నకు 'వేచి చూడండి' అని నాని బదులిచ్చారు. ప్రజాస్వామంలో డిసైడ్ చేసేది ప్రజలే. తనను నమ్ముకొని విజయవాడ పార్లమెంట్ పరిధిలో కొన్ని వేల మంది అనుచరులు, శ్రేయోభిలాషులు ఉన్నారని పేర్కొన్నారు. వారి మనోభావాలను దృష్టిలో పెట్టుకొని, తన ఒక్కడి నిర్ణయం కాకుండా, వారి ఆలోచనలకు అనుగుణంగా కలిసికట్టుగా నిర్ణయం తీసుకొంటామని స్పష్టం చేశారు. విజయవాడ ఎంపీగానే పోటీ చేస్తానని, మూడో సారి తానే గెలుస్తాననే ధీమా వ్యక్తం చేశారు.

మంచిమాట

పొగడ్తకి పొంగిపోని వాళ్ళు ఉండరు అంటే అతిశయోక్తి కాదు. మనుషులే కాదు దేవతలు కూడా పొగిడితే ఉబ్బి తబ్బిబ్బై పోతారు. పొగడ్త వినగానే డోపమైన్ అనే హార్మోను విడుదల అవుతుంది. అందుకే దైవాన్ని, ఇష్టదైవాన్ని అష్టోత్తరాలు, సహస్రనామాలతో కీర్తిస్తూ ఉంటారు. మానవులు, దేవతలు మాత్రమే కాదు. జంతువులు కూడా పొగిడితే సంతోషిస్తాయి. పెంపుడు జంతువులున్నవారికి ఇది అనుభవమే.



ముఖస్తుతి

పొగడ్తలు మనిషిని ప్రోత్సహించే వరకు ఉపయోగ పడతాయి. నిజంగా ప్రతిభ ఉన్నవారికి చిన్న మెప్పుదల ఉత్సాహాన్ని ఇస్తుంది. తాము చేస్తున్నది మంచిదే అయినా సాటివారి ఆమోదముద్ర తమ పని మీద నమ్మకాన్ని కలిగిస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. పొగడ్తలో కొంచెం అయినా నిజం ఉంటుంది.

ముఖస్తుతిలో అంటే ఎదురుగా పొగడటంలో నిజం ఉండే అవకాశం తక్కువ. మెరమెచ్చుల కోసం లేనిపోనివి అపాదించి చెప్పటం ముఖస్తుతి. ఆ సంగతి అంటున్నవారికి, వింటున్నవారికి తెలుసు. అయినా ఇష్టం లేనట్టు ముఖం పెట్టి వింటూనే ఉంటారు. లోలోపల సంతోషంగానే ఉంటుంది. ఎటువంటి వారికైనా తమని మెచ్చుకుంటూ ఉంటే బాగానే ఉంటుంది. "మీ లాగా పొగడ్తలు ఇష్టపడని వారు చాల గొప్ప వాళ్ళు. అందుకే మీరంటే నాకు ఎంతో అభిమానం." అంటే బోల్తాపడరా? చిన్నపిల్లల దగ్గర నుండి, దేవతల వరకు.

ముఖస్తుతిని ఆశించి, ఆనందించే వారు సాధారణంగా నష్టపోతూ ఉంటారు. తనకి అపాదించబడిన గుణాలు తనలో ఉన్నాయేమో నని భ్రమ పడుతూ ఉంటారు. ఆ భ్రమ వల్ల దానిని నిజం చేయాలనే తాపత్రయంలో ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. దాని వల్ల కలిగే దుష్ఫలితాలు ఏవిధంగా ఉంటాయో గమనించవచ్చు. ఉదాహరణకి: మన్మథుడు, శల్యుడు.

ఇంద్రుడు మన్మథుణ్ణి పిలిపించి అతడి సామర్థ్యాన్ని పొగుడుతాడు. అతడు ఉబ్బి తబ్బిబ్బు అయిపోయి "నేను ఎంతటి వారినైనా ప్రలోభపెట్ట గలను – శివుడైనా సరే!" అంటాడు. ఇంద్రుడికి కావలసింది అదే! అంతే! ఇరుక్కుపోయాడు. శరీరాన్ని కోల్పోయాడు.

శల్యుణ్ణి దుర్యోధనాదులు పొగిడి కర్ణుడి రథసారథిగా ఒప్పించారు. ససేమిరా, నేను సారథ్యం చేయట మేమిటి? అని భీష్మించుకున్న శల్యుడు తనని కృష్ణుడితో సమానమని పోల్చగానే ఆ పొగడ్తల మాయాజాలంలో పడి రథసారథ్యం చేశాడు.

ములగచెట్టు ఎక్కించటం అని చమత్కారంగా అంటూ ఉంటారు. ఆ కొమ్మ పుటుక్కున విరిగిపోతుంది. ముఖస్తుతి చేసే వారు ఎదుట పొగిడినా, వెనుక విమర్శిస్తూ ఉంటారు. పైగా పొగడ్తలకి పడిపోయారని చులకనగా మాట్లాడుతారు.

ఈ ఆయుధం కొన్ని మారులు ఉపయోగకరంగా కూడా ఉంటుంది. "నా బంగారు కొండ మంచివాడు. చక్కగా అన్నం తిని నిద్రపోతాడు." అంటుంది తల్లి. వాడు అన్నం తినటానికి పేచీ పెడతాడని ఒక పట్టాన నిద్రపోడని ఆ తల్లికి తెలుసు. వినగా, వినగా ఆ లక్షణాలు కొడుకులో పెంపొందుతాయేమోననే ఆశతో ఆ విధంగా పొగుడుతుంది.

ఒక రాజుకి ఒక కన్ను లేదు. తన చిత్రాన్ని అందంగా వేసిన వారికి బహుమతి ప్రకటించాడు. ఒక చిత్రకారుడికి ఆ బహుమతి దక్కింది. రాజు విల్లు ఎక్కుపెట్టి లక్ష్యం వైపు చూడటానికి ఒక కన్ను మూసినట్టు వేశాడు. పొగడటానికి అబద్ధాలు చెప్పనక్కర లేదు.

సాధారణంగా ఏదైనా ప్రయోజనాన్ని ఆశించి లేని సద్గుణాలని అపాదించి ఇంద్రుడు, చంద్రుడు అని కీర్తించేదే ముఖస్తుతి. పిల్లికి బిచ్చం పెట్టని వాణ్ణి దానకర్ణుడని, పొట్ట పొడిస్తే అక్షరం ముక్క లేని వాణ్ణి బృహస్పతి అని పొగడటం ముఖస్తుతి కాక మరేమిటి? ముఖస్తుతికి అలవాటు పడిన వారు విమర్శను అంగీకరించ లేరు. ఆత్మవిమర్శ అసలే ఉండదు. తాము చేసింది సరైనదే అనే మొండిపట్టు ఉంటుంది. పొరపాట్లని సరిదిద్దుకునే లక్షణం ఉండదు కనుక నాశాన్ని కొని తెచ్చుకున్నట్టు అవుతుంది. మహత్కార్యాలు చేయటానికి ఈ పొగడ్త ప్రేరకం అవుతుంది. ఉదాహరణకి హనుమ.

– డా.ఎన్.అనంత లక్ష్మి

బౌద్ధవాణి

సత్యం పలకడం చాలా అవసరం

సిద్ధార్థుడు శాక్య యువరాజు. కానీ, సన్యసించి రాజ్యాన్ని వదిలాడు. భిక్షువుగా మారాడు. ఆ తర్వాత తన బిడ్డ రాహులుణ్ణి కూడా భిక్షువుగా మార్చాడు. ఒకరోజున రాహులుడు అంబలట్ఠిక అనే చోట ఒక వనంలోని ఆరామంలో ఉన్నాడు. బుద్ధుడు రాజగృహంలోని వేణువనం నుండి అక్కడికి వచ్చాడు. బుద్ధుని రాకను గమనించిన రాహులుడు లేచి వచ్చి, నమస్కరించాడు. ఒక చెట్టుకింద బుద్ధునికి తగిన ఆసనాన్ని ఏర్పాటు చేశాడు. కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళు ఇచ్చాడు. బుద్ధుడు కాళ్ళు కడుక్కుని, ఆ పాత్రలో కొంచెం నీటిని ఉంచాడు. బుద్ధుడు ఎంత కష్టమైన విషయాన్నైనా ఉపమానంతో తేలికగా అర్థం అయ్యేలా చెప్పడంలో నేర్పరి. ఆయన వచ్చి ఆసనం మీద కూర్చొని –

"రాహులా! ఈ పాత్రలో మిగిలిన నీటిని చూశావా?" అని అడిగాడు.

"భంతే! చూశాను. అడుగున కొద్దిగా ఉన్నాయి"



"అవును కదా! తెలిసి తెలిసీ ఎవరు అబద్ధాలు ఆడతారో, మోసపు మాటలు చెప్తారో, అలా చెప్పడానికి సిగ్గుపడరో... అలాంటి వారికి దక్కే శ్రామణ్య ఫలం చాలా చాలా కొద్దిదే" అన్నాడు. రాహులుడు నిండు వదనంతో నింపాదిగా ఆ నీటి పాత్రవైపు చూశాడు. బుద్ధుడు ఆ పాత్రలో ఉన్న నీటిని అంతా పారబోశాడు. "రాహులా! నీరు పారబోయడం చూశావా?"

"చూశాను భగవాన్"

"తెలిసి తెలిసీ అసత్యాలు పలికే వారి మోసపు మాటలు చెప్పే వారి శ్రామణ్యం కూడా ఇలా పారబోసిన నీటిలాంటిదే"

బుద్ధుడు ఆ పాత్రను తీసుకుని తన పక్కనే ఉన్న రాతిపలక మీద బోర్లించాడు. రాహులుడు ఆ పాత్రవైపు కన్నార్పకుండా చూస్తూనే ఉన్నాడు. అప్పుడు బుద్ధుడు–"రాహులా! అలాంటి అబద్ధాలకోరు మోసపు మాటల కోరుకు దక్కే ధ్యానఫలం కూడా బోర్లించిన పాత్ర లాంటిదే" అన్నాడు. రాహులుడు తదేకంగా ఆ పాత్ర మీదే దృష్టి నిలిపాడు.

బుద్ధుడు మరలా ఆ పాత్రని తీసి నేల మీద ఉంచాడు. పాత్రలోకి చూపుతూ–"రాహులా! ఇప్పుడు ఈ పాత్ర నిలబడి ఉంది. కానీ ఎలా ఉంది?"

"ఖాళీగా ఉంది భగవాన్"

"అబద్ధాల కోరుకు దక్కే సాధనాఫలం కూడా ఖాళీ పాత్ర లాంటిదే" అన్నాడు.

అలా ఆ ఒక్కపాత్రని నాలుగు రకాలుగా ఉపమానంగా చూపుతూ అబద్ధాల కోరులు ఎంత సాధన చేసినా ధ్యానఫలాన్ని పొందలేరు. కాబట్టి సత్యభాషణం చాలా అవసరం అనే విషయాన్ని తేలిగ్గా అర్థమయ్యేలా చెప్పాడు బుద్ధుడు. అందుకే ఆయనను 'మహా గురువు'గా భావిస్తారు, గౌరవిస్తారు.

శ్రామణ్యం అంటే ధ్యాన సాధన ద్వారా పొందే ఫలం. తమకు తాము స్వీయ సాధన ద్వారా ఈ ధ్యానఫలాన్ని పొందుతారు. అందుకే ఈ సాధకుల్ని 'శ్రమణులు' అంటారు. తమకు తాము ఎంతో శ్రమించి ఎన్నో కఠోర శ్రమలకోర్చి సాధించే యోగ సాధన ఇది. బౌద్ధ భిక్షువుల్ని శ్రమణులు అనీ, బుద్ధుణ్ణి శ్రమణ గౌతముడని ఇందుకే పిలుస్తారు.

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

ఆ మూడూ చాలు నాకు...

"**నా**కు అమూల్యమైన అవకాశం దొరికింది. గురువుగారికి స్థాన శుశ్రూష చేస్తున్నాను. (అంటే గురువుగారు ఎక్కడున్నారో అక్కడ ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయడం), ఆత్మ శుశ్రూష చేస్తున్నాను. (అంటే గురువుగారి మాటలు వింటూ వాటిని జ్ఞాపకం పెట్టుకుని మననం చేయడం. గురువుగారు చేసే జ్ఞానబోధ జారిపోకుండా మనసులో నిలబెట్టుకోవడం). వీటన్నింటికన్నా దేహ శుశ్రూష చేస్తున్నా..."



గురువుగారు ఎంతకాలం ఉంటారో అంత కాలమే మాట్లాడగలరు. గురువుగారి శరీరం పతనం అయితే ఆయనకు వచ్చిన నష్టం ఏమీ లేదు. కారణం –"నైనం ఛిందంతి శస్త్రాణి/ నైనం దహతి పావకః /న చైనం క్లేదయంత్యాపో /న శోషయతి మారుతః" అన్నది భగవద్గీత వాక్యం.. శరీరం అసత్యం, ఆత్మ నిత్యం అనీ, అది ఖడ్గం చేత నరకబడదు, అగ్నిచేత కాల్చబడదు, నీటిచేత తడపబడదు, గాలిచేత విసిరి వేయబడదు.. అటువంటి ఆత్మ తానని గురువుగారికి తెలుసు. అందువల్ల శరీరం పతనమయితే ఆయన పొందే బాధేం లేదు. అది సహజం. కానీ గురువు శరీరం వదిలి పెట్టేస్తే నష్టం ఎవరికి అంటే శిష్యులకు. అందుకని శిష్యులు గురువుగారి శరీరాన్ని కాపాడుకుంటుంటారు. పద్మపాదుడు అలానే కదా శంకరాచార్యుల వారిని కాపాడుకున్నది! "...అలా గురు శుశ్రూష చేస్తున్నా. పరమపావనమైన గంగానదిలో స్నానం చేస్తున్నా. ఆపైన విశ్వనాథ దర్శనం చేస్తున్నా. ఈ మూడూ ప్రతి రోజూ జరుగుతున్నాయి. ఇంతకన్నా ఐశ్వర్యం ఏముంటుంది! అందువల్ల నాకు అమ్మానాన్నలను చూడాలనో, తోబుట్టువులను, నా స్నేహితులను చూడాలనో కోరికలు లేవు. మీదగ్గర ఉండడం చాలు నాకు" అన్నారు ముత్తుస్వామి దీక్షితార్ వారు... 'చాలా కాలమయింది అమ్మానాన్నలను వదిలివచ్చి, ఇల్లు గుర్తుకు రావడం లేదా...' అని అడిగిన గురువుగారితో.

శిష్యుని గురుభక్తికి చిదంబర నాథ యోగి గారు పరమానందం పొందారు. ఆరోజు గంగానదికి స్నానానికి వెళ్లేటప్పుడు శిష్యుడిని పిలిచి.."నాయనా! ఈరోజు ముందు నీవు వెళ్ళు. రోజూ నదిలో స్నానానికి ఎక్కడిదాకా వెడతావో దానికంటే కొంచెం ముందుకు వెళ్ళివచ్చేటప్పుడు మజ్జనం (తలను పూర్తిగా ముంచడం) చెయ్యి. అక్కడ తడిమి చూడు" అన్నారు. దీక్షితార్ వారు అలా చేసి చూస్తే అక్కడ ఆయనకు ఒక వీణ దొరికింది. అన్ని వీణలకు యాళి కిందికుంటే దీనికి పైన ఉంది. అది చూసి గురువుగారు సంతోషించారు. నీ శుశ్రూషకి గంగమ్మ అనుగ్రహించి దీనిని ప్రసాదించిందని చెప్పారు. నువ్వు గొప్ప వాగ్గేయకారుడివై అసమాన కీర్తి ప్రతిష్ఠలు పొందుతావు." అని ఆశీర్వదించి స్నానానికి వెళ్లి నీటిలో మునిగారు. ఇక పైకి లేవలేదు. తరువాత ఆయన భౌతిక కాయం లభించింది. అంత్యేష్టి సంస్కారం చేసి ముత్తుస్వామి దీక్షితార్ వారు తిరిగొచ్చేసారు. వాగ్గేయకారుడిగా కీర్తిప్రతిష్ఠలు గడించారు. గురువుల వైభవాన్ని కీర్తిస్తూ ఆయన చాలా కీర్తనలు చేసారు. వాటిలో ఒకదానిని చిదంబరనాథ యోగి పేర కూడా చేసారు.. అంత గొప్ప గురుభక్తి దీక్షితార్ వారిది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

చిత్ర పరిశ్రమ పచ్చగా ఉండాలి


– చిరంజీవి



● వరలక్ష్మి, ప్రశాంత్ వర్మ, చిరంజీవి, తేజ సజ్జా, నిరంజన్ రెడ్డి, అమృతా అయ్యర్

"**సం**క్రాంతి అన్నది సినిమాలకు చాలా మంచి సీజన్. ఎన్ని చిత్రాలు వచ్చినా సరే కథ బాగుండి.. కంటెంట్‌లో సత్తా ఉండి.. దేవుడి ఆశీస్సులు ఉన్నాయంటే ప్రేక్షకులు కచ్చితంగా ఆదరించి, విజయం అందిస్తారు. చిత్ర పరిశ్రమ ఎప్పుడూ పచ్చగా ఉండాలి. ఈ సంక్రాంతికి వస్తున్న 'గుంటూరు కారం, సైంధవ్, నా సామిరంగ' సినిమాలతో పాటు 'హను–మాన్' కూడా బాగా ఆడాలి.. ఆడుతుంది" అని హీరో చిరంజీవి అన్నారు. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను–మాన్'. శ్రీమతి చైతన్య సమర్పణలో కె.నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్యఅతిథిగా హాజరైన **చిరంజీవి మాట్లాడుతూ–**"'హను–మాన్' టీజర్, ట్రైలర్ చూడగానే అద్భుతంగా అనిపించడంతో డైరెక్టర్ ఎవరని అడిగి, ప్రశాంత్ వర్మ గురించి తెలుసుకున్నాను. 'మీ సూపర్ హీరో ఎవరు?' అని ఓ ఇంటర్వ్యూలో సమంత అడిగినప్పుడు.. 'హను–మాన్' అని టక్కున చెప్పేశాను. అదే ఈ సినిమాకి టైటిల్‌గా పెట్టడం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రశాంత్ వర్మ ఆలోచన, తేజ కష్టం వృథా కావు. అనుకున్న స్థాయిలో థియేటర్లు దొరక్కపోవచ్చు. కానీ, సినిమాని విడుదల రోజు.. లేకుంటే మరుసటి రోజు.. ఫస్ట్ షో.. లేదంటే సెకండ్ షో చూస్తారు. సినిమా బాగుంటే ఎన్ని రోజులైనా చూస్తారు. 'హను–మాన్'లాంటి మంచి సినిమా తీసిన నిరంజన్ రెడ్డిగారికి థ్యాంక్స్. ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అవుతుంది. ఈ చిత్రం ఆడినన్ని రోజులు ప్రతి టిక్కెట్‌పై వచ్చే డబ్బులో ఐదు రూపాయలు అయోధ్యలోని రామమందిరానికి విరాళంగా ఇస్తామని యూనిట్ చెప్పడం చాలా సంతోషంగా ఉంది. రామమందిరం ప్రారంభోత్సవానికి నాకు ఆహ్వానం అందింది.. కుటుంబ సమేతంగా వెళతాను" అన్నారు. **కె.నిరంజన్ మాట్లాడుతూ–** "నేను ఏదైతే నమ్మానో దాన్ని అలాగే తెరపైకి తీసుకొచ్చిన ప్రశాంత్‌కి థ్యాంక్స్. మా విజన్‌తో నిర్మించిన 'హను–మాన్'ని ప్రేక్షకులు బిగ్‌స్క్రీన్స్‌లో చూసి ఆశీర్వదించాలి" అన్నారు. "నా జీవితంలో నా తల్లిదండ్రుల తర్వాత నేను ఎవరికైనా థ్యాంక్స్ చెప్పుకోవాలంటే అది చిరంజీవిగారికే. ఆయన స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చి సినిమాలు చేస్తున్నా. రామ్‌చరణ్‌గారికి రాజమౌళిగారు, రవితేజగారికి పూరి జగన్నాథ్‌గారు, నాకు.. ప్రశాంత్ వర్మగారు అని సగర్వంగా చెబుతున్నా" అన్నారు **తేజ సజ్జా**. "నన్ను నమ్మి 'హను–మాన్' తీయమని సపోర్ట్ చేసిన నిరంజన్ రెడ్డి సర్‌కి థ్యాంక్స్. కలలో కూడా సినిమా గురించే ఆలోచిస్తాడు తేజ.. తనకి సినిమా అంటే అంత ప్రేమ. ఈ సంక్రాంతికి పిల్లలు, పెద్దలందరూ థియేటర్స్‌కి వచ్చి ఎంజాయ్ చేసేలా 'హను–మాన్' ఉంటుంది అన్నారు **ప్రశాంత్ వర్మ**. ఈ వేడుకలో అమృతా అయ్యర్, వరలక్ష్మీ శరత్ కుమార్, నటుడు వినయ్ రాయ్, కెమెరామేన్ దాశరథి శివేంద్ర, డైరెక్టర్ కేవీ అనుదీప్, రచయిత–డైరెక్టర్ బీవీఎస్ రవి, సంగీత దర్శకులు అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్, గౌర హరి తదితరులు పాల్గొన్నారు.

ఆట చూస్తావా!



● మహేశ్‌బాబు

"మీరు మీ పెద్దబ్బాయిని అనాథలా వదిలేసారని అంటున్నారు.. దానికి మీరు ఏం చెబుతారు..' (రమ్యకృష్ణకు ఎదురయ్యే ప్రశ్న)' అనే డైలాగ్‌తో 'గుంటూరు కారం' సినిమా ట్రైలర్ మొదలవుతుంది. 'అతడు, ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'గుంటూరు కారం'. శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్స్‌గా నటించారు. సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ఆదివారం విడుదల చేశారు. 'చూడంగానే మజా వచ్చిందా', 'హార్ట్ బీట్ పెరిగిందా', 'ఈల వేయాలనిపించిందా', 'ఆట చూస్తావా..! అంటూ మహేశ్ బాబు చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. రమ్యకృష్ణ, జగపతిబాబు, ప్రకాష్ రాజ్, జయరాం కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు తమన్ సంగీతం అందించారు.

సంక్రాంతికి పండగే పండగ

– వెంకటేశ్



● రుహానీ శర్మ, శ్రద్ధా శ్రీనాథ్, శైలేష్ కొలను, వెంకటేశ్, బేబీ సారా, వెంకట్, నవాజుద్దీన్

"**ఓ** మంచి సినిమాను ప్రేక్షకులకు ఇవ్వాలనే ఉద్దేశంతో 'సైంధవ్' చేశాం. సంక్రాంతి పండగకు రిలీజ్ చేస్తున్నాం.. పండగే పండగ.. మీకు (అభిమానులు, ప్రేక్షకులు)నచ్చేలా నా ఎమోషనల్, యాక్షన్ సీన్స్ కొత్తగా చేశాను. 'ధర్మచక్రం, గణేష్, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' ఇలా.. అన్ని సినిమాలను ఆదరించిన మీరు 'సైంధవ్' ని కూడా ఆదరించాలని కోరుకుంటున్నాను" అని వెంకటేశ్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సైంధవ్'. శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా, ఆర్య, నవాజుద్దీన్ సిద్ధిఖీ, బేబీ సారా కీలక పాత్రల్లో నటించారు. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వైజాగ్‌లో జరిగిన 'సైంధవ్' ప్రీ రిలీజ్ వేడుకలో **వెంకటేష్ మాట్లాడుతూ–** "నా తొలి చిత్రం 'కలియుగ పాండవులు', 'సుందరకాండ', 'మల్లీశ్వరీ', 'గురు', 'గోపాల గోపాల', 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు'.. ఇలా చాలా చిత్రాల కోసం వైజాగ్ వచ్చాను. ఇప్పుడు 'సైంధవ్' కోసం వచ్చాను. న్యూ ఏజ్ యాక్షన్ అండ్ ఎమోషనల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'సైంధవ్'. శైలేష్ కొలను బాగా చూపించాడు. ప్రేక్షకులు కంటతడి పెట్టే సన్నివేశాలు చాలా ఉన్నాయి. ఈ సినిమాకు హీరో సారా పాప. చాలా అద్భుతంగా నటించింది. ఈ సినిమా పండక్కి ప్రేక్షకులను అలరిస్తుంది" అన్నారు. **శైలేష్ కొలను మాట్లాడుతూ–**"వెంకటేశ్‌గారి 75వ సినిమా 'సైంధవ్' బాధ్యతని నాకు ఇచ్చినందుకు థ్యాంక్స్. ఆయన్ను మీరు (ప్రేక్షకులు, అభిమానులు) ఎలా చూడాలనుకుంటున్నారో అలానే చూపించాను. నేను కమల్‌హాసన్‌గారి అభిమానినని చాలాసార్లు చెప్పాను. ఇకపై నేను వెంకటేశ్‌గారి అభిమానిని కూడా. నవాజుద్దీన్‌గారిని తెలుగుకి పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. మన సీనియర్ హీరోలు రియలిస్టిక్ సినిమాలు చేస్తే చూడాలనుకుంటాం.. అలాంటి ఓ సినిమా 'సైంధవ్'" అన్నారు శైలేష్ కొలను. "'బ్రహ్మపుత్రుడు' సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నప్పుడు తొలిసారి వెంకటేశ్‌గారిని చూశాను. 'సైంధవ్' సినిమా నిర్మించే అవకాశం ఇచ్చినందుకు ఆయనకి థ్యాంక్స్" అన్నారు **వెంకట్ బోయనపల్లి**. ఈ వేడుకలో నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ, రుహానీ శర్మ, శ్రద్ధా శ్రీనాథ్, కెమెరామేన్ మణికందన్, బేబీ సారా, పాటల రచయిత రామజోగయ్యశాస్త్రి, ఎడిటర్ గ్యారీ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమలో కొత్త కోణం



● కార్తీక్ రాజు, మోక్ష, షెర్రీ

కార్తీక్ రాజు హీరోగా, మోక్ష, షెర్రీ అగర్వాల్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఐ హేట్ యు'. అంజి రామ్ దర్శకత్వం వహించారు. బి.లోకనాథం సమర్పణలో నాగరాజ్ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా నిర్మాత నాగరాజ్ మాట్లాడుతూ–"లవ్, సైకలాజికల్ అంశాలతో రూపొందిన చిత్రం 'ఐ హేట్ యు'. డిఫరెంట్ సబ్జెక్ట్‌తో అంజిరామ్‌గారు ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రేమలో కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు. ఈ సినిమాకి సంగీతం: సాకార్.

ఫిబ్రవరిలో ప్రారంభం?



● కమల్ హాసన్

'**నా**యకన్' (1987) (తెలుగులో నాయకుడు) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో కమల్ హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'థగ్ లైఫ్'. ఈ సినిమాలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నారు. కాగా ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరి చివరిలో లేదా మార్చి మొదట్లో ప్రారంభం కానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కావచ్చాయని, ఇప్పటికే సెట్ వర్క్ జరుగుతోందని టాక్. కమల్ హాసన్, మణిరత్నం, మహేంద్రన్, శివ అనంత్ నిర్మించనున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. మరోవైపు కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్ 2' విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే హెచ్ వినోద్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా నటించాల్సిన సినిమా ప్రకటన వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. అయితే ఈ సినిమాపై మరో అప్‌డేట్ రావాల్సి ఉంది.

వాటి గురించి ఆలోచించడం మానేశా

– ఇళయరాజా



"**న**న్ను అందరూ 'ఇసైజ్ఞాని' అని పిలుస్తుంటారు. నిజం చెప్పాలంటే ఆ పేరుకు నేను అర్హుడినా? అని ఆలోచిస్తే నాకే ప్రశ్నార్థకంగా ఉంటుంది" అని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా అన్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ వేడుకలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ–"నాకు భాష, సాహిత్యంపై అంత పరిజ్ఞానం లేదు. కర్ణాటక సంగీతాన్ని ఔపోసన పట్టలేదు. కానీ, ప్రజలు నన్ను ఇసైజ్ఞాని అని పిలుస్తున్నారు. కానీ, నేను 'ఇసైజ్ఞాని' అనుకోవడం లేదు. నా గర్వాన్ని చిన్న వయసులోనే వదిలేశా. అన్నతో కలిసి నేను కచేరీలకు వెళ్లే సమయంలో హార్మోనియం వాయిస్తుంటే ప్రేక్షకులు చప్పట్లుకొడుతూ అభినందించేవారు. ఆ సమయంలో ఎంతో గర్వంగా ఉండేది. అయితే ఆ అభినందనలు నాకు కాదు.. నేను సృష్టించే బాణీలకు వస్తున్నాయని తెలుసుకున్నా. మనకు ఏ విషయంతో సంబంధం లేదని గ్రహించాను. అందుకే కీర్తి ప్రతిష్ఠల గురించి ఆలోచించడం మానేశాను" అని పేర్కొన్నారు.

ప్లాంట్–మ్యాన్‌ని ఆదరిస్తున్నందుకు థ్యాంక్స్

– చంద్రశేఖర్


"**డై**రెక్టర్‌గా 'కాలింగ్ బెల్, రాక్షసి' వంటి సినిమాలు తీశాను. నిర్మాతగా నేను చేసిన మొదటి సినిమా 'ప్లాంట్–మ్యాన్'. మా చిత్రాన్ని ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇలాంటి స్పందన వస్తే ఏడాదికి రెండు చిన్న సినిమాలు చేసి కొత్త వారిని పరిచయం చేయాలని ఉంది" అని నిర్మాత పన్నారాయల్ అన్నారు. చంద్రశేఖర్, సోనాలి జంటగా కె.సంతోష్‌బాబు దర్శకత్వం వహించిన చిత్రం 'ప్లాంట్–మ్యాన్'. డీఎం యూనివర్సల్ స్టూడియోస్‌పై పన్నారాయల్ నిర్మించిన చిత్రం 'ప్లాంట్–మ్యాన్'. ఇటీవల విడుదలైన ఈ సినిమా థ్యాంక్స్ మీట్‌లో కె.సంతోష్‌బాబు మాట్లాడుతూ–"మా 'ప్లాంట్–మ్యాన్' సినిమాకి ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారం వల్లే ఇంత మంచి సినిమా చేయగలిగాను" అన్నారు. "మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. నాకు హీరోగా అవకాశం ఇచ్చిన పన్నాగారికి కృతజ్ఞతలు" అన్నారు చంద్రశేఖర్. "ఇలాంటి ఒక మంచి సినిమాలో భాగమైనందుకు సంతోషం" అన్నారు సోనాలి.



● చంద్రశేఖర్, సోనాలి

స్పోర్ట్స్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు నాదల్ దూరం



స్పెయిన్ దిగ్గజ టెన్నిస్ ప్లేయర్ రాఫెల్ నాదల్ ఈనెల 14 నుంచి 28 వరకు జరిగే సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి వైదొలిగాడు. కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన 37 ఏళ్ల నాదల్ గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత తుంటి గాయంతో ఏడాదిపాటు ఆటకు దూరమయ్యాడు. గతవారం బ్రిస్బేన్ ఓపెన్ టోర్నీతో నాదల్ పునరాగమనం చేశాడు. ఈ టోర్నీ లో జోర్డాన్ థాంప్సన్ (ఆస్ట్రేలియా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయిన నాదల్ ఈ మ్యాచ్ సందర్భంగా ఎడమ కాలి కండరాల గాయానికి గురయ్యాడు.

2017 తర్వాత మళ్లీ టైటిల్...



సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ బల్గేరియా టెన్నిస్ స్టార్ దిమిత్రోవ్ తన కెరీర్‌లో తొమ్మిదో సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో 32 ఏళ్ల దిమిత్రోవ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో 14వ ర్యాంకర్ దిమిత్రోవ్ 7-6 (7/5), 6-4తో 8వ ర్యాంకర్ హోల్గర్ రూనె (డెన్మార్క్)పై గెలిచి 95,340 డాలర్ల (రూ. 79 లక్షల 30 వేలు) ప్రైజ్‌మనీ సొంతం చేసుకున్నాడు. దిమిత్రోవ్ చివరిసారి 2017 నవంబర్ 17న ఏటీపీ ఫైనల్స్ టోర్నీ టైటిల్ నెగ్గాడు.



రోహిత్, కోహ్లి వచ్చేశారు

- భారత టి20 జట్టులోకి ఎంపిక
- ప్రపంచకప్ ప్రణాళికల్లో సీనియర్లు
- 11 నుంచి అఫ్గానిస్తాన్‌తో సిరీస్

ముంబై: ఈ ఏడాది జరగబోయే టి20 ప్రపంచకప్ టోర్నీలో భారత సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి బరిలోకి దిగే అవకాశాలు మెరుగయ్యాయి. 14 నెలల తర్వాత ఈ దిగ్గజాలిద్దరు మళ్లీ టి20 జట్టులోకి ఎంపికయ్యారు. చివరిసారిగా 2022 నవంబర్‌లో జరిగిన టి20 ప్రపంచకప్‌లో వీరిద్దరు ఆడారు. తదనంతరం పూర్తిగా టెస్టు, వన్డే ప్రపంచ కప్ కోసం వన్డేలకు మాత్రమే పరిమితమయ్యారు. అఫ్గానిస్తాన్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును ఆదివారం ప్రకటించగా... విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ జట్టులోకి వచ్చారు. తాజా ఎంపికతో వీరిద్దరు ఈ ఏడాది జూన్‌లో వెస్టిండీస్-అమెరికాలలో జరిగే టి20 ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగమవుతారని సీనియర్ సెలక్షన్ కమిటీ సూచనప్రాయంగా తెలిపింది. టి20 ఫార్మాట్‌లో ఇటీవల భారత జట్లకు కెప్టెన్లుగా వ్యవహరించిన హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్‌లతోపాటు ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ గాయాల కారణంగా అఫ్గానిస్తాన్‌తో సిరీస్‌కు దూరమయ్యారు. హైదరాబాద్ క్రికెటర్ ఠాకూర్ తిలక్ వర్మ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. భారత్, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య జనవరి 11న తొలి టి20 మొహాలీలో... 14న ఇండోర్‌లో రెండో టి20... 17న బెంగళూరులో మూడో టి20 మ్యాచ్ జరుగుతాయి. ఈ ఏడాది వెస్టిండీస్-అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే టి20 ప్రపంచకప్‌కు ముందు భారత్ ఆడే చివరి అంతర్జాతీయ సిరీస్ ఇదే అవుతుంది. అనంతరం భారత ఆటగాళ్లు ఐపీఎల్‌తో మ్యాచ్ ప్రాక్టీస్ పొందుతారు.

భారత టి20 జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, కోహ్లి, తిలక్ వర్మ, రింకూ సింగ్, జితేశ్ శర్మ, సంజూ సామ్సన్, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, కుల్దీప్ యాదవ్, అర్‌్షదీప్ సింగ్, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్.



పుజారా ఖాతాలో 17వ డబుల్ సెంచరీ

- సౌరాష్ట్ర 578/4 డిక్లేర్డ్
- జార్ఖండ్‌తో రంజీ ట్రోఫీ మ్యాచ్

రాజ్‌కోట్: గతేడాది ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ తర్వాత వెటరన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారాపై వేటు పడింది. వెస్టిండీస్, దక్షిణాఫ్రికా పర్యటనలకు అతన్ని తప్పించగానే ఈ వెటరన్ పనైపోయిందని అందరూ భావించారు. అయితే రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌లో ఈ సౌరాష్ట్ర స్టార్ బ్యాటర్ అజేయ డబుల్ సెంచరీతో తాను ఫామ్‌లోకి వచ్చానని చాటుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 406/4 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆట కొనసాగించిన సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 578/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. పుజారా (356 బంతుల్లో 243 నాటౌట్; 30 ఫోర్లు) తన ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో 17వ డబుల్ సెంచరీ సాధించగా, ప్రేరక్ మన్కడ్ (176 బంతుల్లో 104 నాటౌట్; 12 ఫోర్లు) సెంచరీ చేశాడు. రంజీ ట్రోఫీలో పుజారాకిది ఎనిమిదో డబుల్ సెంచరీ. ప్రేరక్, పుజారా అబేధ్యమైన ఐదో వికెట్‌కు 256 పరుగులు జోడించారు. సౌరాష్ట్రకు తొలి ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్రకు 436 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన జార్ఖండ్ ఆట నిలిచే సమయానికి 45 ఓవర్లలో 2 వికెట్లకు 140 పరుగులు చేసింది.

4 ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక డబుల్ సెంచరీలు చేసిన క్రికెటర్ల జాబితాలో పుజారా ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో డాన్ బ్రాడ్‌మన్ (ఆస్ట్రేలియా: 37). వ్యాలీ హామండ్ (ఇంగ్లండ్: 36). ప్యాట్సీ హెండ్రన్ (ఇంగ్లండ్: 22) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. హెర్బర్ట్ సట్‌క్లిఫ్ (ఇంగ్లండ్: 17). మార్క్ రాంప్రకాశ్ (ఇంగ్లండ్: 17)లతో కలిసి పుజారా (17) ఉమ్మడిగా నాలుగో స్థానంలో ఉన్నాడు.

2 రంజీ ట్రోఫీ చరిత్రలో అత్యధిక డబుల్ సెంచరీలు చేసిన రెండో ప్లేయర్‌గా పుజారా గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో తొమ్మిది డబుల్ సెంచరీలతో పారస్ డోగ్రా (హిమాచల్‌ప్రదేశ్) అగ్రస్థానంలో ఉండగా... అజయ్ శర్మ (ఢిల్లీ-7) మూడో స్థానంలో నిలిచాడు.

రికీ భుయ్ అజేయ శతకం

ఆంధ్ర 339/6



విశాఖ స్పోర్ట్స్: బెంగాల్ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ డివిజన్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యానికి 71 పరుగుల దూరంలో నిలిచింది. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 133 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 339 పరుగులు సాధించింది. రికీ భుయ్ (243 బంతుల్లో 107 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించి ఆంధ్ర జట్టును ఆదుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 119/3తో మూడో రోజు ఆట కొనసాగించిన ఆంధ్ర మూడు వికెట్లు కోల్పోయి మరో 220 పరుగులు సాధించింది. కెప్టెన్ హనుమ విహారి (51; 7 ఫోర్లు)తో కలిసి రికీ భుయ్ నాలుగో వికెట్‌కు 87 పరుగులు జత చేశాడు. అనంతరం నితీశ్ కుమార్ రెడ్డి (30; 6 ఫోర్లు)తో ఆరో వికెట్‌కు రికీ భుయ్ 71 పరుగులు జోడించాడు. ప్రస్తుతం షోయబ్ మొహమ్మద్ ఖాన్ (31 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి రికీ భుయ్ ఏడో వికెట్‌కు అజేయంగా 61 పరుగులు జత చేశాడు. బెంగాల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 409 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	10	9	1	0	46
గుజరాత్ జెయింట్స్	11	7	4	0	39
జైపూర్ పింక్ పాంథర్స్	10	6	2	2	38
దబంగ్ ఢిల్లీ	10	6	3	1	35
యు ముంబా	9	6	3	0	31
హరియాణా స్టీలర్స్	10	6	4	0	31
పట్నా పైరేట్స్	10	5	5	0	28
బెంగళూరు బుల్స్	11	4	7	0	26
బెంగాల్ వారియర్స్	10	3	5	2	23
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	10	2	8	0	14
తెలుగు టైటాన్స్	10	1	9	0	9

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

పుణేరి పల్టన్ జోరు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పుణేరి పల్టన్ తమ ఆధిపత్యం కొనసాగిస్తోంది. తమిళ్ తలైవాస్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 29-26తో గెలుపొందింది. ఈ లీగ్‌లో పుణేరి పల్టన్‌కిది తొమ్మిదో విజయం కావడం విశేషం. పుణేరి పల్టన్ తరఫున మొహమ్మద్ రెజా 8 పాయింట్లు, గౌరవ్ ఖత్రీ 6 పాయింట్లు, అస్లమ్ ముస్తఫా 5 పాయింట్లు స్కోరు చేశారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41-35తో బెంగాల్ వారియర్స్ జట్టును ఓడించింది. హరియాణా తరఫున శ్రీకాంత్ జాదవ్ 10 పాయింట్లు, మణీందర్ సింగ్ 8 పాయింట్లు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగళూరు బుల్స్‌తో పట్నా పైరేట్స్; యు ముంబాతో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.

బ్యాటర్ల వైఫల్యంతో...

- రెండో టి20లో భారత మహిళల జట్టు పరాజయం
- ఆరు వికెట్లతో గెలిచిన ఆస్ట్రేలియా
- రేపు నిర్ణాయక మ్యాచ్


హర్మన్‌ప్రీత్


కిమ్ గార్త్

నవీ ముంబై: వరుసగా రెండో విజయంతో టి20 సిరీస్‌ను సొంతం చేసుకోవాలని ఆశించిన భారత మహిళల క్రికెట్ జట్టుకు నిరాశ ఎదురైంది. బ్యాటర్ల వైఫల్యంతో సాధారణ స్కోరుకే పరిమితమైన హర్మన్‌ప్రీత్ బృందానికి ఓటమి తప్పలేదు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల టి20ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. సిరీస్ విజేతను తేల్చే నిర్ణాయక మూడో మ్యాచ్ మంగళవారం ఇదే వేదికపై జరుగుతుంది. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఆసీస్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హర్మన్ బృందం నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. టాపార్డర్‌లో షఫాలీ వర్మ (1), స్మృతి మంధాన (23; 2 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (13) సహా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (6) విఫలమయ్యారు. దీంతో 54 పరుగులకే కీలకమైన 4 వికెట్లు కోల్పోయిన టీమిండియా కష్టాల్లో పడింది. ఈ దశలో రిచా ఘోష్ (19 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్); దీప్తి శర్మ (27 బంతుల్లో 30; 5 ఫోర్లు) కాసేపు కుదురుగా ఆడారు. కానీ రిచా అవుటయ్యాక పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. పూజ వస్త్రకర్ (9), అమన్‌జోత్ కౌర్ (4)లు కూడా విఫలమవడంతో డెత్ ఓవర్లలో పరుగుల వేగం పుంజుకోలేదు. ప్రత్యర్థి బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కిమ్ గార్త్ (2/27), అనాబెల్ సదర్లాండ్ (2/18), జార్జియా వేర్‌హమ్ (2/17) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు అలీసా హీలీ (21 బంతుల్లో 26; 4 ఫోర్లు), బెత్ మూనీ (29 బంతుల్లో 20; 2 ఫోర్లు) తొలి వికెట్‌కు 51 పరుగులు జోడించి విజయానికి అవసరమైన పునాది వేశారు. తర్వాత తాలియా మెక్‌గ్రాత్ (19; 3 ఫోర్లు), ఎలైస్ పెరీ (21 బంతుల్లో 34 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుగైన స్కోరు చేయడంతో ఆస్ట్రేలియా ఒక ఓవర్ మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 2 వికెట్లు తీయగా, శ్రేయాంక పాటిల్, పూజ చెరో వికెట్ పడగొట్టారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

మిధాని హైదరాబాద్‌లో 165 ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌లు

హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో ఏడాది ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 165
» **ట్రేడులు:** ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, టర్నర్, డీజిల్ మెకానిక్, ఏసీ మెకానిక్, వెల్డర్, సీవోపీఏ.
» **అర్హత:** ఎస్ఎస్‌సీ, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.7000.
» **ఎంపిక విధానం:** ఎస్ఎస్‌సీ, ఐటీఐలో పొందిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు ఆధారంగా ఎంపికచేస్తారు.
» **అప్రెంటిస్‌షిప్ మేళా తేది:** 08.01.2024.
» **స్థలం:** ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పాతబస్తీ, హైదరాబాద్.
» **వెబ్‌సైట్:** https://midhani-india.in

రాజమహేంద్రవరం జోన్ వైద్యారోగ్య శాఖలో 15 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాజమహేంద్రవరం జోన్-2 పరిధిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లో సేవలు అందించడానికి ఒప్పంద ప్రాతిపదికన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్/మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15
» **అర్హత:** ఏపీ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఫర్ కమ్యూనిటీ హెల్త్ (సీపీసీహెచ్) కోర్సుతో బీఎస్సీ పూర్తిచేసి ఉండాలి.
» **వయసు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.25,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఉత్తీర్ణత సంవత్సరం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్, ఓల్డ్ రిమ్స్, కడప చిరునామకు పంపించాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.01.2024.
» **మెరిట్ జాబితా వెల్లడి తేది:** 27.01.2024.
» **అభ్యంతరాల స్వీకరణకు చివరితేది:**31.01.2024
» **తుది మెరిట్ జాబితా వెల్లడి తేది:** 07.02.2024
» **తుది మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు చివరితేది:** 09.02.2024.
» **తుది ఎంపిక జాబితా వెల్లడి తేది:** 12.02.2024
» **కౌన్సిలింగ్ తేది:** 14.02.2024.
» **వెబ్‌సైట్:** hmfw.ap.gov.in

జీజీహెచ్ కర్నూలులో 94 పారా మెడికల్ పోస్టులు

కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ వైద్య సంస్థల్లో పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **వైద్య సంస్థలు:** కర్నూలు మెడికల్ కాలేజ్ (కర్నూలు), ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (కర్నూలు), రీజనల్ ఐ హాస్పిటల్(కర్నూలు), గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్(కర్నూలు), గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(నంద్యాల), ప్రభుత్వ వైద్య కళాశాల(ఆదోని), గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(ఆదోని).
» **పోస్టులు:** జూనియర్ అసిస్టెంట్, పర్సనల్ అసిస్టెంట్, వార్డెన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హౌస్ కీపర్, బార్బర్, హెల్పర్, లస్కర్, పంప్‌మన్, గార్డనర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, కర్నూల్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 09.01.2024.
» **వెబ్‌సైట్:** https://kurnool.ap.gov.in

జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో పార్ట్‌టైమ్ ఎంటెక్, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ(జేఎన్‌టీయూ).. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంబీఏ, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 390
» **కోర్సు వ్యవధి:** మూడేళ్లు(ఆరు సెమిస్టర్లు).
» **అర్హత:** ఏదైనా డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, బీడీఎస్, బీవీఎస్సీ, బీఫార్మసీ, ఎంసీఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. హైదరాబాద్ పరిధిలో కనీసం ఏడాది పాటు ఉద్యోగం చేసిన అనుభవం తప్పనిసరిగా ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.01.2024.
» **వెబ్‌సైట్:** jntuh.ac.in.

సెంట్రల్ బ్యాంకులో 484 కొలువులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. దీనిద్వారా దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో సఫాయి కర్మాచారి కమ్ సబ్-స్టాఫ్/సబ్-స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తుకు అర్హులు. జనవరి 9వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు

» సఫాయి కర్మాచారి కమ్ సబ్-స్టాఫ్/సబ్-స్టాఫ్: 484
» **జోన్లవారీగా ఖాళీలు..** అహ్మదాబాద్-76, భోపాల్-38, ఢిల్లీ-76,కోల్‌కతా-02, లఖ్‌నవూ-78, ఎంఎంజడ్‌వో అండ్ పుణె-118, పట్నా-96.
» **అర్హత:** ఎస్ఎస్‌సీ/పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.03.2023 నాటికి 18-26 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.14,500-రూ.28145.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష(70 మార్కులు), లోకల్ లాంగ్వేజ్ టెస్ట్ (30 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ పరీక్ష ఆంగ్ల మాధ్యమంలో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ అర్థమేటిక్, సైకోమెట్రిక్ టెస్ట్, సైకోమెట్రిక్ (రీజనింగ్) అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 09.01.2024
» **సీబీటీ పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 2024
» **వెబ్‌సైట్:** https://centralbankofindia.co.in/en

ఐబీలో.. ఆఫీసర్ కొలువు


జాబ్స్ ఇన్ఫో

బీటెక్ పూర్తి చేసి గేట్‌లో స్కోర్ సాధించిన వారికి కొత్త సంవత్సరంలో చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)-226 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్-2 (టెక్నికల్) పోస్టుల భర్తీ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కీలక శాఖలో కొలువుదీరే అవకాశం సొంతం చేసుకోవచ్చు. ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. ఐబీ ఏసీఐఓ గ్రేడ్-2/టెక్నికల్ పోస్టుల నోటిఫికేషన్ సమాచారం, ఎంపిక విధానం తదితర వివరాలు..

» అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్-2 (టెక్) నోటిఫికేషన్
» మొత్తం 226 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» బీటెక్, గేట్ స్కోర్ ఆధారంగా దరఖాస్తు అవకాశం
» ఇంటర్వ్యూలో ప్రతిభతో తుది ఎంపిక

రెండు విభాగాలు.. 226 పోస్టులు

ఇంటెలిజెన్స్ బ్యూరోలో తాజా నోటిఫికేషన్ ద్వారా రెండు విభాగాల్లో 226 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/టెక్నికల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో 79 పోస్టులు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో 147 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్ /కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. (లేదా) ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ లేదా కంప్యూటర్ సైన్స్‌లో ఫిజిక్స్ సబ్జెక్ట్‌తో పీజీ లేదా కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పీజీ ఉత్తీర్ణత పొందాలి.
- సంబంధిత బ్రాంచ్/సబ్జెక్ట్‌లో బీటెక్ లేదా ఎమ్మెస్సీతోపాటు గేట్-2021, 2022, 2023లో అర్హత సాధించాలి.
- **వయసు:** జనవరి 12, 2024 నాటికి 18-27 ఏళ్లు (ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు) ఉండాలి.

నెలకు లక్ష వేతనం

నియామకాలు ఖరారు చేసుకున్న అభ్యర్థులకు పే లెవల్-7 (రూ.44,900 - రూ.1,42,400 వేతన శ్రేణి)లో ప్రారంభ వేతనం లభిస్తుంది. మూల వేతనం రూ.44,900గా ఉంటుంది. దీనికి అదనంగా డీఏ, ఎస్ఎస్ఏ, హెచ్ఆర్ఏ, టీఏ, డీఏ వంటి ఇతర భత్యాలు లభిస్తాయి. ఇలా.. మొత్తంగా నెలకు రూ.లక్ష వరకు నికర వేతనం పొందొచ్చు.

గేట్ స్కోర్ ప్రామాణికం

2021, 2022, 2023లో గేట్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్(ఈసీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(సీఎస్) పేపర్లలో ఉత్తీర్ణతను దరఖాస్తుకు అర్హతగా పేర్కొన్నారు. వీరి నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి గేట్ స్కోర్ ఆధారంగా తదుపరి దశకు ఎంపిక చేస్తారు.

ఇంటర్వ్యూతో నియామకాలు

అభ్యర్థులు గేట్-2021, 2022, 2023లలో తమకు వచ్చిన బెస్ట్ స్కోర్‌తో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఈ గేట్ స్కోర్ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 10 మందిని చొప్పున ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది నియామకాలు ఖరారు చేస్తారు. ఇంటర్వ్యూకు మొత్తం 175 మార్కులు కేటాయించారు.

మెరిట్ జాబితా

ఫైనల్ మెరిట్ జాబితాను రూపొందించేందుకు.. గేట్ స్కోర్‌ను, ఇంటర్వ్యూలో పొందిన మార్కులను క్రోడీకరిస్తారు. ఆ తర్వాత అందుబాటులో ఉన్న పోస్టులు, రిజర్వేషన్, ఇతర నిబంధనలను అనుసరిస్తూ తుది నియామకాలు ఖరారు చేస్తారు.

ఇంటర్వ్యూ ఇలా

మొత్తం 175 మార్కులకు జరిపే పర్సనల్ ఇంటర్వ్యూలో భాగంగా.. సైకోమెట్రిక్ టెస్టులు/ఆప్టిట్యూడ్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. ప్రధానంగా జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లిష్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు సంబంధించి అభ్యర్థులకు ఇంటెలిజెన్స్ బ్యూరోపై ఉన్న అవగాహన, ఇంటెలిజెన్స్ బ్యూరో విధులు, దేశంలో శాంతి భద్రతలు తదితర విషయాలపై ఉన్న అవగాహనను పరిశీలిస్తారు.

సబ్జెక్ట్ నైపుణ్యం

ఇంటర్వ్యూలో భాగంగా సబ్జెక్ట్ నైపుణ్యాలను కూడా పరిశీలిస్తారు. అభ్యర్థులు బీటెక్ స్థాయిలో చదివిన సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రశ్నలను అడుగుతారు. అదే విధంగా.. సాంకేతిక నైపుణ్యాలను.. నిఘా విభాగంలో ఎలా ఉపయోగించొచ్చు? ఇంటెలిజెన్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్‌లలో టెక్నాలజీని అమలు చేస్తున్న తీరు? తదితర అంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. అభ్యర్థులు ఇంటెలిజెన్స్ బ్యూరో విధి విధానాలపై అవగాహన ఏర్పరచుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. అంతేకాకుండా.. అకడమిక్స్ కోణంలో తాము చేసిన ప్రాజెక్ట్ వర్క్స్, వాటి ద్వారా గుర్తించిన సమస్యలు, వాటికి కనుగొన్న పరిష్కారాలు, అవి ఉపయోగపడే తీరు వంటి వాటి గురించి పునరావలోకం చేసుకోవడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

విధులు ఇలా

ఏసీఐఓ గ్రేడ్-2/టెక్నికల్‌గా నియమితులైన వారు.. నిఘా విభాగానికి సంబంధించిన వివిధ కార్యకలాపాలను సాంకేతికీకరణ చేసే విధంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. నివేదికలు రూపొందించేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌ను వినియోగించడం, నిఘా విధులకు కీలకంగా నిలుస్తున్న కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ సాధనాల పనితీరును పర్యవేక్షించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

పదోన్నతితో డిప్యూటీ డైరెక్టర్

ఏసీఐఓ గ్రేడ్-2 హోదాలో నియమితులైన వారు భవిష్యత్తులో పదోన్నతుల ద్వారా డిప్యూటీ డైరెక్టర్ స్థాయికి కూడా చేరుకునే అవకాశం ఉంది. తొలుత ఏసీఐఓ గ్రేడ్-1గా పదోన్నతి లభిస్తుంది.ఆ తర్వాత ప్రతి హోదాకు ఆరు నుంచి ఎనిమిదేళ్ల కాల వ్యవధి ఆధారంగా.. డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్, జాయింట్ డిప్యూటీ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ వంటి హోదాలకు చేరుకోవచ్చు. 27 ఏళ్ల వయసులో కొలువులో చేరిన వారు పదవీ విరమణ సమయానికి అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయికి చేరుకోవచ్చు. అత్యున్నత ప్రతిభతో డిప్యూటీ డైరెక్టర్ స్థాయికి కూడా చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 12, 2024.
- **పర్సనల్ ఇంటర్వ్యూ తేదీ:** మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.mha.gov.in, www.ncs.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
179	52
72,026	21,711

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	14,524	▲	14
డోజోన్స్	37,466	▲	26
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,700	▼	34
డాక్స్	16,594	▲	23
షాంఘై	2,929	▼	25
నికాయ్	33,377	▲	132

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.84	86.86
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.42	106.97
€	యూరో	ఒకటి	90.02	92.39
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.87	58.17
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.89	56.83
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.22	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.71	23.54
¥	చైనా యువాన్	ఒకటి	10.50	12.58



మీ ఇంటికి బీమా ఉందా..?

ప్రమాదాలు, విపత్తులతో భారీ నష్టం ● కొన్ని సందర్భాల్లో ఊహించలేనంత.. వాటిని గట్టెక్కేందుకు బీమా ఉండాలి ● పొదుపుతో కొన్న ఇంటికి పూర్తి రక్షణ ● తక్కువ ప్రీమియంతో మెరుగైన కవరేజీ



దీపావళి రోజున హైదరాబాద్‌కు చెందిన రామన్ కుటుంబం ఓ పెద్ద ప్రమాదం నుంచి బయటపడింది. స్కై షాట్ క్రాకర్ గతితప్పి ఎనిమిదో అంతస్తులోని రామన్ అపార్ట్‌మెంట్‌లోకి దూసుకెళ్లింది. దాంతో మంటలు మొదలయ్యాయి. ఇంట్లోని ఫర్నిచర్, విలువైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, వస్త్రాలు కాలిపోయాయి. ఒకింత అదృష్టం ఏమిటంటే రామన్ కుటుంబ సభ్యులు అందరూ ఫ్లాట్ నుంచి బయటకు వచ్చేశారు. ఎవరికీ గాయాలు కాలేదు. కానీ, ఇంట్లోని విలువైన వస్తువులు కాలిపోవడం వల్ల రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఇది ఊహించని నష్టం. ఇలాంటి ప్రమాదం ఏర్పడుతుందని ఎవరూ అనుకోరు. కానీ, ప్రమాదాలు అన్నవి చెప్పి రావు. అందుకే ఇంటికి, ఇంట్లోని విలువైన వాటికి బీమా ఉండాలని నిపుణులు తరచూ చెబుతుంటారు. కానీ, దీన్ని పాటించే వారు చాలా తక్కువ మందే అని చెప్పుకోవాలి. హోమ్ ఇన్సూరెన్స్ ఇంటితోపాటు, ఇంట్లోని విలువైన వస్తువులకు ప్రమాదాలు, విపత్తుల కారణంగా ఏర్పడే నష్టం నుంచి రక్షణనిస్తుంది. చౌక ప్రీమియానికే వస్తుంది. రోజుకు ఒక టీకి పెట్టేంత ఖర్చు కూడా కాదు. హోమ్ ఇన్సూరెన్స్ ఎందుకు తప్పనిసరి అనేది వివరంగా చూద్దాం...

"ప్రజలు తమ జీవిత కాల పొదుపును ఇంటి కొనుగోలు కోసం వెచ్చిస్తున్నారు. మరి అంతటి విలువైన ఆస్తిని కాపాడుకునేందుకు కావాల్సిన చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఎంతో విలువైన ఆస్తికి ఎల్లప్పుడూ రిస్క్ పొంచి ఉంటుంది"అని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ అండర్‌రైటింగ్, ప్రాపర్టీ క్లెయిమ్స్ చీఫ్ గౌరవ్ అరోరా తెలిపారు. నిజానికి ప్రతి 20 ఇళ్లల్లో కేవలం ఒక ఇంటికే ప్రస్తుతం బీమా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. సగటు వ్యక్తికి ఇల్లు అనేది పెద్ద పెట్టుబడి అవుతుంది. అందుకే ఆ విలువైన ఆస్తికి తప్పకుండా రక్షణ తీసుకోవాలి. "విపత్తులు రావడం అన్నది అరుదే. కానీ, వచ్చినప్పుడు వాటిల్లే నష్టం భారీగా ఉంటుంది"అని డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్ట్ సేల్స్ హెడ్ వివేక్ చతుర్వేది పేర్కొన్నారు.

అనుభవాలను మర్చిపోవద్దు..

జీవిత బీమా తీసుకోవాలని చాలా మంది ఏజెంట్లు అడగడం వినే ఉంటారు. కానీ, అదే స్థాయిలో హోమ్ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ కనిపించదు. దీన్ని తీసుకున్నామని, తీసుకోవాలని సూచించే వారు కూడా అరుదు. విపత్తులు, ప్రమాదాలే హోమ్ ఇన్సూరెన్స్ దిశగా అడుగులు వేయించేవిగా భావించాలి. నిజానికి ప్రకృతి విపత్తుల సమయాల్లో హోమ్ ఇన్సూరెన్స్ విక్రయాలు పెరుగుతుంటాయి. 2018లో కేరళను వరదలు తీవ్రంగా నష్టపరిచాయి. ఆ తర్వాతి ఏడాదిలో హోమ్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఆదాయం 34 శాతం పెరిగింది. ఇంటి బీమా కోసం ఆసక్తి పెరిగింది. 2020లో యాంఫాన్ తుపాను పశ్చిమబెంగాల్‌ను నష్టపరచగా ఆ తర్వాతి ఆర్థిక సంవత్సరంలో పై ప్రీమియం ఆదాయం 27 శాతం పెరగడం గమనించొచ్చు. కానీ, ఇదంతా తాత్కాలిక ధోరణిగానే ఉంటోంది. విపత్తులు లేదా ప్రమాదాలు తలెత్తినప్పుడు సహజంగా హోమ్ ఇన్సూరెన్స్ విక్రయాలు పెరుగుతుంటాయి. తిరిగి ఏడాది రెండేళ్ల తర్వాత అక్కడి ప్రజలు వాటిని మరిచిపోతుంటారు. దీంతో విక్రయాలు మళ్లీ తగ్గుతుంటాయి. ఇదే పరిస్థితి ఇప్పుడు హెల్త్ ఇన్సూరెన్స్ విభాగంలోనూ కనిపిస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో వైద్య బిల్లులు గణనీయంగా పెరిగాయి. దీంతో ఆరోగ్య బీమా తీసుకునే వారిలో పెద్ద ఎత్తున పెరుగుదల కనిపించింది. ఇప్పుడు కరోనా విపత్తు బలహీనపడింది. దీంతో హెల్త్ ఇన్సూరెన్స్ విక్రయాలు తిరిగి సాధారణ స్థాయికి చేరాయి"అని డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్‌కు చెందిన చతుర్వేది తెలిపారు.

ఫ్లాట్ యజమానులు హౌసింగ్ సొసైటీ తీసుకున్న హోమ్ ఇన్సూరెన్స్‌పై ఆధారపడడం సరికాదని నిపుణుల సూచన. తమ ఫ్లాట్‌తోపాటు, అందులోని విలువైన వస్తువులకు విడిగా కవరేజీ తీసుకోవడం అన్ని విధాలుగా మెరుగైన నిర్ణయం అవుతుంది. ఇంటికి భూకంపాలు, తుపాను, వరదల ముప్పు మాత్రమే కాదు, ఎత్తయిన భవనాలు, ఖరీదైన గాడ్జెట్ల వినియోగం నేపథ్యంలో అగ్ని ప్రమాదాల ముప్పు కూడా ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలి. ముంబైలో ఏటా 5,000 వరకు అగ్ని ప్రమాదాలు నమోదవుతున్నట్టు ఒక అంచనా. ఇందులో 70 శాతానికి విద్యుత్తే కారణంగా ఉంటోంది. ఢిల్లీ, బెంగళూరు తదితర పట్టణాల్లో ఏటా 2,500 మేర అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. "ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల వినియోగం పెరిగిపోవడంతో, ఎలక్ట్రికల్ వైరింగ్‌పై భారం అధికమై అగ్ని ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయి"అని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ చతుర్వేది తెలిపారు. అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదానికి సంబంధించి అలారమ్ మోగిన వెంటనే, స్ప్రింక్లర్ సిస్టమ్ నుంచి నీరు ఎంతో ఒత్తిడితో ఎగజిమ్మడం మొదలవుతుంది. ఈ నీటి కారణంగా ఇంట్లోని విలువైన గాడ్జెట్లు, ఇంటీరియర్ దెబ్బతింటాయి. కనుక అగ్ని ప్రమాదం జరగకపోయినప్పటికీ, ఇంటి యజమాని చాలా నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. అద్దె ఇంట్లో ఉంటే హోమ్ ఇన్సూరెన్స్ అవసరం లేదని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కానీ, ఇది ఎంత మాత్రం సరైనది కాదు. హోమ్ ఇన్సూరెన్స్ అన్నది కేవలం ఇంటి నిర్మాణానికి జరిగిన నష్టానికే పరిమితం కాదు. ఇంట్లోని వస్తువులు దెబ్బతింటే ఏర్పడే నష్టం నుంచి గట్టెక్కడానికి బీమా అక్కరకు వస్తుంది. దోపిడీ, దొంగతనాల వల్ల ఏర్పడే నష్టాన్ని సైతం భర్తీ చేసుకోవచ్చు.

కవరేజీ చాలినంత..

హోమ్ ఇన్సూరెన్స్ తీసుకోవడానికి ముందు కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. తమ అవసరాలకు తగిన పాలసీ కీలకం అవుతుంది. భారత్ గృహ రక్ష (బీజీఆర్) అన్నది ఐఆర్‌డీఏఐ ఆదేశాల మేరకు అన్ని సాధారణ బీమా సంస్థలు తీసుకొచ్చిన ప్రామాణిక నివాస బీమా. ప్రకృతి విపత్తులు అయిన వరదలు, భూకంపాలతోపాటు అగ్ని ప్రమాదాలు, చెట్టు విరిగి పడడం, వాహనం డ్యాష్ ఇవ్వడం కారణంగా ఇంటికి వాటిల్లే నష్టానికి ఈ పాలసీలో పరిహారం లభిస్తుంది. శిథిలాల తొలగింపునకు, ఇంజనీరింగ్ లేదా ఆర్కిటెక్ట్ ఫీజులకు అయ్యే మొత్తాన్ని కూడా చెల్లిస్తుంది. కానీ, ఇందులో పరిమితులు కూడా ఉన్నాయి. రూ.10 లక్షలు లేదా తీసుకున్న కవరేజీలో 20 శాతం ఏది తక్కువ అయితే అంత మేరే ఈ పాలసీ కింద పరిహారం లభిస్తుంది. ఓ సాధారణ మధ్య తరగతి ఇంటికి రూ.10 లక్షలు బీమా సరిపోదు. ఇంట్లో అధిక విలువ కలిగిన వస్తువులు ఉంటే, వాటి కోసం ప్రత్యేక కవరేజీ తీసుకోవాలని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రాపర్టీ అండ్ రైటింగ్ హెడ్ గురుదీప్ సింగ్ బాత్రా సూచించారు. ఇంటి మార్కెట్ విలువ ఆధారంగా బీమా కవరేజీపై నిర్ణయానికి రావద్దు. ఇంటి నిర్మాణం దెబ్బతింటే, పునరుద్ధరించడానికి అయ్యే వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. చదరపు అడుగుకు ఎంత వ్యయం అవుతుందో ఇంజనీర్లను అడిగితే తెలుస్తుంది. ఇంట్లో విలువైన ఫిట్టింగ్‌లు ఏర్పాటు చేసుకున్న వారు, ఆ విలువను కూడా బీమా కవరేజీకి అదనంగా జోడించుకోవాలి. హోమ్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఏటా ఎంతో కొంత పెరుగుతుంటుంది. కనుక ఏడాదికి కాకుండా ఒకేసారి రెండు, మూడేళ్ల కాలానికి పాలసీ తీసుకోవచ్చు. "ఇంటికి తీసుకునే బీమాని ఏటా రెన్యువల్‌కు ముందు ఆ కవరేజీని సమీక్షించుకోవాలి. ఎందుకంటే ద్రవ్యోల్బణం ప్రభావంతో ఏటా ఇంటి నిర్మాణ వ్యయం పెరిగిపోతుంటుంది. అందుకు అనుగుణంగా ఏటా నిర్ణీత శాతం మేర కవరేజీని పెంచుకోవాలి. ఏటా 10 శాతం మేర కవరేజీ పెరుగుతూ వెళ్లే వాటిని పరిశీలించొచ్చు.



ఇంట్లో ఉన్న ఒక్కో పరికరం, కొనుగోలు చేసిన సంవత్సరం, మోడల్ నంబర్, దాని విలువ ఈ వివరాలన్నీ సిద్ధం చేసుకోవాలి. ఇన్సూరెన్స్ సంస్థలు ఈ వివరాల ఆధారంగానే పరిహారాన్ని నిర్ణయిస్తాయి. అవి ఎన్నేళ్ల పాటు వాడారన్న వివరాల ఆధారంగా ప్రామాణిక తరుగును అమలు చేస్తాయి. ఎలక్ట్రానిక్ పరికరాల విలువ ఏటా తగ్గుతూ ఉంటుంది. రూ.50 వేలు పెట్టి రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన వస్తువు విలువ ఇప్పుడు సగానికి తగ్గిపోతుంది. కనుక పాడైపోయిన దాని స్థానంలో కొత్తది కొనుగోలుకు అయ్యే మొత్తాన్ని బీమా సంస్థ చెల్లిస్తుందని అనుకోవద్దు. ఇంట్లో విలువైన కళాకృతులు ఉంటే, వాటికి సైతం బీమా కవరేజీ కోరుకుంటే.. సర్టిఫైడ్ ఏజెన్సీ నుంచి వ్యాల్యూయేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఒకవేళ కళాఖండాల మొత్తం విలువ రూ.5 లక్షలు, విడిగా ఒక్కోటి విలువ రూ.లక్ష మించకపోతే వ్యాల్యూయేషన్ సర్టిఫికెట్ అవసరం పడదు.

ఎలాంటి కవరేజీ..?



ప్రతి ఇంటికి కనీసం హోమ్ ఇన్సూరెన్స్ బేసిక్ పాలసీ అయినా ఉండాలి. భూకంపాలు, పిడుగులు, తుపానులు, వడగళ్లు, వరదలు తదితర ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదం, విధ్వంసం, అల్లర్ల కారణంగా ఇంటి నిర్మాణానికి నష్టం ఏర్పడితే బేసిక్ పాలసీలో పరిహారం లభిస్తుంది. మరమ్మతులు లేదంటే తిరిగి నిర్మాణం వీటిల్లో సరైన దానికి కవరేజీనిస్తుంది. రూ.లక్ష కవరేజీకి ప్రీమియం రూ.30 వరకు ఉంటుంది. ఇక ఇంటి నిర్మాణానికి అదనంగా, ఇంట్లోని వస్తువులకు కూడా రక్షణ తీసుకోవచ్చు. ఈ తరహా కవరేజీకి ప్రతి రూ.లక్షకు గాను ప్రీమియం రూ.60 వరకు ఉంటుంది. దోపిడీ, దొంగతనాల నుంచి సైతం రక్షణ అవసరం. ఇంట్లోని ఫర్నిచర్, కళాఖండాలు, వస్త్రాలు, గృహోపకరణాలు, గాడ్జెట్ల వంటి వాటికి దొంగతనాల నుంచి రక్షణ కోరుకుంటే ప్రతి రూ.లక్షకు రూ.200 వరకు ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. ఇంట్లో గాడ్జెట్లు పనిచేయకుండా పోవడం చూస్తుంటాం. ఇలా ఉన్నట్టుండి ఇంట్లో పరికరం పనిచేయకుండా పోతే, పరస్పర అంగీకారం మేరకు పరిహారం అందించే 'బ్రేక్‌డౌన్' కవర్ కూడా ఉంటుంది. దీనికి ప్రీమియం రూ.లక్షకు రూ.200-300 వరకు ఉంటుంది. రుణంపై ఇంటిని తీసుకున్న వారు ఈఎంఐ ప్రొటెక్షన్ కవర్ తీసుకోవచ్చు. ఇంటి నిర్మాణం దెబ్బతిన్న సందర్భాల్లో పునరుద్ధరణ లేదా పునర్‌నిర్మాణం వరకు రుణ ఈఎంఐని బీమా కంపెనీ చెల్లించాలని కోరుకుంటే ఈఎంఐ ప్రొటెక్షన్ కవర్ తీసుకోవచ్చు. ఆరు నెలల ఈఎంఐ రక్షణకు ప్రీమియం రూ.2,500 వరకు ఉంటుంది. ఇంటి నిర్మాణం దెబ్బతిన్నప్పుడు అందులో ఉండే కిరాయిదారు ఖాళీ చేయాల్సి రావచ్చు. అదే జరిగితే అప్పటి వరకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వస్తున్న అద్దె ఆదాయానికి బ్రేక్ పడుతుంది. ఇలా అద్దె ఆదాయాన్ని నష్టపోకుండా, బీమా సంస్థ చెల్లించేలా యాడాన్ కవర్ తీసుకోవచ్చు. దీనికి ప్రతి నెలా రూ.25వేల అద్దె చొప్పున ఆరు నెలల పాటు చెల్లించే కవర్‌కు ప్రీమియం రూ.2,000 ఉంటుంది. వ్యక్తిగత ప్రమాద బీమా ప్రత్యేకంగా ఉంటే, హోమ్ ఇన్సూరెన్స్‌తో తీసుకోవాల్సిన అవసరం లేదు.

భారం తగ్గాలంటే..?



హోమ్ ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించుకునేందుకు కొన్ని మార్గాలు న్నాయి. ఇల్లు, ఇంట్లోని వస్తువులకు నష్టం వాటిల్లినప్పుడు, కొంత మొత్తాన్ని తామే భరించేట్టు అయితే ప్రీమియం తగ్గుతుంది. కొన్ని కంపెనీలే ఈ ఆప్షన్ ఇస్తున్నాయి. ఇంట్లో అన్నింటికీ బీమా అవసరం ఉండదు. బాగా పాత పడిపోయిన వాటికి, పెద్దగా వ్యాల్యూ లేని (తరుగు బాగా పడే) వాటికి బీమా అనవసరం. అగ్ని ప్రమాదం జరిగితే హెచ్చరించి, అప్రమత్తం చేసే అలారమ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే, అగ్ని ప్రమాదాన్ని అదుపు చేసే పరికరాలు ఏర్పాటు చేసుకుంటే ప్రీమియంలో 15 శాతం వరకు తగ్గింపు లభిస్తుంది. స్వయం ఉపాధిలోని నిపుణులు లేదా వ్యాపారులు అయితే హోమ్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. వేతన జీవులకు ఈ వెసులుబాటు లేదు. ఏడాదికి కాకుండా, ఏడాదికి మించి ఎక్కువ కాలానికి పాలసీ తీసుకుంటే ప్రీమియంలో 10 శాతం తగ్గింపు వస్తుంది.

వచ్చే వారం రిలయన్స్ డేటా సెంటర్ ప్రారంభం

బ్రూక్‌ఫీల్డ్, డిజిటల్ రియాలిటీతో కలిసి ఏర్పాటు



చెన్నై: వేగంగా వృద్ధి చెందుతున్న డేటా సెంటర్స్ విభాగంలోకి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎంట్రీ ఇస్తోంది. వచ్చే వారం చెన్నైలో సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు సంస్థ చైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడించారు. కెనడాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్, అమెరికాకు చెందిన డిజిటల్ రియాలిటీ సంస్థలతో కలిసి దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. తమిళనాడు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు వివరించారు. చెన్నైలో 20 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న ఈ జాయింట్ వెంచర్ సంస్థ ముంబైలో మరో 40 మెగావాట్ల సెంటర్ కోసం 2.15 ఎకరాలు కొనుగోలు చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	565-00
విజయవాడ	565-00
రిటైల్ ధర (డజను)	72.00
7-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	560-00
వరంగల్	562-00
రిటైల్ ధర	6.00

స్టాక్స్ వ్యూ

ఎల్‌జీ బాలకృష్ణన్ | సీడీ ఈక్విసెర్చ్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,263 టార్గెట్: రూ. 1,484

ఎందుకంటే: రోలర్ చైన్ల తయారీతోపాటు.. వార్మ్ అండ్ కోల్డ్ ఫోర్జింగ్, ఫైన్ బ్లాంకింగ్, మెషీన్డ్ పార్టులతో కూడిన మెటల్ ఫార్మింగ్ చేపట్టే ఆటోమొబైల్ విడిభాగాల దిగ్గజం ఎల్‌జీ బాలకృష్ణన్ బ్రదర్స్ దేశీయంగా ద్విచక్ర వాహన రంగానికి కీలక ప్రొడక్టులు అందిస్తోంది. అయితే పండుగల సందర్భాలను మినహాయిస్తే ఇటీవల కొద్ది రోజులుగా దేశీ ద్విచక్ర వాహన విభాగం మందగమనంలో సాగుతోంది. ఈ ఏడాది పండుగల నేపథ్యంలో ద్విచక్ర వాహన అమ్మకాలు జోరు చూపినప్పటికీ కంపెనీకి ప్రధానమైన ట్రాన్స్‌మిషన్ ప్రొడక్టుల బిజినెస్‌పై మందగమన ప్రభావం పడింది. 2023-24 తొలి అర్ధభాగం(ఏప్రిల్-సెప్టెంబర్) ఆదాయంలో 3.7 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. అయితే గతేడాది(2022-23) ఇదే కాలంతో పోలిస్తే లాభార్జన ఆశావహంగా 17.1 శాతం పురోగమించింది. దీంతో మార్జిన్లు 200 బేసిస్ పాయింట్ల(2 శాతం)మేర మెరుగుపడ్డాయి. ఇందుకు ముడిసరుకుల ధరలు దిగిరావడంతో తగ్గిన వ్యయాలు సైతం సహకరించాయి. ద్విచక్ర వాహన రంగంలో కొనసాగుతున్న మందగమనం కారణంగా ఈ ఏడాది ఆర్జనలో వృద్ధి 8 శాతానికి పరిమితంకావచ్చని భావిస్తున్నాం.

పీఐ ఇండస్ట్రీస్ | ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 3,451 టార్గెట్: రూ. 4,270

ఎందుకంటే: అగ్రిసైన్స్ దిగ్గజం పీఐ ఇండస్ట్రీస్ రూపొందించే పైరోగ్జాసల్ఫోన్‌ను భారీ స్థాయిలో తయారు చేసేందుకు చైనాలో ప్లాంట్ల ఏర్పాటుకు తెరలేచినట్లు వెలువడిన వార్తలు గతంలో కొంత ఆందోళనలకు లోనుచేశాయి. గోధుమలు, మొక్కజొన్న, సోయాబీన్ పంటల ముందస్తు రక్షణగా వినియోగించే హెర్బిసైడ్ ఇది. అగ్రికెమికల్స్‌కు ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా నిలిచే యూఎస్‌లో పైరోగ్జాసల్ఫోన్ 2025వరకూ పేటెంట్ రక్షణ పరిధిలోకి చేరే అవకాశముంది. ఇదేవిధంగా లాటిన్ అమెరికాలో 2030వరకూ అండర్ పేటెంట్‌కు వీలుంది. భారత్, ఆస్ట్రేలియావంటి చిన్న మార్కెట్లలో మాత్రమే పేటెంట్ పరిధినుంచి బయటపడింది. దీంతో 2026 డిసెంబర్‌లోగా యూఎస్‌లో పైరోగ్జాసల్ఫోన్ జనరిక్ రిజిస్ట్రేషన్ పొందేందుకు అవకాశాలు తక్కువే. అయితే ప్రస్తుత 60-70 కోట్ల డాలర్ల విలువైన పైరోగ్జాసల్ఫోన్ మార్కెట్ భవిష్యత్‌లో మరింత విస్తరించే వీలున్నట్లు కంపెనీ యాజమాన్యం అంచనాలు వేస్తోంది. ఇందుకు అత్యధిక వినియోగ మార్కెట్లయిన అమెరికా, ఆస్ట్రేలియాలలో ఈ ప్రొడక్ట్ వినియోగం మరింత పెరగడం తోడ్పాటును ఇవ్వనున్నట్లు భావిస్తోంది. పైరోగ్జాసల్ఫోన్ ప్రొడక్టులో ప్రపంచ నిల్వలు లేదా పోటీ పెరగడం వంటి అంశాల ద్వారా కంపెనీపై ఆర్థికంగా ప్రభావం పడే అవకాశాలు తక్కువే. ఫలితంగా ఇటీవల కంపెనీ షేరులో వచ్చిన దిద్దుబాటు తాత్కాలికమే.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్యాపిటల్ గెయిన్ బాండ్లలో ఇన్వెస్ట్ చేయొచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ప్రాపర్టీ విక్రయించినప్పుడు వచ్చిన లాభం నుంచి పన్ను చెల్లించి మిగిలిన మొత్తాన్ని ఈక్విటీ ఆధారిత సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచిదా? లేక దీర్ఘకాల మూలధన లాభాల పన్ను నుంచి మినహాయింపు కోసం ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్‌ఎఫ్‌సీ జారీ చేసే సెక్షన్ 54ఈసీ బాండ్లలో ఇన్వెస్ట్ చేసుకోవాలా..?

– అనిల్ మిశ్రా

ప్రాపర్టీని రెండేళ్లకు పైగా కలిగి ఉన్న తర్వాత విక్రయించినప్పుడు వచ్చిన లాభం నుంచి ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించడం) చేసిన తర్వాత మిగిలిన మొత్తంపై 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ప్రాపర్టీని విక్రయించిన ఆరు నెలల్లోపు క్యాపిటల్ గెయిన్ బాండ్లలో ఇన్వెస్ట్ చేసినప్పుడు ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 54ఈసీ కింద రూ.50 లక్షల వరకు లాభాన్ని మూలధన లాభాల నుంచి మినహాయింపునకు అవకాశం ఉంటుంది. రూ.50 లక్షలపై 20 శాతం పన్ను అంటే రూ.10 లక్షల మేర ఆదా చేసుకున్నట్టు అవుతుంది. ప్రభుత్వ మద్దతు గల ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్‌ఎఫ్‌సీ తదితర ఇన్‌ఫ్రా ఫైనాన్సింగ్ కంపెనీలు జారీ చేసే స్థిరాదాయ సాధనాలనే క్యాపిటల్ గెయిన్ బాండ్లుగా చెబుతారు. క్యాపిటల్ గెయిన్ బాండ్లు ఐదేళ్ల లాకిన్ పీరియడ్‌తో ఉంటాయి. వీటిపై 5.25 శాతం వార్షిక వడ్డీ రేటు వర్తిస్తుంది. ఈ వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. వడ్డీ ఆదాయాన్ని ఏటా రిటర్నుల్లో చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. 30 శాతం పన్ను పరిధిలో ఉన్న వారికి నికరంగా లభించే రేటు 3.68 శాతం. ఈక్విటీ ఫండ్స్‌తో పోల్చి చూసినప్పుడు క్యాపిటల్ గెయిన్ బాండ్లపై లభించే 5.25 శాతం రేటు చాలా తక్కువ. ఫ్లెక్సీక్యాప్ ఫండ్ గత ఐదేళ్ల కాల సగటు రాబడి 20 శాతంగా ఉంది. ఇప్పుడు పన్ను ఆదా కోసం క్యాపిటల్ గెయిన్ బాండ్లలో ఐదేళ్ల కాలానికి రూ.50 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే, 5.25 శాతం రేటు ప్రకారం గడువు తీరిన తర్వాత రూ.63 లక్షలు సమకూరుతుంది. అదే 20 శాతం క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ (రూ.10లక్షలు) చెల్లించి, మిగిలిన రూ.40 లక్షలను ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేస్తే ఐదేళ్లలో రూ.70 లక్షలు సమకూరుతుంది. ఈ గణాంకాలను పరిశీలించి చూసినప్పుడు మూలధన లాభాల పన్ను చెల్లించి, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయడమే మేలని అనిపిస్తుంది. కానీ, ఈక్విటీల్లో మెరుగైన రాబడి వస్తుందని చెప్పి మొత్తం తీసుకెళ్లి ఇన్వెస్ట్ చేయడం సంక్లిష్టం కావచ్చు. ఐదేళ్లు, అంతకుమించిన కాలాలకు ఈక్విటీల్లో మెరుగైన రాబడులు వస్తాయి. కానీ ఇదేమీ గ్యారంటీడ్ కాదు. ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కానీ, క్యాపిటల్ గెయిన్ బాండ్లు హామీతో కూడిన రాబడిని ఇస్తాయి. రిస్క్ లేని రాబడి కోరుకునేట్టు అయితే, ఐదేళ్ల తర్వాత కచ్చితంగా పెట్టుబడి మొత్తం కావాల్సిన వారు క్యాపిటల్ గెయిన్ బాండ్లకు వెళ్లొచ్చు. కొంత రిస్క్ తీసుకుని, అవసరమైతే ఐదేళ్లకు అదనంగా మరికొంత కాలం పాటు ఇన్వెస్ట్ చేసేట్టు అయితే దీర్ఘకాల మూలధన లాభాల పన్ను చెల్లించి మిగిలిన మొత్తాన్ని ఈక్విటీ పథకాలకు కేటాయించుకోవచ్చు.



ఎస్‌సీఎస్ఎస్ ఖాతాను ఎనిమిదేళ్ల తర్వాత కూడా పొడిగించుకోవచ్చా..?

– గురునాథ్

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్) నిబంధనల్లో సవరణ చోటు చేసుకుంది. ఈ పథకం కాల వ్యవధి ఐదేళ్లు. ఆ తర్వాత కోరుకుంటే మరో మూడేళ్ల కాలానికి దీన్ని పొడిగించుకోవచ్చు. ఇలా ఒక్కసారి మాత్రమే పొడిగింపునకు అవకాశం ఉండేది. ఆ తర్వాత కూడా అందులోనే ఇన్వెస్ట్‌మెంట్ కొనసాగించాలంటే, ఉపసంహరించుకుని మళ్లీ తాజాగా ఖాతా తెరవాల్సి వచ్చేది. ఈ నిబంధనను మార్చారు. ఇకపై ఐదేళ్ల ప్రాథమిక కాల వ్యవధి ముగిసిన తర్వాత నుంచి.. మూడేళ్లకు ఒకసారి చొప్పున ఖాతాను పొడిగించుకుంటూ వెళ్లొచ్చు. అంతేకానీ, ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ కొత్త ఖాతా తెరవాల్సిన అవసరం ఉండదు. గడువు పొడిగించే సమయంలో ఉన్న రేటు తదుపరి కాలానికి వర్తిస్తుంది. ఇందులో ప్రస్తుతం 8.2 శాతం వడ్డీ రేటు అమల్లో ఉంది. ఇప్పటికే పెట్టుబడి పెట్టి ఐదేళ్లు పూర్తయి ఉంటే, కొనసాగించుకోవడం వల్ల తదుపరి మూడేళ్ల కాలానికే 8.2 శాతం వడ్డీ రేటు వర్తిస్తుంది. దీనికి బదులు ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకుని, తిరిగి తాజాగా ఇన్వెస్ట్ చేయడం వల్ల ఐదేళ్ల కాలానికి 8.2 శాతం గరిష్ట రేటును పొందొచ్చు.

మన్యంపై మంచు దుప్పటి

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం, పెరిగిన చలి తీవ్రత



పాడేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏజెన్సీలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. పాడేరు మండలంలోని మినుమూలూరులో 6 డిగ్రీలు, చింతపల్లిలో 6.5 డిగ్రీలు, అరకులోయలో 9.3 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో చలి తీవ్రత భారీగా పెరిగింది. దీంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏపీలో 19, తెలంగాణలో 117 బోగస్ సంస్థలు

పన్ను ఎగవేత వివరాలు వెల్లడించిన కేంద్ర ఆర్థిక శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: వస్తు సేవల పంపిణీ లేకుండా బోగస్ ఇన్‌వాయిస్‌లు సృష్టించి పన్ను ఎగవేతలకు పాల్పడిన నకిలీ సంస్థలు ఏపీలో 19, తెలంగాణలో 117 ఉన్నట్లు గుర్తించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా 29,273 సంస్థలు రూ.44,015 ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఎగవేతలకు పాల్పడినట్లు తెలిపింది. మే 2023 నుంచి నకిలీ సంస్థల గుర్తింపునకు డ్రైవ్ నిర్వహించినట్లు పేర్కొంది. ఏపీలో 19 నకిలీ సంస్థలు రూ.765 కోట్ల పన్ను ఎగవేతకు పాల్పడగా రూ.11 కోట్లు రికవరీ చేశామంది. తెలంగాణలో 117 నకిలీ సంస్థలు రూ.1,645 కోట్ల పన్ను ఎగవేతకు పాల్పడగా రూ.44 కోట్లు రికవరీ చేశామంది.

'ఏపీ' మార్కెట్‌లోకి కొత్త 'మసాలా'

- మసాలాల తయారీ రంగంలోకి 'లాల్జీ గోధూ అండ్ కో'
- ఏపీ నుంచి దేశవ్యాప్తంగా మసాలా ఉత్పత్తుల ప్రారంభం
- 'సాక్షి'తో సంస్థ చైర్‌పర్సన్ హీనా మర్చంట్, పార్టనర్ రిద్ధి మర్చంట్



సాక్షి, అమరావతి: రాష్ట్ర మార్కెట్‌లోకి మరో కొత్త మసాలా ప్యాకెట్లు వచ్చాయి. శతాబ్దానికిపైగా ఇంగువ తయారీ, అమ్మకాల్లో ప్రసిద్ధి చెందిన ముంబై కంపెనీ లాల్జీ గోధూ అండ్ కో (ఎల్‌జీ) తమ ఉత్పత్తులను శనివారం విజయవాడలో విడుదల చేసింది. పసుపు, కొత్తిమీర, ఎర్ర మిరపకాయ, జీలకర్ర, కశ్మీరీ చిల్లీ పౌడర్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా సంస్థ చైర్ పర్సన్ హీనా మర్చంట్, పార్టనర్ రిద్ధి మర్చంట్ 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'సంస్థలో దాదాపు 300 కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. మా సంస్థ ఇంగువ (ఆసఫోటిడా) తయారీకి ప్రసిద్ధి. చెన్నై, ముంబై, నాసిక్‌లో తయారీ కేంద్రాలున్నాయి. దేశవ్యాప్తంగా 60మంది మేజర్ డిస్ట్రిబ్యూటర్స్ ఉన్నారు. ఏపీతో 50 ఏళ్ల అనుబంధం ఉంది. ఇక్కడి ప్రజలు మా కంపెనీ ఇంగువను విశేషంగా ఆదరిస్తున్నారు. మా ఉత్పత్తులు క్వాలిటీ విషయంలో రాజీపడం. పలు దేశాల నుంచి ముడిసరుకులు తెప్పిస్తున్నాం. మసాలాల కోసం ఏపీ గుంటూరు మిర్చితో పాటు గుజరాత్, ఇతర రాష్ట్రాల నుంచి ముడిసరుకులు సేకరించి నాణ్యతతో తయారు చేస్తున్నాం. భవిష్యత్తులోనూ మరిన్ని మంచి ఉత్పత్తులను తీసుకువస్తాం. అలాగే డిస్ట్రిబ్యూటర్స్ నుంచి ఎప్పటికప్పుడు సలహాలు తీసుకుంటున్నాం. వాటికి అనుగుణంగా వినియోగదారులకు మా ఉత్పత్తులను అందించడానికి కృషి చేస్తున్నాం. వారందరి సహకారంతోనే ఇప్పుడు మా ప్రొడక్ట్స్ విదేశాల్లోనూ అందుబాటులో ఉన్నాయి' అని తెలిపారు.

పుస్తకం చేతిలో ఉంటే మంచి స్నేహితుడు వెంట ఉన్నట్లే

- ప్రముఖ సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి
- విజయవాడలో ముగిసిన 34వ పుస్తక మహోత్సవం



మాట్లాడుతున్న తనికెళ్ల భరణి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు) : పుస్తకం చేతిలో ఉంటే మంచి స్నేహితుడు వెంట ఉన్నట్లేనని సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. ఆదివారం జరిగిన ముగింపు సభకు ఆయన హాజరయ్యారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహించిన 34వ పుస్తక మహోత్సవం ఆదివారం ముగిసింది. డిసెంబర్ 28న మొదలైన ఈ పుస్తక మహోత్సవం 11 రోజుల పాటు జరిగింది. పుస్తక మహోత్సవం ఆవరణలోని కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై ప్రతిరోజూ పలు పుస్తకాలను ఆవిష్కరించారు. పుస్తకమహోత్సవం ఆవరణలోని శ్రీరమణ ప్రతిభా వేదికపై విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. ముగింపు సభలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఏఎండీ ఇంతియాజ్, ఎమెస్కో సంస్థ అధినేత విజయకుమార్, విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షుడు మనోహర్ నాయుడు, గౌరవాధ్యక్షుడు బెల్లపు బాజ్జీ తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం పోటీల్లో విజేతలైన వారికి అతిథులు బహుమతులను అందచేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.